


PRAJA PRASHNA

# ప్రజాప్రశ్న

RNI : TELTEL/2021/80267

తెలుగు దినపత్రిక




సంపుటి: 6 సంచిక: 07, పేజీలు - 08

బుధవారం, జులై 1, 2026 వెల: 5 రూ/.

హైదరాబాద్ | ప్రజల పక్షాన ప్రశ్నించే పత్రిక | HYDERABAD

# వరిసాగు తగ్గించి మెట్టపంటలు వేసుకోండి

## రైతులకు రేవంత్ రెడ్డి సూచన

- సాగుకు ఉచిత కరెంట్ కాంగ్రెస్ పేటెంట్ హక్కు
- రాష్ట్రాన్ని కేసీఆర్ అప్పులపాలు చేశారు
- కాళేశ్వరం కూలేశ్వరం అయ్యింది - ఫామ్‌హౌస్ పశుపతిని రానీయొద్దని పిలుపు!





హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) రైతు భరోసా నిధుల విడుదల కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. ఈ ఏడాది ఎల్‌నినో కారణంగా వర్షాలు తక్కువ పడతాయని శాస్త్రవేత్తలు చెబుతున్నారని వివరించారు. అందుకే రైతులు ఈసారికి వర్షాధార పంటలు ఎక్కువ వేయొద్దని సూచించారు. పంటమార్పిడి గురించి ఆలోచించాలని హితవుపలికారు. నిపుణుల సూచనల మేరకు పంటలు వేయాలని అందుకు తగ్గట్టు విత్తనాలు పంపిణీ చేసేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని వెల్లడించారు.

వర్షాలు ఎక్కువగా పడటం లేదని నిపుణుల సూచనల మేరకే తాను ఇలాంటి పిలుపునిచ్చానని, దీన్ని కూడా బీఆర్ఎస్ వాళ్లు రాజకీయం చేస్తారని రేవంత్ మండిపడ్డారు. అన్ని సక్రమంగా ఉన్నప్పుడే వరి వేస్తే ఉరి అంటూ స్టేట్మెంట్లు ఇచ్చారని గుర్తు చేశారు. కానీ ఇప్పుడు పరిస్థితి భిన్నంగా ఉందన్నారు. దీనిపై ఎంత దుష్ప్రచారం చేసినా నమ్మొద్దని రైతులకు సూచించారు. ఆ కుటుంబానికి అబద్ధాలు చెప్పాలనే శాపం ఉందని ఎద్దేవా చేశారు. వారు నిజాలు చెబితే తలలు వేయి ముక్కలు అవుతాయిని అందుకే వారు ఎప్పుడూ నిజం చెప్పలేరని అన్నారు.కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే రైతులు రోడ్డున పడతారని ఎన్నికల్లో ప్రచారం చేశారని కానీ కాంగ్రెస్ ప్రభుత్వాలు చేసిన మేలు మాత్రం రైతులు గుర్తు పెట్టుకున్నారని రేవంత్ అన్నారు. దేశంలో ఉచిత విద్యుత్ ప్రారంభించిందే కాంగ్రెస్ ప్రభుత్వమని అన్నారు. అదే స్ఫూర్తితో నేడు కూడా రైతులకు మేలు చేయాలని పథకాలు తీసుకొచ్చామని వివరించారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగాలేకపోయినా రైతులకు, ఉద్యోగులకు కష్టం రాకుండా చూస్తున్నామని అన్నారు. ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన తర్వాత తెలంగాణను అప్పులు పాలు చేసిన కేసీఆర్ బ్యాచ్ నిత్యం తప్పుడు ప్రచారం చేస్తుందన్నారు. 8.11 లక్షల కోట్ల అప్పుతో అధికార బాధ్యతలు తీసుకున్న తర్వాత ఎక్కా రాజీ పడకుండా అన్ని వర్గాలకు మేలు చేస్తున్నామని వివరించారు. నాడు ఒక కుటుంబం చేసిన అప్పు కారణంగా మరింత మేలు చేయాలని ఉన్నా చేయలేని పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు.

2లో..

## ఎస్ఐఆర్ ప్రక్రియ, ఈసీ పాత్రపై

# విపక్షాల అభ్యంతరం

### - సీజేఐకు 23 పార్టీలు సంయుక్త లేఖ



**న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్)** దేశంలో ఎన్నికల ప్రక్రియ, సమగ్ర ఓటరు జాబితా సవరణ (సర్) అంశాలపై అధికార, ప్రతిపక్షాల మధ్య మరోసారి రాజకీయ వేడి రాజుకుంది. సర్ ప్రక్రియపై తీవ్ర అభ్యంతరాలు వ్యక్తం చేస్తూ సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్కు ఇండియా కూటమి లేఖ రాసింది. ఈ లేఖకు మొత్తం ఒక స్వతంత్ర ఎంపీతో పాటు 23 రాజకీయ పార్టీలు మద్దతు తెలపడం రాజకీయంగా ప్రాధాన్యం సంతరించుకుంది. లేఖ రాసిన విషయాన్ని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ ఎక్స్ వేదికగా వెల్లడించారు.

'జూన్ 8న జరిగిన ఇండియా జనబంధన్ సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు జైరాం రమేశ్ వెల్లడించారు. ఈ సమావేశానికి 21 రాజకీయ పార్టీలు, ఒక స్వతంత్ర సభ్యుడు హాజరయ్యారని తెలిపారు. ప్రస్తుతం మరో రెండు పార్టీలు మద్దతు తెలపడంతో మొత్తం 23 పార్టీలు ఈ లేఖపై సంతకం చేశాయని పేర్కొన్నారు. విపక్ష పార్టీల ఐక్యతకు 'స్యూర్' అనే నినాదాన్ని ప్రస్తావించారు. ఇందులో 'సాలిడారిటీ', 'యూనిటీ', 'రెసిస్టెన్స్' అనే మూడు అంశాలు ప్రధానంగా ఉన్నాయని ఆయన పేర్కొన్నారు.

2లో..

# దేశ నిర్మాణంలో యువతదే కీలక పాత్ర

### - గిరిజన వర్సిటీ స్నాతకోత్సవంలో రాష్ట్రపతి భావోద్వేగ ప్రసంగం!




**విశాఖపట్నం (ప్రశ్న న్యూస్)** భారతదేశ భవిష్యత్తును నిర్మించడంలో విద్యావంతులైన యువతదే అత్యంత కీలకమైన భూమిక అని భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము స్పష్టం చేశారు. మంగళవారం విశాఖపట్నంలో వైభవంగా జరిగిన ఆంధ్రప్రదేశ్ కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయం మొదటి స్నాతకోత్సవ కార్యక్రమానికి ఆమె ముఖ్యఅతిథిగా విచ్చేసి విద్యార్థులకు పట్టాలను, ప్రతిభ కనబరిచిన వారికి బంగారు పతకాలను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి రాష్ట్రపతి మాట్లాడారు. ఒక మారుమూల గిరిజన గ్రామం నుంచి వచ్చి, ఆ గ్రామంలోనే మొదటి గ్రాడ్యుయేట్‌గా నిలిచిన తాను, నేడు ఇంతమంది గిరిజన, వెనుకబడిన వర్గాల యువతీయువకులకు ఉన్నత విద్యా పట్టాలను అందించడం అపరిమితమైన ఆనందాన్ని, భావోద్వేగాన్ని కలిగిస్తోందని పేర్కొన్నారు.

#### వెనుకబడిన వర్గాలను మరవద్దు.. సమాజానికి తిరిగిచ్చేయండి!

ఉన్నత విద్యావంతులుగా జీవితంలో అత్యున్నత శిఖరాలను అధిరోహించే క్రమంలో సమాజంలో ఇంకా వెనుకబడి ఉన్న అట్టడుగు వర్గాలను ఎన్నటికీ మరవకూడదని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము విద్యార్థులకు హితవు పలికారు. మీరు

2లో..

## రూ. 30 వేల కోట్ల రైతుభరోసా నిధులు ఎగ్గొట్టారు

### - రేవంత్ రెడ్డిపై కేటీఆర్ సంచలన కామెంట్స్



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్ర పదజాలంతో విరుచుకుపడ్డారు. రైతు భరోసాకు సంబంధించి సీఎం రేవంత్ రెడ్డి పీఆర్ స్టంట్లు చూసి రైతులు అసహ్యించుకుంటున్నారని విమర్శించారు. ఈ మేరకు కేటీఆర్ ఎక్స్‌లో పోస్టు చేశారు. రేవంత్ రెడ్డిది ముదనష్టపు పాలన అని వారి 30 నెలల పాలనలో

2లో..

## ఖనిజ సంపదపై

# చంద్రబాబు మాస్టర్ ప్లాన్

### - ఆదాయం పెంపే లక్ష్యంగా కీలక ఆదేశాలు

- రాష్ట్రంలో ఖనిజ నిల్వల గుర్తింపునకు మినరల్ మ్యాపింగ్ చేయాలని సీఎం ఆదేశం
- ఖనిజాలకు రాష్ట్రంలోనే విలువ జోడింపు ద్వారా ఆదాయం పెంచడంపై ప్రత్యేక దృష్టి
- అరుదైన ఖనిజాల వెలికితీతకు క్లస్టర్ ఏర్పాటు చేయాలని అధికారులకు సూచన

అమరావతి (ప్రశ్న న్యూస్) రాష్ట్రంలో అందుబాటులో ఉన్న అపారమైన ఖనిజ సంపదను సద్వినియోగం చేసుకుని, ప్రభుత్వ ఆదాయాన్ని గణనీయంగా పెంచుకోవడంపై ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రత్యేకంగా దృష్టి సారించారు. ఇందులో భాగంగా, రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఖనిజ నిక్షేపాలను గుర్తించేందుకు సమగ్రమైన 'మినరల్ మ్యాపింగ్' చేపట్టాలని అధికారులను ఆదేశించారు. కేవలం ముడి ఖనిజాలను వెలికితీయడమే కాకుండా, వాటికి రాష్ట్రంలోనే విలువ జోడించే (వాల్యూ యాడిషన్) ప్రక్రియలను ప్రోత్సహించడం ద్వారా గరిష్ఠ ప్రయోజనం పొందాలని స్పష్టం చేశారు. మంగళవారం తన క్యాంపు కార్యాలయంలో గనుల శాఖపై నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన పలు కీలక సూచనలు చేశారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ,

2లో..



## ఎండిపోతున్న దేశం

### - ఎప్పుడూ లేనంతగా.. ఎందుకింత దారుణం!



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** భారతదేశ వ్యాప్తంగా ఈ ఏడాది జూన్ నెలలో గత 126 ఏళ్ల చరిత్రలోనే మూడో అత్యంత దారుణమైన అల్ప వర్షపాతం నమోదైంది. సోమవారం నాటికి దేశవ్యాప్తంగా కేవలం 92.1 మిల్లీమీటర్ల నైరుతి రుతుపవనాల వర్షపాతం మాత్రమే నమోదైంది. ఇది సాధారణంగా కురవాల్సిన వర్షపాతం కంటే ఏకంగా 42 శాతం లోటు కావడం గమనార్హం. జూన్ నెల మంగళవారంతో ముగియనుండటంతో ఈ ఏడాది జూన్ వర్షపాతం రికార్డు స్థాయిలో అత్యంత కనిష్టానికి పడిపోవడం దాదాపు ఖాయంగా కనిపిస్తోంది.

భారత వాతావరణ శాఖ ప్రకారం 1901 నుంచి ఇప్పటివరకు కేవలం నాలుగు సార్లు మాత్రమే జూన్ నెలలో దేశవ్యాప్తంగా 100 మిల్లీమీటర్ల కంటే తక్కువ వర్షపాతం నమోదైంది. ఇందులో అత్యంత దారణమైన ఏడాదిగా 2009 నిలిచింది. అప్పట్లో కేవలం 87.5 మిల్లీమీటర్ల వర్షం మాత్రమే కురిసింది. ఆ తర్వాత 1905లో 92.3 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. ప్రస్తుత పరిస్థితులను బట్టి చూస్తే ఈ ఏడాది జూన్ నెల ఆ తర్వాతి స్థానాన్ని

2లో..

# హైదరాబాద్‌లో ఎయిర్‌టెల్ విస్తరించండి

### - సునీల్ మిట్టల్‌కు సీఎం రేవంత్ ఆహ్వానం

- డిజిటల్, క్లౌడ్, ఏఐ రంగాలపై దృష్టి పెట్టాలని సూచన
- తెలంగాణ పెట్టుబడులకు అనుకూల రాష్ట్రంగా వివరణ
- యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ ప్రస్తావన
- ఐటీఐలు, పాలిటెక్నిక్‌ల ఆధునికీకరణపై చర్చ



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** హైదరాబాద్.. గ్లోబల్ ఇన్వెస్ట్‌మెంట్ హబ్‌గా మరో ప్రతిష్టాత్మక మైలురాయికి చేరువవుతోంది. ప్రముఖ పారిశ్రామికవేత్త, భారతీ ఎంటర్‌ప్రైజెస్ వ్యవస్థాపక చైర్మన్ సునీల్ భారతీ మిట్టల్ హైదరాబాద్ ను ఎయిర్‌టెల్ సెకండ్ హెడ్‌క్వార్టర్స్‌గా ఏర్పాటు చేసే అంశాన్ని పరిశీలిస్తున్నట్లు ప్రకటించారు. హైదరాబాద్‌లోని ఎంసీఆర్ హెచ్‌ఆర్‌డీ ఇన్‌స్టిట్యూట్ లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో ఆయన సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా పలు అంశాలపై చర్చించారు. తెలంగాణలో పెట్టుబడులకు గల అనుకూలతలు, ఇక్కడి నూతన పారిశ్రామిక సింగిల్ క్లియరెన్స్ విధానాలు, ప్రభుత్వం

2లో..

# వరంగల్‌లో 'బంగారు' పొలం

### - పసిడి కోసం పొలానికి క్యూ కడుతున్న జనం!

### - నాదంటే నాదంటున్న కొత్త, పాత ఓనర్లు




**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** సాధారణంగా పంటలు పండే భూమికి గిరాకీ ఉంటుంది. కానీ, వరంగల్ జిల్లాలో ఓ ఆరెకరాల భూమికి మాత్రం పంటలతో సంబంధం లేకుండా విపరీతమైన డిమాండ్ ఏర్పడింది. ఆ భూమిని కౌలుకు తీసుకుంటే రాత్రికి రాత్రే కోటీశ్వరులు కావచ్చనే ప్రచారంతో స్థానిక రైతులు దాని కోసం పోటీ పడుతున్నారు. ఇటీవల పొలంలో పురాతన బంగారు ఆభరణాలు బయటపడటంతో ఈ భూమి మరోసారి వార్తల్లో నిలిచింది. దీంతో నిధుల కోసం జనం ఎగబడటం, హక్కుల కోసం పాత, కొత్త యజమానుల మధ్య వివాదం మొదలవ్వడంతో ఈ వ్యవహారం తీవ్ర చర్చనీయాంశంగా మారింది. చెన్నారావుపేట మండలం కోపాకులపాడు గ్రామంలోని ఈ ఆరెకరాల భూమిని పదేళ్ల క్రితం

2లో..

## బండి సంజయ్‌కి

# బిగ్ రిలీఫ్

- హుజూరాబాద్ ఉప ఎన్నికల సమయంలో బండి సంజయ్‌పై కేసు నమోదు
- బీఆర్ఎస్ పై వ్యాఖ్యలపై కేసు నమోదు చేసిన హుజూరాబాద్ పోలీసులు



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) హుజూరాబాద్ ఉప ఎన్నికల సమయంలో నమోదైన కేసులో కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్‌కు కోర్టు నుంచి భారీ ఊరట లభించింది. ఈ కేసును విచారించిన నాంపల్లి ప్రజాప్రతినిధుల ప్రత్యేక కోర్టు ఆయనపై నమోదైన కేసును కొట్టివేస్తూ తీర్పు వెలువరించింది. హుజూరాబాద్ ఉప ఎన్నికల ప్రచారం సందర్భంగా అప్పటి అధికార పార్టీ అయిన కేసీఆర్ నేతృత్వంలోని బీఆర్ఎస్ ఓటర్లకు ఒక్కో ఓటుకు రూ.25 వేల వరకు డబ్బులు పంపిణీ చేస్తోందని బండి సంజయ్ తీవ్ర ఆరోపణలు చేయడం తీవ్ర దుమారం రేపింది. అయితే ఓటర్లకు రూ.5 వేలు అందించి మిగిలిన మొత్తాన్ని పార్టీ

2లో..

# ఇక డాలర్‌తో పనిలేదు

### - భారత్-జపాన్ కీలక ఒప్పందం!



న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్) భారత్, జపాన్ దేశాల మధ్య ద్వైపాక్షిక వాణిజ్యాన్ని మరింత సులభతరం చేసే దిశగా మరో కీలక అడుగు పడనుంది. ఇరు దేశాల మధ్య లావాదేవీలకు అమెరికా డాలర్‌పై ఆధారపడకుండా, నేరుగా రూపాయి-యెన్‌లలోనే చెల్లింపులు జరిపేందుకు వీలుగా ఒక కొత్త వ్యవస్థను ఏర్పాటు చేయబోతున్నాయి. జులై 1 నుంచి 3 వరకు జపాన్ ప్రధాని

2లో..

## ప్రధాని మోడీ అత్యున్నత సమీక్ష

### - కేబినెట్ మార్పుల వేళ మంత్రులపై రిపోర్ట్



**న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్)** ప్రధానమంత్రి మోడీ కేంద్ర మంత్రిత్వ శాఖల కార్యదర్శులతో జరిగిన ఉన్నత స్థాయి సమావేశానికి అధ్యక్షత వహించారు. విధాన సంస్కరణలు, వ్యాపార సౌలభ్యాన్ని మెరుగుపరచడం వంటి అంశాలపై ఆయన చర్చించారు. సోమవారం సీషెల్స్‌లో తన అధికారిక పర్యటనను ముగించుకుని వచ్చిన ప్రధాని మంగళవారం కీలక అధికారులతో భేటీ అయ్యారు. రెండు నెలల్లో ప్రధానమంత్రి ఉన్నతాధికారులతో

2లో..

## వరిసాగు తగ్గించి మెట్టపంటలు వేసుకోండి

పదేళ్లు అన్ని వర్గాలను వంచించి ఒక కుటుంబమే ఆర్థికంగా ఎదిగిందని రేవంత్ ఫైర్ అయ్యారు. లెక్కలు తీస్తే భారీగా అప్పులు వెలుగు చూశాయని చెప్పుకొచ్చారు. అన్ని శాఖల్లో బిల్లులు పెండింగ్‌లో పెట్టారని , ప్రభుత్వ ఉద్యోగుల జీతాలు కూడా 1వ తేదీన ఇవ్వలేక వాయిదా పద్ధతుల్లో ఇచ్చారని గుర్తు చేశారు. అలాంటి వ్యక్తులు మళ్లీ అధికారంలోకి వస్తే అంతకంటే దారుణమైన పాలన ఉంటుందని హెచ్చరించారు. అరుంధతి సినిమాలో పశుపతిని బంధించినట్టు కేసీఆర్‌ను ఫామ్‌హౌస్‌లో ప్రజలంతా బంధించారని, మళ్లీ అలాంటి వ్యక్తి బయటకు వస్తే ఎంతటి విధ్వంసం ఉంటుందో ఊహించుకోవాలని అన్నారు.

### ఎస్ఐఆర్ ప్రక్రియ, ఈసీ పాత్రపై

## విపక్షాల అభ్యంతరం

ప్రజాస్వామ్య విలువలు, రాజ్యాంగ పరిరక్షణ, ఎన్నికల పారదర్శకత కోసం కలిసి పోరాడతామని స్పష్టం చేశారు. ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ ప్రక్రియ వల్ల కోట్లాది మంది ఓటు హక్కులు ప్రమాదంలో పడే అవకాశం ఉందని ఇండియా కూటమి ఆందోళన వ్యక్తం చేసింది. సరైన ధృవీకరణ లేకుండా పేర్లు తొలగించే పరిస్థితులు తలెత్తితే ప్రజాస్వామ్యానికి తీవ్ర నష్టం వాటిల్లుతుందని పేర్కొంది. అలాగే ఎన్నికల వ్యవస్థలో పారదర్శకత, స్వతంత్రత కొనసాగాలని, ఎన్నికల సంఘం తీసుకునే చర్యలు ప్రజల విశ్వాసాన్ని దెబ్బతీయకుండా ఉండాలని లేఖలో ప్రస్తావించినట్లు సమాచారం. ఇండియా జనబంధన్ సమావేశంలో కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే కేంద్ర ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు గుప్పించారు. దేశంలో ప్రజాస్వామ్య సంస్థలు ఒత్తిడికి గురవుతున్నాయని, రాజ్యాంగంపై నిరంతర దాడులు కొనసాగుతున్నాయని ఆయన ఆరోపించారు. ఓటరు జాబితా సవరణ పేరుతో ప్రజల ఓటు హక్కులను హరించే ప్రయత్నం జరుగుతోందని, కేంద్ర దర్యాప్తు సంస్థలను రాజకీయ ప్రత్యర్థులపై ఒత్తిడి తీసుకురావడానికి ఉపయోగిస్తున్నారని విమర్శించారు. బీజేపీయేతర రాష్ట్ర ప్రభుత్వాలపై వివక్ష కొనసాగుతోందని కూడా ఆరోపించారు.

#### ఆర్థిక, సామాజిక అంశాల ప్రస్తావన

దేశంలో ద్రవ్యోల్బణం పెరుగుతుండటం, నిరుద్యోగ సమస్య తీవ్రమవడం, కొత్త పెట్టుబడులు ఆశించిన స్థాయిలో రాకపోవడం వంటి అంశాలను కూడా ఖర్గే ప్రస్తావించారు. సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలు సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నాయని, పరీక్షల నిర్వహణలో లోపాల కారణంగా యువత ఆశలు దెబ్బతింటున్నాయని అన్నారు. అలాగే బలహీన వర్గాలపై దాడులు కొనసాగుతున్నాయని, విదేశాంగ విధానంలో కూడా సంప్రదాయ విలువలు దెబ్బతిన్నాయని ఆయన ఆరోపించారు. మొదట ఇండియా కూటమి సమావేశంలో ఈ అంశంపై చర్చ జరిగినప్పటికీ, అన్ని పార్టీలు ఒకే వేదికపైకి వస్తాయా అన్న సందేహాలు వ్యక్తమయ్యాయి. కానీ తర్వాత ఆప్, డీఎంకే కూడా సంయుక్త లేఖకు మద్దతు తెలిపాయి. దీంతో ఎన్నికల వ్యవస్థకు సంబంధించిన అంశాల్లో విపక్షాలు మరోసారి ఏకతాటిపైకి వచ్చాయనే సంకేతాలు కనిపిస్తున్నాయి. ఇక ఈ లేఖపై కేంద్ర ప్రభుత్వం, ఎన్నికల సంఘం ఎలాంటి స్పందన వ్యక్తం చేస్తాయన్నది రాజకీయంగా ఆసక్తికరంగా మారింది.

## ఖనిజ సంపదపై చంద్రబాబు మాస్టర్ ప్లాన్

"దేశంలోని కొన్ని రాష్ట్రాలు కేవలం ఖనిజాల ద్వారా వచ్చే ఆదాయంతోనే రెవెన్యూ మిగులు సాధిస్తున్నాయి. మన రాష్ట్రంలోనూ ఖనిజ సంపదకు మార్కెట్ క్యాపిటలైజేషన్ ద్వారా విస్తృత అవకాశాలు ఉన్నాయి. ప్రభుత్వ రంగ సంస్థ అయిన ఏపీఎండీసీ ద్వారా ఈ అవకాశాలను అందిపుచ్చుకోవాలి. దీనిపై నిపుణులతో అధ్యయనం చేయించి, ఒక పటిష్టమైన విధానాన్ని రూపొందించాలి" అని అన్నారు. బీచ్ శాండ్, రేర్ ఎర్త్ మినరల్స్, ముడి ఇనుము, మాంగనీస్, అల్యూమినా వంటి ఖనిజాలకు ఇక్కడే విలువ జోడింపు ప్రక్రియలు జరిగేలా చూడాలని దిశానిర్దేశం చేశారు.

#### అరుదైన ఖనిజాలపై ప్రత్యేక దృష్టి

ఎలక్ట్రానిక్స్, మాగ్నెట్స్, అణు ఇంధనం వంటి వ్యూహాత్మక రంగాల్లో కీలకంగా ఉపయోగపడే అరుదైన భూ ఖనిజాల (రేర్ ఎర్త్ మినరల్స్)పై సీఎం ప్రత్యేకంగా ప్రస్తావించారు. ఏపీ, ఒడిశా, కేరళ రాష్ట్రాల్లో లభ్యమయ్యే ఈ ఖనిజాల కోసం ఒక క్లస్టర్‌ను ఏర్పాటు చేసే అంశాన్ని పరిశీలించాలని సూచించారు. టైటానియం, ఇలమనైట్, మోనజైట్ వంటి అత్యంత విలువైన ఖనిజాల నిల్వలను కచ్చితంగా అంచనా వేయాలన్నారు. అలాగే, రాష్ట్రంలోని జొన్నగిరి, చిత్తూరు జిల్లా చిగురుగుంట ప్రాంతాల్లో ఉన్న బంగారం నిల్వలపై మరింత లోతుగా అధ్యయనం చేసి, ఇతర బ్లాకుల్లోనూ అన్వేషణ జరపాలని గనుల శాఖకు సూచించారు. రాష్ట్రంలో మొత్తం 126 ప్రాంతాల్లో క్రిటికల్, బల్క్, ఇతర విలువైన ఖనిజాలను గుర్తించినట్లు అధికారులు ఈ సమావేశంలో సీఎంకు వివరించారు.

#### టెక్నాలజీతో ఇసుక పర్యవేక్షణ

ప్రజలకు ఉచితంగా అందిస్తున్న ఇసుక విధానంలో పారదర్శకతకు, అక్రమాలకు తావులేకుండా చూడటానికి టెక్నాలజీని పూర్తిస్థాయిలో వినియోగించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశించారు. "ప్రజల ప్రయోజనాల కోసం ప్రభుత్వం సుమారు రూ.1000 కోట్ల ఆదాయాన్ని వదులుకుని ఇసుకను ఉచితంగా అందిస్తోంది. ఇది దుర్వినియోగం కాకుండా చూడాల్సిన బాధ్యత అధికారులదే" అని స్పష్టం చేశారు.ఇసుక రీచ్‌ల వద్ద సీసీ కెమెరాలు, శాటిలైట్ చిత్రాల ద్వారా నిరంతర నిఘా, ఇసుక రవాణా చేసే వాహనాలకు జీపీఎస్ ట్రాకింగ్ తప్పనిసరిగా ఏర్పాటు చేయాలని ఆదేశించారు. గనుల తవ్వకాలను కట్టుదిట్టంగా నిర్వహించడం ద్వారా రాష్ట్రానికి గరిష్ట ఆదాయం సమకూరేలా చూడాలని అధికారులకు సూచించారు. ఈ సమీక్షా సమావేశంలో గనుల శాఖ మంత్రి కొల్లు రవీంద్ర, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సాయి ప్రసాద్, గనుల శాఖ ముఖ్యకార్యదర్శి ముఖేష్ కుమార్ మీనా, ఆర్థిక శాఖ ముఖ్యకార్యదర్శి పీయూష్ కుమార్ సహా పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## రూ. 30 వేల కోట్ల రైతుభరోసా నిధులు ఎగ్గొట్టారు

దాదాపు 30 వేల కోట్ల రైతుభరోసా నిధులు ఎగ్గొట్టారని కేటీఆర్ ఆరోపించారు. ఏకంగా నాలుగుసార్లు రైతుభరోసా ఎగ్గొట్టిన రేవంత్ రెడ్డి ద్రోహాన్ని రైతులు మరిచిపోతారని అనుకోవడం అవివేకమే అవుతుందని కేటీఆర్ అన్నారు. ప్రతి ఎకరానికి ఏడాదికి 15 వేలు ఇస్తానని గ్యారెంటీల గారడీచేసిన కాంగ్రెస్ చివరికి ఉన్నది ఊడగొట్టే దుస్థితి తెచ్చినందుకు ముందు ముక్కునేలకు రాయాలని డిమాండ్ చేశారు. అరకొరగా ఒకటి, రెండు ఎకరాలకు వేసినట్టు చేసి చేతులు దులుపుకుంటున్న పాపం కాంగ్రెస్‌ను నిరంతరం శాపంలా వెంటాడటం ఖాయమని పేర్కొన్నారు.ఇప్పటికే 50 వేల కోట్లతో చేయాల్సిన రెండులక్షల రుణమాఫీని చారాణా కూడా చేయకుండా అధికారంలోకి రాగానే అన్నదాత గొంతుకోశారని కేటీఆర్ ఆరోపించారు. రేవంత్ రెడ్డి 72 సార్లు ఢిల్లీ టూర్లకు, పనికిరాని పబ్లిక్ మీటింగ్‌లకు పెడుతున్న కోట్ల రూపాయల ఖర్చును ఆదాచేసి ఉంటే రైతులకు పెట్టుబడి సాయం దక్కేదని చెప్పుకొచ్చారు. 'రాష్ట్రవ్యాప్తంగా యూరియా దొరకక అన్నదాతల అల్లా కష్టాల నుంచి అటెన్షన్ డైవర్షన్ చేసే ఈ దిక్కుమాలిన చర్యలు ఏమాత్రం పనిచేయవని గుర్తుపెట్టుకో. కేంద్రం ఎంత కొంటే అంతే కొంటామని పంట కొనుగోళ్ల బాధ్యత నుంచి పూర్తిగా తప్పుకున్న మీ చేతకానితనాన్ని చూసి అన్నదాతలు పట్టలేని కోపంతో రగిలిపోతున్నారు. కేసీఆర్ టంచన్ గా 11 సార్లు, 73 వేల కోట్లను నేరుగా రైతుల ఖాతాలో వేసి రాష్ట్రంలో వ్యవసాయ విప్లవానికి నాంది పలికారు. పదేళ్లు పండగలా సాగిన వ్యవసాయాన్ని దండగలా మార్చి, రైతుకు వెన్నుపోటు పొడుస్తున్న మీ దుర్మార్గాన్ని అన్నదాతలు ఎన్నటికీ క్షమించే ప్రసక్తే లేదు. తెలంగాణ రాష్ట్ర చరిత్రలో రైతు బాంధవుడిగా కేసీఆర్ నిలిచి ఉంటే మీరు ఎప్పటికీ రైతు ద్రోహిగానే మిగిలి ఉంటారని గుర్తుపెట్టుకోండి" అని కేటీఆర్ ఎక్స్‌లో పోస్టు చేశారు.

## బండి సంజయ్‌కి బిగ్ రిలీఫ్

కార్యకర్తలు పంచుకుంటున్నారని కూడా ఆయన బహిరంగంగా వ్యాఖ్యలు చేయడం సంచలనం రేపింది. ఈ ఆరోపణల నేపథ్యంలో హుజూరాబాద్ పోలీసులు బండి సంజయ్‌పై కేసు నమోదు చేశారు. ఐపీసీ సెక్షన్లు 188, 171సీ, 505(2)తో పాటు ప్రజాప్రాతినిధ్య చట్టం 1951లోని సెక్షన్ 123(3ఏ) కింద కేసు నమోదు చేశారు. ఆ తర్వాత ఈ కేసు నాంపల్లి ప్రజాప్రతినిధుల ప్రత్యేక కోర్టులో విచారణకు వచ్చింది. సుదీర్ఘ విచారణ తర్వాత ఈ కేసులో సమర్పించిన ఆధారాలను పరిశీలించిన కోర్టు ఆరోపణలను బలపరిచే తగిన సాక్ష్యాధారాలు లేవని అభిప్రాయం వ్యక్తం చేసింది.

దీంతో బండి సంజయ్‌పై నమోదైన కేసును పూర్తిగా కొట్టివేస్తూ తాజాగా తీర్పును వెలువరించింది. ఈ నేపథ్యంలోనే తీర్పుతో హుజూరాబాద్ ఉప ఎన్నికల సందర్భంగా నమోదైన ఈ కేసులో బండి సంజయ్‌కి పూర్తి ఉపశమనం లభించినట్లు అయింది. కేసీఆర్, బీఆర్ఎస్ పార్టీపై బండి సంజయ్ చేసిన ఆ వ్యాఖ్యలు అప్పట్లో రాష్ట్రవ్యాప్తంగా తీవ్ర రాజకీయ దుమారానికి కారణం అయ్యాయి. ఈ కేసులో నాంపల్లి ప్రజాప్రతినిధుల ప్రత్యేక కోర్టులో అప్పటి నుంచి విచారణ సాగుతోంది. రెండు వైపులా వాదనలు విన్న జడ్జి బండి సంజయ్‌పై చేసిన ఆరోపణలకు సంబంధించి పోలీసులు ఎలాంటి ఆధారాలు లేవని స్పష్టం చేశారు. సరైన సాక్ష్యాధారాలను కోర్టు ముందు ప్రవేశపెట్టడంలో ప్రాసిక్యూషన్ విఫలమైందని ఈ కావడంతో ఈ కేసును కొట్టివేస్తున్నట్లు కోర్టు తేల్చి చెప్పింది.

## దేశ నిర్మాణంలో యువతదే కీలక పాత్ర

చదువుకుని జీవితంలో ఎంతో ఎత్తుకు ఎదగాలి కానీ అలా ముందుకు వెళ్లే క్రమంలో ఒక్కసారి వెనక్కి తిరిగి చూడండి. అక్కడ అభివృద్ధి కోసం, కనీస అవకాశాల కోసం ఎదురుచూస్తున్న ఎందరో పేదలు, అణగారిన వర్గాల వారు కనిపిస్తారు. వారిని చేయి పట్టి ప్రోత్సహించడంలో, వారికి సాధికారత కల్పించడంలో మీ వంతు సామాజిక బాధ్యతను నెరవేర్చాలి అని ఆమె పిలుపునిచ్చారు.

#### అబ్దుల్ కలాం జీవితం ఆదర్శం..

భారతదేశాన్ని 2047 నాటికి పూర్తిస్థాయిలో అభివృద్ధి చెందిన దేశంగా మార్చాలనే వికసిత్ భారత్ జాతీయ దార్శనికతను సాధించడంలో నేటి యువత పాత్రే అత్యంత ప్రధానమైనదని రాష్ట్రపతి నొక్కి చెప్పారు. యువత కేవలం ఉద్యోగాలకే పరిమితం కాకుండా దేశ పురోగతికి ఉపయోగపడే ఆవిష్కరణలపై దృష్టి పెట్టాలని సూచించారు. కటిక దారిద్ర్యం నుండి దేశ ప్రథమ పౌరుడిగా ఎదిగిన మాజీ రాష్ట్రపతి, సైంటిస్ట్ డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం లాంటి మహానుభావుల జీవితాలను యువత ఆదర్శంగా తీసుకోవాలని ద్రౌపది ముర్ము ఆకాంక్షించారు. ఎంతటి కష్టాలు ఎదురైనా సంకల్ప బలంతో అనుకున్న లక్ష్యాలను ఎలా సాధించవచ్చో కలాం జీవితం మనకు నేర్పుతుందన్నారు.

#### ఆధునిక సాంకేతికతతో పాటు సంస్కృతిని కాపాడుకోవాలి!

గిరిజన ప్రాంతాల్లోని విద్యార్థులకు ఉన్నత విద్యను అందించడం ద్వారా సమాజంలో సమాన అవకాశాలు లభిస్తాయని, సామాజిక పరివర్తన సాధ్యమవుతుందని రాష్ట్రపతి అభిప్రాయపడ్డారు. ప్రస్తుతం ప్రపంచం ఏఐ వంటి సరికొత్త సాంకేతిక యుగంలో దూసుకుపోతున్న తరుణంలో, యువత నూతన నైపుణ్యాలను అందిపుచ్చుకుంటూనే భారతదేశానికి ప్రతిష్ఠాత్మకమైన సాంస్కృతిక మూలాలను, గొప్ప గిరిజన వారసత్వాన్ని కాపాడుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. విద్య అనేది కేవలం కెరీర్ నిర్మించుకోవడానికే కాదు, ఒక ఉత్తమమైన వ్యక్తిత్వాన్ని, కరుణ కలిగిన మానవతా దృక్పథాన్ని అలవర్చుకోవడానికి ఉపయోగపడాలని స్పష్టం చేశారు.

#### గవర్నర్, కేంద్ర మంత్రి సమక్షంలో ఘనంగా వేడుకలు

విశాఖ నోవాటెల్ వేదికగా జరిగిన ఈ చారిత్రాత్మక స్నాతకోత్సవంలో రాష్ట్రపతి ముర్ముతో పాటు ఆంధ్రప్రదేశ్ గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్, కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్, రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ విశిష్ట అతిథులుగా పాల్గొన్నారు. తమ చేతుల మీదుగా డిగ్రీలు అందుకున్న విద్యార్థుల తల్లిదండ్రులకు, వారిని తీర్చిదిద్దిన అధ్యాపక బృందానికి రాష్ట్రపతి ఈ సందర్భంగా అభినందనలు తెలియజేశారు.

## ఎండిపోతున్న దేశం

ఆక్రమించనుంది. గతంలో 2014లో 93 మిల్లీమీటర్లు, 1926లో 97.4 మిల్లీమీటర్ల మేర జూన్ వర్షపాతం నమోదు కాగా మరికొన్ని అల్ప వర్షపాత సంవత్సరాలుగా 1902 (109 మిమీ), 1912 (106.8 మిమీ), 1923 (101.7 మిమీ) నిలిచాయి. సాధారణంగా వాతావరణ శాఖ లెక్కల ప్రకారం జూన్ నెల దీర్ఘకాలిక సగటు వర్షపాతం 165 మిల్లీమీటర్ల కంటే ఎక్కువగా ఉండాలి. ఇదిలా ఉండగా ఈ ఏడాది నైరుతి రుతుపవనాలు దేశంలోకి ఆలస్యంగా ప్రవేశించడమే కాకుండా ఆ తర్వాత సుమారు 11 రోజుల పాటు ఒకే చోట నిలిచిపోయాయి. వ్యవసాయ పరంగా అత్యంత కీలకమైన ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్‌లోని చాలా భాగాలు గుజరాత్‌తో కూడిన మధ్య, ఉత్తర, పశ్చిమ భారతదేశంలోని అధిక ప్రాంతాలకు రుతుపవనాలు ఇంకా విస్తరించలేదు. అలాగే రుతుపవనాలు ప్రవేశించిన మహారాష్ట్ర, ఒడిశా, బీహార్, ఛత్తీస్‌గఢ్, తెలంగాణ వంటి రాష్ట్రాల్లో కూడా వర్షపాతం సాధారణం కంటే చాలా తక్కువగా నమోదైంది. దేశ రాజధాని ఢిల్లీకి జూన్ 27నే రుతుపవనాలు రావాల్సి ఉండగా ఈ గడువు తప్పింది. జులై మొదటి వారంలోనే ఢిల్లీకి వర్షాలు వచ్చే అవకాశం ఉందని వాతావరణ సైంటిస్టులు చెబుతున్నారు. మరోవైపు పసిఫిక్ మహాసముద్రంలో బలమైన ఎల్‌నినో ఎఫెక్ట్ భయాల నేపథ్యంలో ఐఎండీ గత నెలలోనే తన దీర్ఘకాలిక రుతుపవనాల అంచనాను సవరించింది. జూన్ నుంచి సెప్టెంబర్ మధ్య కాలంలో సగటు వర్షపాతం 90 శాతానికి పడిపోవచ్చని పేర్కొంది. ఈ వర్షభావ పరిస్థితుల హెచ్చరికలు దేశంలోని రైతాంగాన్ని తీవ్ర ఆందోళనకు గురిచేస్తున్నాయి.అయితే జూన్ నెలలో వర్షాలు ఆశాజనకంగా లేనప్పటికీ అప్పుడే ఆందోళన చెందాల్సిన అవసరం లేదని వర్షాల విస్తరణను కూడా పరిగణనలోకి తీసుకోవాలని వాతావరణ సైంటిస్టులు అభిప్రాయపడుతున్నారు. వాతావరణ శాఖ మాజీ డైరెక్టర్ జనరల్ కేజే రమేష్ మాట్లాడుతూ "రుతుపవనాలు విస్తరించిన రాష్ట్రాలలో ఇప్పటివరకు వర్షపాతం బాగానే ఉంది. అంతేకాకుండా గతేడాది కురిసిన భారీ వర్షాల కారణంగా భూగర్భ జలాలు, జలాశయాల పరిస్థితి ప్రస్తుతం అంత దారుణంగా ఏమీ లేదు" అని సానుకూలంగా స్పష్టం చేశారు.

## హైదరాబాద్‌లో ఎయిర్‌టెల్ విస్తరించండి

ప్రతిష్టాత్మకంగా చేపట్టిన అభివృద్ధి సంస్కరణలు ప్రస్తావనకు వచ్చాయి. రాష్ట్రంలో పారిశ్రామిక ప్రగతికి అనుకూలమైన కొనసాగుతోందని, జాతీయ, అంతర్జాతీయ పెట్టుబడులకు తెలంగాణ ప్రధాన చిరునామాగా మారిందని ఈ సందర్భంగా రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు.ఢిల్లీ వెలుపల హైదరాబాద్‌ను రెండో పరిపాలనా కేంద్రంగా తీర్చిదిద్దేందుకు ఉన్న అవకాశాలను పరిశీలిస్తున్నట్లు సునీల్ మిట్టల్ తెలిపారు. డేటా సెంటర్ సామర్థ్యాన్ని భారీగా పెంచడంతో పాటు, రాష్ట్రవ్యాప్తంగా ఫైబర్ కనెక్టివిటీని గణనీయంగా బలోపేతం చేసేందుకు తమ సంస్థ పూర్తి స్థాయిలో సిద్ధంగా ఉందని అన్నారు. చందన్‌వెల్లిలో నిర్మాణంలో ఉన్న ప్రతిపాదిత ఎయిర్‌టెల్ డేటా సెంటర్ ప్రాజెక్టును వీలైనంత త్వరగా పూర్తి చేయాలని రేవంత్ రెడ్డి కోరారు. భవిష్యత్తు సాంకేతిక అవసరాలను దృష్టిలో ఉంచుకుని, తెలంగాణలో ఒక భారీ సమీకృత డేటా సెంటర్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ క్యాంపస్‌ను ఏర్పాటు చేయాలని రేవంత్ రెడ్డి ప్రతిపాదించారు. సాంకేతిక రంగంలో మరింత వేగంగా పురోగతిని సాధించడంలో భాగంగా హైదరాబాద్‌లో ఎయిర్‌టెల్ డిజిటల్, క్లౌడ్, సైబర్ సెక్యూరిటీ విస్తరణను ముమ్మరం చేయాలని సునీల్ మిట్టల్ కు సూచించారు.విద్యా రంగంలో తమ ప్రభుత్వం తీసుకొచ్చిన మార్పులను రేవంత్ రెడ్డి గుర్తు చేశారు. ప్రభుత్వ పాఠశాలల సమగ్ర పునరుద్ధరణ, యువతకు నైపుణ్యాల పెంపు కోసం 'యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ' ఏర్పాటు, ఐటీఐలను అత్యాధునిక అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్లుగా (ఏటీసీలు) మార్చడం, పాలిటెక్నిక్ కళాశాలల ఆధునీకరణ వంటి వినూత్న కార్యక్రమాల గురించి సునీల్ మిట్టల్ కు వివరించారు. ఆయా నిర్ణయాలు పరిశ్రమల అవసరాలకు తగిన మానవ వనరులను సృష్టించేందుకు ఎంతగానో ఉపయోగపడతాయని పేర్కొన్నారు. సామాజిక బాధ్యతలో భాగంగా భారతీ ఎయిర్‌టెల్ ఫౌండేషన్ ద్వారా ప్రభుత్వ పాఠశాలలు, ఏటీసీ కేంద్రాల పేద విద్యార్థులకు ప్రత్యేక స్కాలర్‌షిప్‌లు అందిస్తామని హామీ ఇచ్చారు. రాష్ట్రంలో ఎయిర్‌టెల్ భవిష్యత్తు పెట్టుబడుల పురోగతికి, ప్రభుత్వంతో నిరంతర సమన్వయం కోసం ఒక ప్రత్యేక సీనియర్ ఎగ్జిక్యూటివ్‌ను నోడల్ అధికారిగా నియమించనున్నారు. తద్వారా రాబోయే పెట్టుబడుల ప్రక్రియ మరింత వేగవంతం కానుంది.

## వరంగల్‌లో 'బంగారు' పొలం

చెన్నారావుపేటకు చెందిన ఓ వ్యక్తి కొనుగోలు చేశారు. ప్రస్తుతం ఈర్యతండాకు చెందిన రైతు ఒకరు కౌలుకు తీసుకుని పత్తి సాగు చేస్తున్నారు. జూన్ 24న వర్షాలు పడటంతో చేనులో కలుపు తీసేందుకు మహిళా కూలీలు పనికి వెళ్లారు. పని చేస్తుండగా, వారికి మట్టిలో నుంచి కొన్ని పురాతన బంగారు ఆభరణాలు లభించాయి. మొదట ఈ విషయాన్ని రహస్యంగా ఉంచాలని ప్రయత్నించినా, ఊరంతా తెలియడంతో భూమి యజమాని దృష్టికి వెళ్లింది. ఆయన కూలీలను విచారించగా, వారు దొరికిన బంగారాన్ని అప్పగించారు. వెంటనే యజమాని ఈ విషయాన్ని స్థానిక పోలీసులకు తెలియజేశారు.

#### గతంలోనూ దొరికిన నిధులు

ఈ భూమిలో బంగారం దొరకడం ఇదే మొదటిసారి కాదని గ్రామస్థులు చెబుతున్నారు. శతాబ్దాల క్రితం ఈ ప్రాంతంలో కాకతీయుల కాలం నాటి పురాతన ఆలయాలు ఉండేవని, కాలక్రమేణా అవి భూమిలో కలిసిపోయాయని స్థానికంగా ప్రచారంలో ఉంది. గతంలో పొలం దున్నుతున్నప్పుడు దేవతా విగ్రహాలు కూడా లభించాయని చెబుతున్నారు. 1991లో అప్పటి భూ యజమానికి వ్యవసాయ పనుల్లో భాగంగా పెద్ద మొత్తంలో బంగారం దొరికిందని, ఆ తర్వాత అదే పొలంలో పనిచేసిన పాలేరుకు కూడా కొన్ని బంగారు నాణేలు లభించాయని గ్రామస్థులు గుర్తు చేసుకుంటున్నారు. తాజా ఘటనతో ఈ భూమి కింద ఇంకా పెద్ద నిధి ఉందనే నమ్మకం బలపడింది.

#### కొత్తగా తెరపైకి పాత యజమాని వారసుడు

ఈ వ్యవహారం పోలీసుల వద్దకు చేరడంతో కథ కొత్త మలుపు తిరిగింది. ఈ భూమిని గతంలో అమ్మేసిన పాత యజమాని కుమారుడు సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. అది తమ తాతల కాలం నాటి భూమి అని, అందులో దొరికిన నిధిపై తమకే హక్కు ఉందని ఆయన వాదిస్తున్నారు. దొరికిన బంగారాన్ని పంచుకున్న వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుని, ఆ నిధిని తమకు అప్పగించాలని ఆయన తన ఫిర్యాదులో కోరారు.

#### రాత్రిపూట తవ్వకాలు

పొలంలో బంగారం దొరికిందనే వార్త చుట్టుపక్కల గ్రామాలకు వేగంగా వ్యాపించింది. దీంతో వందలాది మంది ప్రజలు ప్రతిరోజూ ఆ పొలానికి క్యూ కడుతున్నారు. పగలు పోలీసులు, రెవెన్యూ అధికారుల నిఘా ఉండటంతో, చాలామంది అర్ధరాత్రుళ్లు టార్చ్ లైట్లు, గునపాలతో పొలంలోకి ప్రవేశించి నిధి కోసం తవ్వకాలు జరుపుతున్నారు. దీంతో ఆ ప్రాంతంలో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. ఓవైపు నిధిపై హక్కుల వివాదం, మరోవైపు ప్రజల గాలింపు చర్యలతో ఈ బంగారు భూమి వ్యవహారం అధికారులకు తలనొప్పిగా మారింది.

## ఇక డాలర్‌తో పనిలేదు

సనా తకాయిచి భారత పర్యటన సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీతో జరిపే భేటీలో ఈ అంశంపై అధికారిక ప్రకటన వెలువడే అవకాశం ఉంది. ఈ కొత్త ఒప్పందం ప్రకారం, జపాన్‌కు చెందిన ప్రవాసేతరులు భారత బ్యాంకుల్లో ఖాతాలు తెరిచేందుకు అనుమతిస్తారు. దీనివల్ల ఇరు దేశాల ఆర్థిక సంస్థల మధ్య నేరుగా చెల్లింపులు జరపడం సాధ్యమవుతుంది. 2026 ఆర్థిక సంవత్సరంలోగా భారత రిజర్వ్ బ్యాంక్, జపాన్ ఆర్థిక మంత్రిత్వ శాఖ మధ్య ఈ మేరకు ఒక అవగాహన ఒప్పందం కుదరనుంది. ఇరు దేశాల ప్రధానుల సంయుక్త ప్రకటనలో కరెన్సీ సహకారం అంశాన్ని చేర్చడం ఇదే మొదటిసారి కానుంది.ఈ వ్యవస్థ అందుబాటులోకి వస్తే విదేశీ మారకం, రెమిటెన్స్ ఛార్జీలు గణనీయంగా తగ్గుతాయి. మూడో దేశంలోని కరస్పాండెంట్ బ్యాంకుల ద్వారా లావాదేవీలు జరపాల్సిన అవసరం లేకపోవడంతో సమయం కూడా ఆదా అవుతుంది. తద్వారా భారత్‌లో కార్యకలాపాలు సాగిస్తున్న జపాన్ కంపెనీలకు ప్రయోజనం చేకూరడమే కాకుండా, ప్రైవేట్ పెట్టుబడులు కూడా పెరిగేందుకు దోహదపడుతుంది. 2025 నాటి భారత్-జపాన్ జాయింట్ విజన్‌లో ఈ కరెన్సీ సహకారం గురించి ప్రస్తావించారు. ఇప్పటికే జపాన్ ఇండోనేషియాతో ఇలాంటి ఒప్పందం కుదుర్చుకోగా, మలేషియాతోనూ చర్చలు జరుపుతోంది. అంతర్జాతీయ వాణిజ్యంలో డాలర్‌పై ఆధారపడటాన్ని తగ్గించుకునే ప్రయత్నాల్లో భాగంగా ఈ చర్యను చూస్తున్నారు.

## ప్రధాని మోడీ అత్యున్నత సమీక్ష

జరిపిన రెండవ ప్రధాన భేటీ ఇది.మే 21న అభివృద్ధి చెందిన భారతదేశ దార్శనికతను సాకారం చేసే లక్ష్యంతో నియంత్రణ రోడ్‌మ్యాప్‌లను అభివృద్ధి చేయడానికి ప్రధాని మోడీ కేంద్ర మంత్రిమండలి, కేంద్ర కార్యదర్శుల సంయుక్త సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ప్రధాని వేగవంతమైన నిర్ణయాలు, సమర్థవంతమైన పాలన ఆవశ్యకతను గుర్తుచేశారు. ఫైళ్లు ఆలస్యం లేకుండా వేగంగా కదలాలని, సాధ్యమైనంత తక్కువ సమయంలో ఉత్పాదకతను గరిష్ఠ స్థాయికి పెంచాలని ప్రధానమంత్రి సూచించారు. ప్రభుత్వ పనితీరుపై మధ్యంతర సమీక్షగా ఈ సమావేశాన్ని పరిగణిస్తున్నట్లు ఏఎన్ఐ తెలిపింది. కేంద్రం పనితీరుపై విమర్శలు పెరుగుతున్న వేళ, కేబినెట్ మార్పులకు సిద్ధమవుతున్న ప్రధాని అంతకు ముందే మంత్రిత్వ శాఖలపై రిపోర్ట్ తీసుకున్నట్లు తెలుస్తోంది.

## పెన్షన్‌ల నుంచి ప్రాజెక్ట్‌ల వరకు..

**తిరుపతి,** ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రాష్ట్రవ్యాప్తంగా అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను పరుగులు పెట్టించేందుకు సిద్ధమయ్యారు. ఇందులో భాగంగా జూలై 1 నుంచి జూలై 5 వరకు పలు జిల్లాల్లో ఆయన విస్తృతంగా పర్యటించనున్నారు. ఐదు రోజుల పాటు సాగనున్న ఈ పర్యటనలో కోట్లాది రూపాయల అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలతో పాటు నేరుగా ప్రజల్లోకి సీఎం చంద్రబాబు వెళ్లనున్నారు. పర్యటనలో భాగంగా జూలై 1వ తేదీన సీఎం చంద్రబాబు నెల్లూరు జిల్లా చిలకపూరు మండలంలో పర్యటించనున్నారు.అక్కడ స్వయంగా లబ్ధిదారులకు 'ఎన్టీఆర్ భరోసా పింఛన్లను పంపిణీ చేయనున్నారు.

అదే రోజు తిరుపతి జిల్లా శ్రీసిటీలో ప్రముఖ ఆటోమొబైల్ దిగ్గజం 'హీరో మోటో కార్ప్' సంస్థ రూ. 750 కోట్ల భారీ పెట్టుబడితో నిర్మించిన 'గ్లోబల్ పార్ట్స్ సెంటర్'కు ముఖ్యమంత్రి శంకుస్థాపన చేయనున్నారు. ఈ ప్రాజెక్టు ద్వారా స్థానిక యువతకు పెద్ద ఎత్తున ఉపాధి అవకాశాలు లభించనున్నాయి. జూలై 2న తిరుపతి జిల్లా రైల్వే కోడూరులో జరిగే వీబీజీ రాంజీ కార్యక్రమానికి సీఎం హాజరవుతారు. అనంతరం తిరుపతిలోనే నిర్వహించనున్న ప్రతిష్టాత్మక 'ఊఆఖ కెపాసిటీ బిల్డింగ్ వర్క్ షాప్'లో పాల్గొని అధికారులకు దిశా నిర్దేశం చేయనున్నారు.ఇక జూలై 3వ తేదీన రాయలసీమ ముఖచిత్రాన్ని మార్చేలా ప్రతిష్టాత్మక 'రాయలసీమ స్టీల్ ప్లాంట్' పనులను కడప జిల్లాలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధికారికంగా ప్రారంభించనున్నారు. కడప పర్యటన ముగించుకుని జూలై 3వ తేదీనే సీఎం చంద్రబాబు తన సొంత నియోజకవర్గమైన కుప్పం చేరుకుంటారు. జూలై 3 నుంచి జూలై 5వ తేదీ వరకు వరుసగా మూడు రోజుల పాటు కుప్పంలోనే ఆయన బస చేయనున్నారు. ఈ మూడు రోజుల్లో నియోజకవర్గానికి సంబంధించి పెండింగ్‌లో ఉన్న పలు కీలక అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేయడంతో పాటు స్థానిక నేతలు, ప్రజలతో నేరుగా ముఖాముఖి కానున్నారు.

## వారణాసి..ఇక ఓన్లీ వెజ్

**లక్నో,** ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలోని వారణాసి నగరం త్వరలో శాకాహార నగరంగా మారనుంది. వారణాసి నగర మున్సిపల్ కార్పొరేషన్(వీఎంసీ) తన పరిధిలోని మాంసం, చేపలు, కోళ్ల దుకాణాలను నగర శివార్లకు తరలించాలని నిర్ణయించింది. ఈ మేరకు మేయర్ అశోక్ తివారీ అధ్యక్షతన జరిగిన మున్సిపల్ సమావేశంలో ఈ ప్రతిపాదనకు ఆమోదం లభించింది. దీంతో నగర పరిధిలో ఉన్న 350 నుంచి 400 మాంసం దుకాణాలను రాబోయే ఆరు నెలల్లో దీపావళిలోపు విడతల వారీగా నగర శివార్లకు తరలించేందుకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు.ఈ దుకాణాలను రామ్నగర్, సుజాబాద్, గణేశ్‌పూర్, అవలేష్ నగర్, శివపూర్ ప్రాంతాలకు తరలించనున్నారు. దీంతో కాశీనగరం దేశంలోని రెండవ శాకాహార నగరంగా మారనుంది. ప్రస్తుతం ప్రపంచంలోని ఏకైక పూర్తి శాకాహార పట్టణంగా గుజరాత్ రాష్ట్రంలోని 'పాలితానా' గుర్తింపు పొందింది. ఇక్కడ 2014 నుంచి మాసం, చేపలు, గుడ్లు విక్రయాలపై నిషేధం అమల్లోఉంది. వారణాసిలో హిందువులు 72శాతం, ముస్లింలు 27శాతం ఉన్నారనేఅంచనాలు న్నాయి.తాజా నిర్ణయంపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. కొందరు నగర పరిశుభ్రత, పుణ్యక్షేత్రం ప్రత్యేకత దృష్ట్యా స్వాగతిస్తుండగా.. మరికొందరు దుకాణాలు దూర ప్రాంతాలకు మారితే వినియోగదారులకు, వ్యాపారులకు ఇబ్బందులు ఎదురవుతాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ నిర్ణయం మాంసాహారాన్ని నిషేధించడం కాదని.. కేవలం దుకాణాలను వేరే ప్రాంతానికి తరలించి.. అక్కడ వ్యాపారాలు చేసుకునేలా అవకాశాలు కల్పిస్తున్నామని చెబుతున్నారు.

## ఆరోగ్య సమస్యలపై ప్రజలు నేరుగా సంప్రదించవచ్చు

**– జిల్లా ఆసుపత్రి సూపరింటెం డెంట్ శ్రీధర్**



**పెద్దపల్లి** జిల్లా కేంద్రంలోని ఆసుపత్రిలో రోజుకు సుమారు 1200 మంది వరకు ఓపీ సేవలను వినియోగించుకుంటున్నారని జిల్లా ఆసుపత్రి సూపరింటెం డెంట్ శ్రీధర్ తెలిపారు. వర్షా కాలం ప్రారంభమైన నేపథ్యంలో సీజనల్ వ్యాధులు వ్యాపించే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సీజనల్ వ్యాధుల నివారణకు తాగునీటిని తప్పనిసరిగా మరిగించి లేదా శుద్ధి చేసి తాగాలని, బయట ఆహారం, కలుషితమైన ఆహార పదార్థాలను తీసుకోరాదని సూచించారు. భోజనం ముందు చేతులను సబ్బుతో శుభ్రంగా కడుక్కోవాలని, ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని తెలిపారు. పిల్లలు, వృద్ధులు, గర్భిణీలు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.జిల్లా కలెక్టర్, స్థానిక ఎమ్మెల్యే సహకారంతో ఆసుపత్రికి అందుబాటులోకి వచ్చిన ఆధునిక వైద్య పరికరాల ద్వారా ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందిస్తున్నామ ని తెలిపారు. పెద్దపల్లి జిల్లా ప్రజలందరూ ఈ సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అలాగే ప్రతిరోజూ ఉదయం 9.00 గంటల నుండి సాయంత్రం 5.00 గంటల వరకు సూపరింటెం డెంట్ జిల్లా ఆసుపత్రి రూమ్ నెం.16లో అందుబాటులో ఉంటారని తెలిపారు. ఆసు పత్రి సేవలకు సంబంధించిన ఫిర్యాదులు, సూచనలు, ఆరోగ్య సమస్యలపై కూడా ప్రజలు నేరుగా సంప్రదించ వచ్చని, ఫోన్ ద్వారా ఎప్పుడై నా స్పందించేందుకు సిద్ధంగా ఉంటారని జిల్లా ఆసుపత్రి పెద్దపల్లి సూపరిండెంట్ డాక్టర్ శ్రీధర్ ఈ సందర్భంగా పేర్కొ న్నారు.

# సామర్లకోటలో విషాదం.. ఒకరి మృతి



సామర్లకోట కెనాల్ రహదారిలో మంగళవారం రెండు లారీలు ఢీకొన్న ప్రమాదంలో ఒక డ్రైవర్ మృతిచెందారు. కోల్కాతా నుంచి కాకినాడకు మోటార్ సైకిల్ లోడుతో వెళ్తున్న కంటైనర్ లారీని, ఎదురుగా వస్తున్న మరో లారీ బలంగా ఢీకొట్టిందని ట్రాఫిక్ ఎస్ఐ అడపా గరగారావు తెలిపారు. ప్రమాదానికి కారణమైన మరో లారీ డ్రైవర్ను పోలీసులు అరెస్టు చేశారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

## వైఎస్ జగన్ను కలిసిన
# సింగపూర్ కాన్సులేట్ జనరల్



**విజయవాడ** వైసీపీ కేంద్ర కార్యాలయంలో మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డిని సింగపూర్ కాన్సులేట్ జనరల్ (చెన్నై) ఎడ్గర్ పాంగ్తే చియాంగ్ మంగళవారం కలిసారు. సోమవారం నాడు మంత్రి లోకేష్ ను సింగపూర్ కాన్సులేట్ జనరల్ బృందం కలిసింది. మంగళవారం నాడు వైఎస్ జగన్తో భేటీ అయింది.

# విజయవాడ ధర్నా చౌక్లో తీవ్ర ఉద్రిక్తత..

**- కదం తొక్కిన రైతులు**

**విజయవాడ** విజయవాడ ధర్నా చౌక్ లో వామపక్షాలు కదం తొక్కాయి. దాంతో అక్కడ తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. సీఎం డౌన్ డౌన్.. రైతు ద్రోహి చంద్రబాబు అంటూ ఆందోళన కారులు నినాదాలు చేసారు. రైతాంగ సమస్యల పరిష్కారం కోరుతూ సీపీఐ, ఏపీ రైతు సంఘం ఆధ్వర్యంలో "సీఎంకు రాయబారం" కార్యక్రమం నిర్వహించారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి ఈశ్వరయ్య, రైతు సంఘం నాయకులు, రైతులు సీఎం ఇంటికి బయల్దేరారు. పోలీసులు బారికేడ్లు పెట్టి రైతులను అడ్డుకున్నారు. పోలీసులతో రైతులు తీవ్రవాగ్వాదానికి దిగారు. పోలీసుల ఆంక్షలను దాటి సీఎం ఇంటికి వెళ్లేందుకు రైతులు ప్రయత్నించారు. ధర్నాచౌక్, స్వర్ణపాలెస్ జంక్షన్ల వద్ద పోలీసులు భారీగా మోహరించారు.

## రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా
# బాధ్యతలు స్వీకరించిన సంజయ్ జాజు

**హైదరాబాద్,** రాష్ట్ర ప్రభుత్వ నూతన ప్రధాన కార్యదర్శిగా సంజయ్ జాజు, మంగళవారం డా. బి.ఆర్. అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా విధులు నిర్వహించిన కే. రామకృష్ణా రావు, ఈ రోజు పదవీ విరమణ చేయడంతో, ఆయన స్థానంలో 1992 బ్యాచ్కు చెందిన ఐఏఎస్ అధికారి సంజయ్ జాజును రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా నియమిస్తూ ప్రభుత్వం జూన్ 26న ఉత్తర్వులు జారీ చేసింది. ఈ ఉత్తర్వుల మేరకు సంజయ్ జాజు నూతన సీఎస్గా బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు, ముఖ్య కార్యదర్శులు, కార్యదర్శులు, వివిధ శాఖల విభాగాధిపతులు, సచివాలయ అధికారులు, సిబ్బంది సంజయ్ జాజుతో పాటు కే. రామకృష్ణా రావును పుష్పగుచ్ఛాలతో అభినందించారు.

## పోలింగ్ స్టేషన్స్ జాబితా
# తయారీ గురించి చర్చిస్తాం

**- ఆంధ్రప్రదేశ్ ప్రధాన ఎన్నికల అధికారి వివేక్ యాదవ్**

**- నవతరం పార్టీ అధ్యక్షులు రావు సుబ్రహ్మణ్యంకు లేఖ**

**చిలకలూరిపేట** నవతరం పార్టీ జాతీయ అధ్యక్షులు రావు సుబ్రహ్మణ్యం ఎస్ ఐ ఆర్ విషయంలో రిజిస్టర్ పార్టీలతో సమావేశాలు నిర్వహించాలని ఏపీ రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వివేక్ యాదవ్ కు రాసిన లేఖకు స్పందించిన ఏపీ సీఈఓ రాష్ట్ర పరిధిలో అన్నీ జిల్లాల కలెక్టర్లకు లెటర్. ఔనీ. 803/ఎలక్స్.బి /ఏ 1/2026-1 ద్వారా ఆదేశాలు జారీ చేశారు. ఎలక్టోరల్ రోల్స్ మాన్యువల్, 2023లోని 11వ అధ్యాయం ప్రకారం, ఎలక్టోరల్ రోల్స్ తయారీకి సంబంధించి గుర్తింపు పొందిన జాతీయ మరియు రాష్ట్ర స్థాయి రాజకీయ పార్టీలతో డిఇఓ లు మరియు సీఈఓ లు అందరూ సమావేశాలు నిర్వహించాలని తెలియజేయడమైనదని,పోలింగ్ స్టేషన్ల మాన్యువల్, 2020లోని పేరా 3.4 ప్రకారం, పోలింగ్ స్టేషన్ల జాబితాను రూపొందించేటప్పుడు జిల్లా ఎన్నికల అధికారి గుర్తింపు పొందిన మరియు గుర్తింపు పొందని రాజకీయ పార్టీల స్థానిక ప్రతినిధులు, నమోదైన మరియు పోటీ చేయాలనుకుంటున్న అభ్యర్థులతో సంప్రదింపులు జరపాలని ఉత్తర్వులు జారీ చేస్తూ, కాపీ ప్రతి రావు సుబ్రహ్మణ్యం కు పంపించారు. స్పందించి ఆదేశాలు ఇచ్చిన సీఈఓ వివేక్ యాదవ్ కు నవతరం పార్టీ నుండి కృతజ్ఞతలు తెలిపారు.

## చిలకలూరిపేటలో
# తృటిలో తప్పిన ప్రమాదం



**చిలకలూరిపేట,** చిలకలూరిపేట ఎన్టీఆర్ కాలనీ వద్ద పాఠశాల వదిలిన సమయంలో రోడ్డుపైకి వచ్చిన విద్యార్థులను కాపాడేందుకు ఆక్సిజన్, హైడ్రోజన్ సిలిండర్లతో వెళ్తున్న ఆటోను డ్రైవర్ పక్కకు తిప్పగా అదుపుతప్పి బోల్తా పడింది. డ్రైవర్ సమయస్ఫూర్తితో విద్యార్థులు సురక్షితంగా బయటపడగా, సిలిండర్లు పేలకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. డ్రైవర్ను స్థానికులు సురక్షితంగా బయటకు తీశారు. విద్యార్థుల భద్రతపై పాఠశాల యాజమాన్యం నిర్లక్ష్యం వహించిందంటూ స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేశారు.

## గంజాయిని తరలిస్తున్న ఓ కంటైనర్ను
# పట్టుకున్న పోలీసులు

భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో భారీగా గంజాయి పట్టుబడింది. బూర్గంపాడు మండలం సారపాకలో గంజాయిని తరలిస్తున్న ఓ కంటైనర్ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. కంటైనర్లో కోట్ల రూపాయల విలువైన గంజాయి ఉన్నట్లు సమాచారం. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బూర్గంపాడు మండలం సారపాకలో భారీగా గంజాయి పట్టుబడింది. విశ్వసనీయ సమాచారం మేరకు పోలీసులు తనిఖీలు నిర్వహించగా గంజాయిని తరలిస్తున్న కంటైనర్ను స్వాధీనం చేసుకున్నారు. ప్రాథమిక సమాచారం ప్రకారం కంటైనర్లో సుమారు రెండు నుంచి మూడు కోట్ల రూపాయల విలువ చేసే గంజాయి ఉన్నట్లు తెలుస్తోంది. స్వాధీనం చేసుకున్న కంటైనర్ను సారపాకలోని ఐటీసీ పేపర్ కర్మాగారం లారీ యార్డుకు తరలించి పోలీసులు భద్రపరిచినట్లు సమాచారం. సంఘటన సమాచారం అందుకున్న భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఎస్పీ రోహిత్ రాజ్ ఘటనాస్థలానికి చేరుకుని పరిస్థితిని పరిశీలించారు. గంజాయి ఎక్కడి నుంచి తీసుకొచ్చారు, ఎక్కడికి తరలిస్తున్నారు, ఈ అక్రమ రవాణా వెనుక ఉన్న ముఠా ఎవరనే కోణాల్లో పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

# సిగాచి దుర్ఘటనకు ఏడాది

**సంగారెడ్డి** సంగారెడ్డి జిల్లా పటాన్ చెరు నియోజకవర్గంలోని పాశమైలారం పారిశ్రామిక వాడలో సిగాచి పరిశ్రమలో ఏడాది క్రితం ఘోర అగ్నిప్రమాదంలో మృతిచెందిన కార్మికులకు స్థానిక శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి, స్థానిక బిఆర్ఎస్ నేతలు నివాళులు అర్పించారు. ప్రమాదం జరిగి ఏడాది పూర్తవుతున్న మృతుల కుటుంబాలకు కోటి రూపాయల పరిహారం ఇవ్వకపోవటంపై ఎమ్మెల్యే ఆగ్రహంవ్యక్తం చేసారు. నేడు బీఆర్ఎస్ ఆధ్వర్యంలో జరుగనున్న మృతుల సంస్మరణ సభ కు అనుమతివ్వలేదని రేవంత్ సర్కార్ పై ఫైర్ అయ్యారు.. హరీశ్ రావుకు భయపడి సంస్మరణ సభ కు అనుమతి ఇవ్వకపోవడం నీచ సంస్కృతి అని మండిపడ్డారు.

# భారీ పేలుడుతో ఇల్లు ధ్వంసం

**హైదరాబాద్** సరూర్నగర్ పరిధిలోని బాబూనగర్లో రిటైర్డ్ బ్యాంకు ఉద్యోగి దేవేందర్ ఇంట్లో భారీ పేలుడు జరిగింది. పేలుడు ధాటికి ఇల్లు పూర్తిగా ధ్వంసం అయింది. కుటుంబ సభ్యులు ఇంట్లో ఉన్నప్పటికీ ఎవరికీ ఎలాంటి ప్రాణనష్టం జరగకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. ఇంట్లో ఉన్న మూడు గ్యాస్ సిలిండర్లు పేలకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. పేలుడుకు గల కారణాలు ఇంకా తెలియాల్సి ఉంది.

## సంధ్యారాణిను పరామర్శించిన
# వైసీపీ మాజీ ఎమ్మెల్యేలు



**నరసరావుపేట** వినుకొండ నియోజకవర్గం నూజెండ్ల మండలం నూజెండ్ల గ్రామం నందు మాజీ మహిళా అధ్యక్షురాలు సంధ్యారాణి ప్రమాదవశాత్తు ఆర్టీసీ బస్సు ఎక్కుతుండగా జారిపడి గాయపడగా, నరసరావుపేటలోని ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ మేరకు వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ (పి ఏ సి) మెంబర్ వినుకొండ మాజీ శాసనసభ్యులు బొల్లా బ్రహ్మనాయుడు, పల్నాడు జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ శాసనసభ్యులు డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి ఆస్పత్రికి వెళ్లి ఆమెను పరామర్శించారు. వారితో పాటు నియోజవర్గ స్థాయి నాయకులు మరియు మండల నాయకులు పాల్గొన్నారు.

## ఎంపిడివో పదవి విరమణ కార్యక్రమానికి
# హాజరయిన బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్



**నెరడిగొండ** మండల ఎంపిడిఓ సుముఖం శేఖర్ పదవి విరమణ పొందుతున్న సందర్భంగా ఈరోజు మండల కేంద్రంలోని సూర్య గార్డెన్లో ఏర్పాటు చేసిన సన్మాన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా పదవి విరమణ పొందుతున్న ఎంపిడిఓ శేఖర్ గారికి సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అనిల్ జాదవ్ మాట్లాడుతూ.. ఎంపిడిఓ గా శేఖర్ గారు మండల అభివృద్ధికి కృషి చేయడం అభినందనీయమని, మండల ప్రజలకు సేవలందించిన శేఖర్ గారు ఇప్పుడు కుటుంబానికి సమయం కేటాయించాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ నీలిమ రవీందర్, ఉప సర్పంచ్ గులాబ్, మండల కన్వీనర్ శివారెడ్డి, మాజీ ఎంపీపీ రాథోడ్ సజన్, మాజీ జడ్పీటీసీ పండరీ, మాజీ పిఏసీఎస్ చైర్మన్ నానక్ సింగ్, మాజీ ఉప సర్పంచ్ దేవేందర్ రెడ్డి, సర్పంచులు గంగాధర్, మహేందర్ రెడ్డి, మహేందర్, శ్రీకాంత్, చంపేత్, విజయ్,వెంకట్రాం, అమృత్, రాజేందర్, వినేష్, నాయకులు సాబ్లే సంతోష్, రాథోడ్ సురేందర్, సుజీల్ తదితరులు ఉన్నారు.

## 38వ డివిజన్లో పలు కాలనీలలో సైన్ బోర్డుల ప్రారంభించిన కార్పొరేటర్ నేలకంటి రాము.



**గోదావరిఖని:** రామగుండం ఎమ్మెల్యే రాజ్ ఠాగూర్ మక్కాన్ సింగ్ ఆదేశాల మేరకు, 38వ డివిజన్ పరిధిలోని అంబేద్కర్ నగర్, హనుమాన్ నగర్, మల్లికార్జున్ నగర్, సీతానగర్, వినోబా నగర్ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన సైన్ బోర్డులను 38వ డివిజన్ కార్పొరేటర్ నేలకంటి రాము ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ నేలకంటి రాము మాట్లాడుతూ, ప్రజలకు ప్రాంతాల గుర్తింపు సులభతరం కావడంతో పాటు ప్రభుత్వ సేవలు, అత్యవసర సేవలు మరింత సమర్థవంతంగా చేరేందుకు ఈ సైన్ బోర్డులు ఉపయోగపడతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో కోట రాజు, పసరగొండ రాంకీ, సాయి, వినయ్, రాజన్న పాల్గొన్నారు.

## హెచ్సీయూలో నిరవధిక సమ్మెకు దిగిన
# కాంట్రాక్ట్ కార్మికులు

హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయం (ఐసీఊ) లో కాంట్రాక్ట్ కార్మికులు మరోసారి ఉద్యమబాట పట్టారు. తమ దీర్ఘకాలిక డిమాండ్లను పరిష్కరించాలని, కార్మిక హక్కుల కాలరాటోను అరికట్టాలని డిమాండ్ చేస్తూ వర్సిటీ పరిపాలనా విభాగం ఎదుట కార్మికులు నిరవధిక నిరసనను ప్రారంభించారు. హక్కులను కాలరాస్తున్న కొత్త కార్మిక చట్టాలు..కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన కొత్త కార్మిక చట్టాల (ఒజీఎనీబీతీ అనీటవబ) వల్ల తాము తీవ్ర సంక్షోభంలో కూరుకుపోయామని నిరసనకారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ చట్టాల అమలుతో తమ ఉద్యోగ భద్రత కరువైందని, కార్యాలయంలో రక్షణలు బలహీనపడ్డాయని వారు ఆరోపిస్తున్నారు. దశాబ్దాలుగా తాము పోరాడి సాధించుకున్న ప్రాథమిక కార్మిక హక్కులను సైతం ఈ కొత్త చట్టాల సాకుతో అణచివేస్తున్నారని కార్మికులు మండిపడుతున్నారు. కొత్త కాంట్రాక్టర్ తీరుపై ఆగ్రహం..ఇటీవలే వర్సిటీకి వచ్చిన కొత్త కాంట్రాక్టర్ నియామకంతో పరిస్థితి మరింత జటిలంగా మారిందని కార్మిక సంఘాలు పేర్కొన్నాయి..కొత్త కాంట్రాక్టర్ ఈ కార్మిక చట్టాల నిబంధనలను ఆసరాగా చేసుకుని, మాకున్న పాత హక్కులను, ప్రయోజనాలను పూర్తిగా రద్దు చేశారు. దీనివల్ల పని ప్రదేశంలో పని ఒత్తిడి పెరగడమే కాకుండా, మా జీవనోపాధికి తీవ్ర ముప్పు వాటిల్లింది." అని ఒక కార్మిక ప్రతినిధి ఆరోపించారు. డిమాండ్లు నెరవేరే వరకు వెనక్కి తగ్గేదే లేదువర్సిటీ యాజమాన్యం తక్షణమే స్పందించి, తమతో చర్చలు జరపాలని కార్మికులు డిమాండ్ చేస్తున్నారు. తమకు న్యాయమైన, గౌరవప్రదమైన పని వాతావరణాన్ని కల్పించే వరకు మరియు తమ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపే వరకు ఈ నిరవధిక సమ్మెను కొనసాగిస్తామని వారు స్పష్టం చేశారు. ఈ నిరసనల నేపథ్యంలో యూనివర్సిటీలో ఎలాంటి పరిస్థితులు నెలకొంటాయో, పరిపాలనా విభాగం దీనిపై ఎలా స్పందిస్తుందో వేచి చూడాలి.

## మంత్రి కొండా సురేఖ ఇంటిని
# ముట్టడించిన కార్మికులు

**హైదరాబాద్** మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ (సీఐటీయూ) ఆధ్వర్యంలో సమ్మె చేస్తున్న కార్మికులు మంత్రి కొండా సురేఖ ఇంటిని ముట్టడించారు. పోలీసులు ఏర్పాటు చేసిన బారికేడ్లను తోచుకొని మంత్రి ఇంటి మీదకు దూసుకెళ్లారు. గేటు ముందు బైఠాయించి నిరసన వ్యక్తం చేసారుకనీస వేతనం రూ. 26 వేలుగా అమలు చేయాలని డిమాండ్ చేస్తూ మంత్రి నివాసం వద్దకు భారీ నిరసన ర్యాలీ నిర్వహించారు.

## ఫుడ్ సేఫ్టీ తనిఖీలు.. రెండు రెస్టారెంట్లకు నోటీసులు




**హైదరాబాద్** ఫుడ్ సేఫ్టీ అధికారులు మియాపూర్ మదినగూడ జీఎస్ఎం ఓ మాల్లో తనిఖీలు నిర్వహించారు. బార్బెక్యూ నేషన్లో లేబుల్స్ లేని ఆహార పదార్థాలు, బొద్దింకలు, రికార్డుల లోపాలు గుర్తించారు. చైనీస్ వాక్లో శుభ్రం చేయని గుడ్ల వినియోగం, రికార్డుల కొరత, అపరిశుభ్రతపై అభ్యంతరాలు వ్యక్తం చేస్తూ నోటీసులు జారీ చేసారు. బార్బెక్యూ నేషన్కు 79%, చైనీస్ వాక్కు 82% హైజీన్ స్కోర్ ఇచ్చారు.

## ఎస్ ఐ ఆర్ ప్రక్రియను పరిశీలించిన మంత్రి పొన్నం



**హుస్నాబాద్** హుస్నాబాద్ పట్టణంలోని 17వ వార్డులో కొనసాగుతున్న ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమాన్ని మంత్రి పొన్నం ప్రభాకర్ మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఇంటింటికి నిర్వహిస్తున్న ఎన్యూమరేషన్ ప్రక్రియను ప్రత్యక్షంగా పరిశీలించి, బీఎల్ఓలు, బీఎల్ఏలతో మాట్లాడి ప్రతి కుటుంబాన్ని తప్పనిసరిగా సందర్శించాలని సూచించారు. ఓటరు నమోదు, మార్పులు, తొలగింపులు, చిరునామా సవరణ వంటి అంశాల్లో పూర్తి స్థాయిలో అవగాహన కల్పిస్తూ ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా సేవలు అందించాలని అధికారులను ఆదేశించారు. అర్హులైన ప్రతి పౌరుడి పేరు ఓటరు జాబితాలో నమోదు కావడం ప్రజాస్వామ్య బలోపేతానికి ఎంతో ముఖ్యమని పేర్కొని , ప్రక్రియను నిబంధనలకు అనుగుణంగా, నిష్పక్షపాతంగా, సమయానికి పూర్తి చేయాలని సూచించారు. ఈ పరిశీలనలో మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్, స్థానిక ప్రజాప్రతినిధులు, మండల మరియు పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు, నాయకులు ,ఎన్నికల సిబ్బంది, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# షాద్నగర్లో చారిత్రక ఫిరంగులు మాయం..!

**- చారిత్రక ఫిరంగుల పరిరక్షణకు చర్యలు తీసుకోవాలి**

**- షాద్నగర్ మాజీ ఎమ్మెల్యే బక్కని నర్సింహులు**

**- షాద్నగర్ మున్సిపల్ కార్యాలయంలో మూలకు పడేసిన ఫిరంగి రూ. 2లక్షలతో మున్సిపల్ ఎదుట - నిర్మాణం చేసి పెయింటింగ్ వేసేందుకు నిధులు మంజూరు నిధులు ఏమయ్యాయి**

**- ఫిరంగి మూలకు ఎందుకు పడింది..?**

**- ఫిరంగుల మాయంపై పోలీసులకు ఫిర్యాదు..**



షాద్నగర్ పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం వెనుక ప్రహరీ గోడ సమీపంలో ఉన్న చారిత్రక ఫిరంగుల నిర్లక్ష్య స్థితిపై రంగారెడ్డి జిల్లా షాద్నగర్ మాజీ ఎమ్మెల్యే బక్కని నర్సింహులు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ విషయాన్ని పలుమార్లు సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లినా సరైన చర్యలు తీసుకోలేదని ఆయన పేర్కొన్నారు. తాజాగా ఆ ప్రాంతాన్ని సందర్శించిన బక్కని నర్సింహులు, ఫిరంగి పూర్తిగా దుమ్ము, ధూళితో కప్పబడి ఉండటాన్ని గమనించి స్వయంగా కొంత భాగాన్ని శుభ్రం చేశారు. గతంలో అక్కడ రెండు ఫిరంగులు ఉండేవని, ప్రస్తుతం ఒకటి మాత్రమే కనిపిస్తోందని, మరొకటి కనిపించకపోవడం ఆందోళన కలిగిస్తోందని తెలిపారు. ఈ చారిత్రక ఆయుధాలు గతంలో రాజుల నివాసంగా ఉన్న ప్రాంతంలో ఉండేవని, ప్రస్తుతం ఆ ప్రాంతం రైతు కాలనిగా ప్రసిద్ధి చెందిందని ఆయన వివరించారు. చారిత్రక వారసత్వానికి గుర్తుగా ఉన్న ఈ ఫిరంగులను సంరక్షించి, భవిష్యత్ తరాలకు అందుబాటులో ఉంచేలా అధికారులు తక్షణ చర్యలు తీసుకోవాలని బక్కని నర్సింహులు కోరారు. ఈ మేరకు ఫిరంగిల మాయంపై షాద్నగర్ సహాయ పోలీసు కమిషనర్కు సమాచారం అందించినట్లు ఆయన తెలిపారు.

# కీసరలో వైద్యం-విద్యా సౌకర్యాలు మెరుగుపరచాలి: సీపీఎం

- ప్రభుత్వ ఆస్పత్రి, హైస్కూల్‌ను సందర్శించిన సీపీఎం జిల్లా నాయకత్వం
- అదనపు సిబ్బంది, మౌలిక వసతులు కల్పించాలని డిమాండ్



కీసర(ప్రశ్న న్యూస్) కీసర మండలంలోని ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (పీహెచ్‌సీ), ప్రభుత్వ హైస్కూల్‌లో వైద్య, విద్యా సేవలను మెరుగుపరిచేందుకు ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని సీపీఎం జిల్లా నాయకులు డిమాండ్ చేశారు. సీపీఎం మేడ్చల్--మల్కాజిగిరి జిల్లా కార్యదర్శి పి. సత్యం, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎర్ర అశోక్, జి. శ్రీనివాసులు, కీసర మండల కన్వీనర్ బంగారు నర్సింగరావు ఆధ్వర్యంలో బృందం మంగళవారం పీహెచ్‌సీ, ప్రభుత్వ హైస్కూల్‌ను సందర్శించి అక్కడి సమస్యలను పరిశీలించింది.పీహెచ్‌సీలో రోజుకు 80 నుంచి 90 మంది వరకు ఓపీ రోగులు వస్తున్నప్పటికీ స్టాఫ్ నర్సుల కొరత ఉందని, నెలకు 15 నుంచి 20 ప్రసవాలు నమోదవుతున్నాయని వైద్యాధికారి డాక్టర్ మనుజా రెడ్డి వివరించారు. ఆస్పత్రి పునర్నిర్మాణ పనుల కారణంగా ప్రస్తుతం ప్రసవ సేవలు నిలిపివేసి, కేసులను మల్కాజిగిరి జిల్లా ఆస్పత్రి, ఘట్‌కేసర్ ప్రభుత్వ ఆస్పత్రులకు తరలిస్తున్నట్లు తెలిపారు. రాత్రివేళల్లో వాచ్‌మన్ లేకపోవడం కూడా ఇబ్బందిగా మారిందన్నారు.దీనిపై స్పందించిన సీపీఎం జిల్లా కార్యదర్శి పి. సత్యం, పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా బండ్లగూడ--అహ్మద్‌గూడ ప్రాంతంలో మరో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని కోరారు. అదనపు స్టాఫ్ నర్సులను నియమించి, పునర్నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కారం అయ్యే వరకు ఉద్యమం కొనసాగిస్తామని హెచ్చరించారు.అనంతరం ప్రభుత్వ హైస్కూల్‌ను సందర్శించిన నాయకులు విద్యార్థులకు సరిపడా మరుగుదొడ్లు లేవని, 'మన ఊరు--మనబడి' కింద ప్రారంభించిన బాత్రూంల నిర్మాణం మధ్యలోనే నిలిచిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. హిందీ, సాంఘిక శాస్త్రం, కంప్యూటర్ బోధనకు అదనపు ఉపాధ్యాయులను నియమించాలని, బోరుబావి, ఆర్వో ప్లాంట్ ఏర్పాటు చేసి విద్యార్థులకు నాణ్యమైన తాగునీరు అందించాలని కోరారు. అలాగే మధ్యాహ్న భోజన పథకాన్ని మెనూ ప్రకారం నాణ్యంగా అమలు చేయాలని సూచించారు.కీసర మండల ప్రజలకు మెరుగైన వైద్యం, విద్య అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక నిధులు కేటాయించి మౌలిక వసతులను యుద్ధ ప్రాతిపదికన అభివృద్ధి చేయాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీహెచ్ అశోక్, ప్రవీణ్ తదితర పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## బెజవాడలోఅన్నదమ్ముల మధ్య సవాల్

**విజయవాడ,** విజయవాడలో అన్నా దమ్ముల రాజకీయ సమరం జోరుగా సాగుతోంది. ఒకరు ఎంపీగా ఉన్నారు. మరొకరు మాజీ ఎంపీ. ఈ ఇద్దరి మధ్యన చిచ్చు రాజుకుంది. ఎత్తులు పై ఎత్తులతో అన్నదమ్ముల పాలిటిక్స్ సాగుతోంది. తాజాగా చూస్తే కేశినేని నాని ఎంపీ చిన్ని మీద ఏకంగా భూకబ్జా ఆరోపణలతో అతి పెద్ద బాంబునే వేశారు. కేశినేని చిన్ని ప్రభుత్వ భూమిని కబ్జా చేయడానికి ప్రయత్నం చేశారంటూ కేశినేని నాని గట్టిగానే టార్గెట్ చేశారు. దీంతో విజయవాడ రాజకీయం ఒక్కసారిగా వేడెక్కిందివిజయవాడ ఎంపీ కేశినేని చిన్ని హైదరాబాద్ దగ్గరలోని షంషిగూడలో 112.72 ఎకరాల ప్రభుత్వ భూమిని భారీగా కబ్జా చేసేందుకు ప్రయత్నించారని కేశినేని నాని తీవ్ర ఆరోపణలు చేశారు. ఈసారి ఆయన నేరుగా తెలంగాణా ముఖ్యమంత్రినే మధ్యలోకి తీసుకుని వచ్చారు. తాను ఈ భూకబ్జా యత్నం విషయంలో రేవంత్ రెడ్డికే బహిరంగంగా విజ్ఞప్తి చేస్తున్నాను అని అన్నారు. ఈ భూమిని నిజానికి టీజీ ఐఐసీ ఐటీ పార్క్ కోసం కేటాయించింది అని నాని పేర్కొన్నారు. అయితే విజయవాడ ఎంపీ కేశినేని చిన్ని ఆయనకు సంబంధించిన సంస్థలు అయితే ఒక మోసపూరితమైన న్యాయపరమైన ఒప్పందం ద్వారా ఆ భూమిని అక్రమంగా తీసుకోవడానికి ప్రయత్నం చేస్తున్నాయని నాని విమర్శించారు.ఇక ఇది పక్కాగా ప్రభుత్వం భూమి అని ప్రైవేట్ వ్యక్తులకు సంస్థలకు ఎలాంటి యాజమాన్యం హక్కులు లేనే లేవని ఆ జిల్లా కలెక్టర్ కూడా సమర్పించిన అఫిడవిట్ లో స్పష్టం చేసారు అని నాని తెలిపారు. అందువల్ల ఈ ఆరోపితమైన ఆక్రమణను అడ్డుకోవాలని ఆయన కోరారు. అంతే కాదు ఇందులో ఎవరి ప్రమేయం ఉందో వారి మీద క్రిమినల్ చర్యలు కూడా తీసుకోవాలని ఆయన తెలంగాణా సీఎం రేవంత్ రెడ్డికి డైరెక్ట్ గానే వినతి చేసారు. అంతే కాదు ఒక ప్రభుత్వ భూమిని రక్షించే విషయంలో హైడ్రా అలాగే ప్రభుత్వ అడ్వకేట్ జనరల్ కూడా జోక్యం చేసుకోవాలని కూడా కేశినేని నాని కోరడం విశేషం.కేశినేని నాని ఈ ఆరోపణలు చేస్తూ ఊరుకోలేదు. తన సోషల్ మీడియా ద్వారా చేసిన ఆ ఆరోపణలతో కూడిన ట్వీట్ ని ఆయన తెలంగాణా సీఎం రేవంత్ రెడ్డి, ఏపీ సీఎం చంద్రబాబు, అలాగే ప్రధాని నరేంద్ర మోడీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షా సహా అగ్ర నేతలు అందరికీ ట్యాగ్ చేయడం విశేషం. చిన్ని రియాక్షన్ : ఇదిల ఉంటే తన మీద సోదరుడు తప్పుడు ఆరోపణలు చేస్తున్నారు అని ఇప్పటికే కేశినేని చిన్ని లీగల్ నోటీసులు జారీ చేశారు. అంతే కాదు పోలీసులకు కూడా ఫిర్యాదు చేశారు. ఇపుడు ఏకంగా వేల కోట్ల రూపాయల విలువలైన ప్రభుత్వ భూమిని చిన్ని ఆక్రమించడానికి ప్రయత్నం చేస్తున్నారు అని నాని ఆరోపణలు చేయడంతో చిన్ని ఏమి చేస్తారు అన్న చర్చ సాగుతోంది. మొత్తం మీద చూస్తే కేశినేని బ్రదర్స్ ల మధ్య రచ్చ ఇప్పట్లో ఆగేలా కనిపించడం లేదు అని అంటున్నారు.

## అలా ముగిసిన శ్రీ లక్ష్మి ముగింపు

**విజయవాడ,** సీనియర్ ఐఏఎస్ అధికారిణి వై.శ్రీలక్ష్మి మంగళవారం రిటైర్ అయ్యారు. ఈ నెల 25న ఆమెకు పోస్టింగ్ ఇస్తూ ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. రెండేళ్ల సుదీర్ఘ నిరీక్షణ తర్వాత రిటైర్మెంటుకు ఐదు రోజుల ముందు పోస్టింగ్ ఇచ్చినా, వరుసగా మూడు రోజులు సెలవు కావడంతో శ్రీలక్ష్మి కేవలం రెండు రోజులు మాత్రమే విధులకు హాజరయ్యే పరిస్థితులు ఏర్పడ్డాయి. ఇందులో ఒక రోజు బాధ్యతలు తీసుకోవడానికి సరిపోగా, రెండో రోజు రిటైర్మెంటు ఉత్తర్వులు తీసుకున్నారు. ఈ విధంగా ఒక సీనియర్ ఐఏఎస్ అధికారి ఎలాంటి ప్రాధాన్యం లేని పోస్టులో రిటైర్ అవ్వడం హాట్ టాపిక్ అవుతోంది. మాజీ ముఖ్యమంత్రి జగన్మోహనరెడ్డితో ఉన్న సంబంధాలు కారణంగా ప్రభుత్వం శ్రీలక్ష్మిని రెండేళ్లుగా వెయిటింగులో పెట్టిందని అంటున్నారు. ఇక రిటైర్మెంటును దృష్టిలో పెట్టుకుని న్యాయపరమైన చిక్కులు ఎదురుకాకుండా శ్రీలక్ష్మికి పోస్టింగు ఇచ్చిందని అంటున్నారు. సీనియర్ ఐఏఎస్ అధికారిణి వై.శ్రీలక్ష్మి ఉద్యోగ జీవితానికి కూటమి ప్రభుత్వం విలక్షణమైన ముగింపు చెప్పిందని అంటున్నారు. కేంద్ర కేబినెట్ కార్యదర్శి హోదాలో రిటైర్ కావాల్సిన శ్రీలక్ష్మి ఎటువంటి గుర్తింపు లేని పోస్టులో రిటైర్ కానుండటం తీవ్ర చర్చనీయాంశంగా మారింది. 22 ఏళ్లకే సర్వీసులోకి వచ్చిన శ్రీలక్ష్మి ఉమ్మడి రాష్ట్రంలో వివిధ హోదాల్లో పనిచేశారు. రాష్ట్ర విభజన అనంతరం తెలంగాణ కేడర్ కు వెళ్లిపోయారు. అయితే గత ప్రభుత్వంలో తెలంగాణ కేడర్ నుంచి ఏపీకి మారిన శ్రీలక్ష్మి మున్సిపల్ శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరిగా పనిచేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పోస్టింగుకు నోచుకోక రెండేళ్లుగా వెయిటింగులో ఉన్నారు. అంతా సక్రమంగా ఉంటే ఆమె ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి లేదా కేంద్ర కేబినెట్ కార్యదర్శి ర్యాంకులో రిటైర్ కావాల్సివుందని అంటున్నారు. కానీ, ఆమెపై ఉన్న కేసుల కారణంగా ఆలిండియా సర్వీసుల్లోని అత్యున్నత పోస్టులకు అర్హత కోల్పోయారని వ్యాఖ్యానిస్తున్నారు.ఇక 1988లో సర్వీసులోకి వచ్చిన శ్రీలక్ష్మి దాదాపు 38 ఏళ్లపాటు ఐఏఎస్ అధికారిణిగా వివిధ హోదాల్లో పనిచేశారు. అయితే ఉమ్మడి రాష్ట్రంలో గనుల శాఖ కార్యదర్శిగా పనిచేసిన సమయంలో ఓబుళాపురం మైనింగ్ స్కాంలో ఇరుక్కుని కెరీర్ లో ఒడిదుడుకులు ఎదుర్కొన్నారని చెబుతున్నారు. ఓబుళాపురం మైనింగ్ స్కాం నిందితుల జాబితాలో శ్రీలక్ష్మిని సీబీఐ చేర్చడంతో 2011లో అరెస్టు అయ్యారు. ఆ తర్వాత ఈ కేసు విషయమై న్యాయపోరాటం చేస్తూ పలుమార్పు జైలుకు వెళ్లడం, బెయిలుపై రావడం ద్వారా ఆమె కెరీర్ తీవ్ర ఇబ్బందుల్లో పడిపోయిందని అంటున్నారు. ఈ వ్యవహారం వల్లే పెద్ద పోస్టింగులకు నోచుకోలేకపోయారని అంటున్నారు. చివరికి రిటైర్మెంట్ సమయంలోనూ ఓబుళాపురం మైనింగ్ స్కాం భూతంలా వెంటాడడంతో సాధారణ పరిపాలన శాఖలో జీపీఎం అండ్ ఏఆర్ విభాగంలో ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా సరిపెట్టుకోవాల్సి వచ్చిందని అంటున్నారు. సాక్ష్యంగా నిలిచిన మరో వ్యక్తి యంగ్ అండ్ డైనమిక్ ఆఫీసర్ గా కెరీర్ ప్రారంభించిన శ్రీలక్ష్మి.. ఉమ్మడి రాష్ట్రంలో ఓబుళాపురం మైనింగ్ ద్వారా అత్యంత వివాదాస్పద అధికారిణిగా ముద్రపడ్డారని అంటున్నారు. అంతేకాకుండా ఆ కేసు ద్వారా ప్రస్తుత విపక్ష నేతలతో ఆమెకు బలమైన సంబంధాలు ఉన్నాయని ప్రభుత్వానికి టార్గెట్ గా మారారని చెబుతున్నారు. ఈ కారణంగానే కూటమి ప్రభుత్వం వచ్చిన నుంచి ఆమెను పక్కన పెట్టారని, చివరికి ఎలాంటి ప్రాధాన్యం లేని పోస్టుతో పదవీ విరమణకు అవకాశం కల్పించారని చెబుతున్నారు. దీంతో అఖిల భారత సర్వీసు అధికారుల్లో శ్రీలక్ష్మి ఎపిసోడ్ హాట్ టాపిక్ గా మారింది. ఎన్నో వివాదాలు, మరెన్నో రాజకీయాల మధ్య సాగిన శ్రీలక్ష్మి ఉద్యోగ ప్రస్థానం ప్రస్తుతం సర్వీసులో ఉన్న అధికారులు ఒక పాఠంగా నేర్చుకోవాలని పరిశీలకులు వ్యాఖ్యానిస్తున్నారు.

# తెల్ల పొనికి చెట్టు - ఒక వృక్షం కాదు..

- మన సంస్కృతికి ఊపిరి
- సింహాచలం లక్ష్మణ స్వామి
- వ్యవస్థాపక అధ్యక్షులు
- ఆయుర్వేద పరంపర మూలిక వైద్య మహా సంఘం,





అటవీ జీవవైవిధ్య శాస్త్రవేత్తలతో సింహాచలం లక్ష్మణస్వామి

ప్రకృతి మనకు ఇచ్చిన అమూల్యమైన వరాలలో కొన్ని వృక్షాలు కేవలం చెట్లుగా మాత్రమే కాకుండా ఒక నాగరికతను, ఒక కళను, వేల కుటుంబాల జీవనోపాధిని నిలబెడతాయి. అలాంటి అరుదైన వృక్షాలలో "తెల్ల పొనికి" (జివోటియా మొలుక్కానా / జివోటియా రోట్లెరిఫార్మిస్) ఒకటి.ఈ చెట్టు కలప అత్యంత తేలికగా, మృదువుగా ఉండటం వల్ల శతాబ్దాలుగా ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన కొండపల్లి బొమ్మలు మరియు నిర్మల్ కొయ్య బొమ్మల తయారీలో ఉపయోగిస్తున్నారు. ఈ చెట్టు లేకపోతే ఆ కళల అసలు స్వరూపమే ప్రమాదంలో పడుతుంది.దక్షిణ భారతదేశంలోని పొడి ఆకురాల్చే అడవుల్లో మాత్రమే ప్రధానంగా కనిపించే ఈ జాతి నేడు తీవ్రమైన ఒత్తిడిని ఎదుర్కొంటోంది. విచక్షణారహిత నరికివేత, సహజ పునరుత్పత్తి తగ్గడం, అడవుల విస్తీర్ణం క్షీణించడం, అగ్నిప్రమాదాలు, అధిక మేత వంటి కారణాలతో దీని లభ్యత గణనీయంగా తగ్గుతోంది. ఈ జాతి భారతదేశం, శ్రీలంకలలో సహజంగా పెరుగుతుందని వృక్షశాస్త్ర గ్రంథాలు పేర్కొంటున్నాయి.తెల్ల పొనికి చెట్టు కేవలం బొమ్మల తయారీకే కాదు. దీని పుష్పాలు తేనెటీగలను ఆకర్షిస్తాయి. అందువల్ల పరాగసంపర్కానికి దోహదపడుతుంది. విత్తనాలు, ఆకులు, చెట్టు చుట్టూ ఏర్పడే సూక్ష్మ జీవావరణం అనేక చిన్న జీవులకు ఆశ్రయంగా ఉంటుంది. పొడి అడవుల పర్యావరణ సమతుల్యతను కాపాడటంలో ఈ జాతి తన వంతు పాత్ర పోషిస్తుంది. దీని కలపతో బొమ్మలు, చెక్క శిల్పాలు, తేలికపాటి కళాఖండాలు తయారు చేస్తారు. కొన్ని సంప్రదాయ వైద్య విధానాలలో చెట్టు నుండి లభించే రసం వినియోగించినట్లు కూడా నమోదైంది.ఈ రోజు మనం ఒక చెట్టును కోల్పోతే, రేపు ఒక కళను కోల్పోతాం. ఒక కళను కోల్పోతే, దానిపై ఆధారపడిన కుటుంబాలను కోల్పోతాం. చివరకు మన సంస్కృతిని కోల్పోతాం.ఈ నేపథ్యంలో ప్రభుత్వం చేపడుతున్న స్థానిక జాతుల సంరక్షణ కార్యక్రమాలు మరింత బలోపేతం కావాలి. ప్రతి జిల్లా నర్సరీలో తెల్ల పొనికి మొక్కలు తప్పనిసరిగా పెంచాలి. ప్రతి గ్రామంలో కనీసం 100 మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టాలి. జీవవైవిధ్య నిర్వహణ కమిటీలు , పంచాయతీలు, అటవీ శాఖ, పాఠశాలలు, కళాశాలలు కలిసి ప్రత్యేక ఉద్యమం ప్రారంభించాలి. ఆయుర్వేద పరంపర మూలిక వైద్య మహా సంఘం తరఫున మేము కూడా ఒక సంకల్పం చేస్తున్నాము.

- అంతరించిపోతున్న స్థానిక వృక్షజాతుల సంరక్షణకు ఉద్యమం.
- అరుదైన ఔషధ, అటవీ వృక్షాలతో హెర్బల్ గార్డెన్ ఏర్పాటు.
- తెల్ల పొనికి వంటి జాతులపై ప్రజల్లో అవగాహన.
- విద్యార్థులకు, రైతులకు ఉచిత శిక్షణ.
- విత్తన సేకరణ, నర్సరీల అభివృద్ధి.
- ప్రభుత్వంతో, అటవీ శాఖతో, తెలంగాణ జీవవైవిధ్య బోర్డుతో సమన్వయం.
- "ఒక కుటుంబం -- ఒక పొనికి మొక్క" ఉద్యమం.

ఇది కేవలం ఒక పర్యావరణ కార్యక్రమం కాదు. ఇది మన సంస్కృతి పరిరక్షణ ఉద్యమం. మన పిల్లలకు పచ్చని భవిష్యత్తు అందించే సంకల్ప యజ్ఞం.

ఈ ఉద్యమంలో ప్రతి ప్రకృతి ప్రేమికుడు, ప్రతి రైతు, ప్రతి విద్యార్థి, ప్రతి కళాకారుడు భాగస్వామి కావాలి.

"ఒక పొనికి మొక్కను నాటండి.. ఒక కళను, ఒక జీవవైవిధ్యాన్ని, ఒక భవిష్యత్తును కాపాడండి." సింహాచలం లక్ష్మణ స్వామి

# భవన నిర్మాణ సంక్షేమ బోర్డు స్కీములను ఇన్సూరెన్స్ కంపెనీలకు ఇవ్వద్దు

## సిఐటియు డిమాండ్



సికింద్రాబాద్( ప్రశ్న న్యూస్) వెల్ఫేర్ బోర్డు నుండే సంక్షేమ పథకాలు కార్మికులకు అందించాలని సిఎస్సి సంస్థ హెల్త్ టెస్టులను వెంటనే రద్దు చేయాలి, సహజ మరణానికి రూ.5 లక్షలకు పెంచాలి. పెండింగ్ క్లెయిమ్సు నిధులు వెంటనే విడుదల చేయాలని డిమాండ్స్ తో కూడిన వినతిపత్రన్ని సిఐటియు నేతలు మేడ్చల్ డిప్యూటీ ఎమ్మార్వో కు వినతి పత్రం అందజేశారు.ఈ సందర్భంగా సీఐటీయూ మేడ్చల్ మండల కార్యదర్శి ఎం నరేష్ మాట్లాడుతూ తెలంగాణ భవన ఇతర నిర్మాణ కార్మిక సంక్షేమ బోర్డు అమలు చేస్తున్న ప్రమాద మరణం, సహజ మరణం, శాశ్వత, పాక్షిక అంగవైకల్యం ఈ మూడు స్కీములను ప్రైవేట్ ఇన్సూరెన్స్ కంపెనీల ద్వారా అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం జీవో నెం.12ను విడుదల చేసిందని తెలిపారు. జీఓ విడుదల చేసిన వెంటనే ట్రెయిల్ బ్లైజర్ అనే బ్రోకర్స్ సంస్థ ద్వారా రూ.346 కోట్లు ప్రైవేట్ బీమా కంపెనీలకు బదిలీ చేశారని . కార్మికులకు ఎటువంటి ఉపయోగం లేని సిఎస్సి హెల్త్ టెస్టులు చేస్తూ రూ.750 కోట్లకు పైగా ఆ సంస్థకు ఇచ్చి వెల్ఫేర్ బోర్డు సెస్సు నిధులు దుబారా చేశారని కేంద్ర చట్టం, రాష్ట్ర వెల్ఫేర్ బోర్డు నిబంధనలను ఉల్లంఘించి అక్రమంగా ఇన్సూరెన్స్ కంపెనీలకు, సిఎస్సి సంస్థకు వందల కోట్లు కట్టబెట్టడం దుర్మార్గం అని అన్నారు.1996 భవన నిర్మాణ కార్మికుల కేంద్ర చట్టం ప్రకారం వెల్ఫేర్ బోర్డు అడ్వైజరీ కమిటీని నియమించి వారి నిర్ణయం ప్రకారమే బోర్డు నిధులను ఖర్చు చేయాలని . కానీ వెల్ఫేర్ బోర్డు అడ్వైజరీ కమిటీని నియమించకుండా ప్రభుత్వం, కార్మిక శాఖ అధికారులు కమిషన్లకు కక్కుర్తి పడి ఎలాంటి గుర్తింపు లేని ఇన్సూరెన్స్ కంపెనీలకు స్కీములను అప్పగించి పేద నిర్మాణ కార్మికుల నోట్లో మట్టిగొడుతున్నారని ఆరోపించారు. రాష్ట్రవ్యాప్తంగా 2009 నుండి 2025 వరకు బోర్డులో నమోదు చేసుకున్న కార్మికులు 28 లక్షల 50 వేల మంది ఉండగా, 15 లక్షల మందిని మాత్రమే రెన్యువల్ చేసి ఒక్కొక్క కార్మికుడికి ప్రీమియం రూ.2,309 చొప్పున 15 లక్షల మంది కార్మికులకు రూ.346,36 కోట్లు ప్రైవేట్ బీమా కంపెనీలకు అప్పనంగా కట్టబెట్టారని తెలిపారు. 2025 జూలై 24 నుండి ఇప్పటివరకు ఇన్సూరెన్స్ కంపెనీ వారు కార్మికులకు చెల్లించిన నష్టపరిహారాలు రూ.140 కోట్లు మాత్రమే, సుమారు రూ.200 కోట్లు ఇన్సూరెన్స్ కంపెనీలకు మిగిల్చారన్నారు . బోర్డు నుండి డేటా ఇవ్వలేదని సాకు చూపి వేలాది మంది కార్మికులకు నష్టపరిహారాలు ఇవ్వకుండా ఆఫీసుల చుట్టూ తిప్పుకొని వందల కోట్లు ఇన్సూరెన్స్ కంపెనీలు దోచుకున్నాయి. 13 లక్షలకు పైగా కార్మికుల కార్డులు రెన్యువల్ చేయకుండా వారికి అన్యాయం చేస్తున్నారు. వివాహ కానుక, ప్రసూతి కానుక, హాస్పిటల్ ఖర్చులు, దహన సంస్కారాల ఖర్చులు వంటి తదితర స్కీములను ప్రభుత్వం, బోర్డు అధికారులు అనేక కారణాలు చూపి కార్మికులకు అందకుండా చేస్తున్నారని ఆరోపించారు కార్మికులకు ఇవ్వాల్సిన నష్టపరిహారాలకు నిధులు సకాలంలో విడుదల చేయకుండా, కొత్త సంక్షేమ పథకాలు పెట్టకుండా ప్రభుత్వం బోర్డు నిధులను దుబారా చేస్తున్నది అన్నారు.కావున ప్రభుత్వం వెంటనే ఇన్సూరెన్స్ కంపెనీలకు ఇచ్చిన అనుమతి మరోసారి కొనసాగించకుండా జీఓ నెం. 12ను రద్దు చేసి ప్రభుత్వమే వెల్ఫేర్ బోర్డు ద్వారా కార్మికులకు సంక్షేమ పథకాలు అందించాలి. పెండింగ్లో ఉన్న క్లెయిమ్సు నిధులు వెంటనే విడుదల చేయాలి. రెన్యువల్ కాని 13 లక్షల మంది కార్మికుల లేబర్ కార్డులను యుద్ధప్రాతిపదికన రెన్యువల్ చేయాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో బీసీ డబ్ల్యూ యూనియన్ నాయకులు ఎన్ . కృష్ణ, సిహెచ్ కృష్ణ,జి .శ్రీను, అప్పన్న, స్వామి, రజిని, బిక్షపతి, సత్తయ్య, ధనలక్ష్మి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# భారత రాజ్యాంగాన్ని రక్షించుకోవాలి

- డీబీఎఫ్ నిరంతరం పోరాటం చేస్తుంది
- రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య




గజ్వేల్ ( ప్రశ్న న్యూస్ ) భారత రాజ్యాంగం పరిరక్షణ కోసం ప్రజలంతా ఐక్యంగా ఉద్యమించాలని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య పిలుపునిచ్చారు.మంగళవారం గజ్వేల్‌లో నిర్వహించిన దళిత బహుజన ఫ్రంట్ (డీబీఎఫ్) సిద్దిపేట జిల్లా 11వ మహాసభలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ, భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ చెప్పిన "బోధించు -- సమీకరించు -- పోరాడు" అనే సూత్రాన్ని డీబీఎఫ్ ఆచరిస్తూ దళితుల ఆత్మగౌరవం కోసం నిరంతరం పోరాడుతోందన్నారు.తన చైర్మన్ పదవీకాలం పూర్తయిన అనంతరం డీబీఎఫ్‌లో చేరి ఆత్మగౌరవ ఉద్యమంలో భాగస్వామి అవుతానని తెలిపారు. దేశంలో, రాష్ట్రంలో ఎక్కడ దళితులకు అన్యాయం జరిగినా డీబీఎఫ్ బాధితుల పక్షాన నిలబడి న్యాయం కోసం ఉద్యమిస్తుందని పేర్కొన్నారు.డాక్టర్ అంబేద్కర్ సూచించినట్లుగా ప్రతి ఒక్కరూ ప్రశ్నించే అలవాటును పెంపొందించుకుని బానిసత్వం నుంచి విముక్తి పొందాలని సూచించారు. ప్రజాస్వామ్య పరిరక్షణ, సమాజ మార్పు, దళితుల హక్కుల రక్షణ కోసం నిరంతరం అప్రమత్తంగా ఉండాలని పిలుపునిచ్చారు. ఇప్పటికీ కులం పేరుతో పరువు హత్యలు జరుగుతున్నాయని, అలాంటి ఘటనల్లో రక్షించాల్సిన వ్యవస్థలు మరింత బాధ్యతాయుతంగా వ్యవహరించాలని అన్నారు. హక్కుల పరిరక్షణ కోసం ఐక్య పోరాటాలు అవసరమని తెలిపారు.డీబీఎఫ్ జాతీయ కార్యదర్శి పి. శంకర్ మాట్లాడుతూ, ఉపాధి హామీ చట్టానికి సంబంధించిన అంశాలపై కేంద్ర ప్రభుత్వ విధానాలను నిరసించాలని పిలుపునిచ్చారు. యువత ఉన్నత విద్యను అభ్యసించాలని, మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సూచించారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు దేవి రవీందర్, మాదాసు శ్రీనివాస్, డీబీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు రౌతు రమేష్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మెట్ల శంకర్, బీఎస్పీ నాయకులు స్వామి, జర్నలిస్ట్ పుట్టరాజు, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు స్వామి, మామిడాల సర్పంచ్ పోచయ్య, వివిధ సంఘాల నాయకులు జాఫర్ భాయ్, బండారు దేవేందర్ తదితరులు పాల్గొన్నారు. డీబీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి దాసరి ఏ. గొండ స్వామి భారత రాజ్యాంగ పీఠికతో ప్రతిజ్ఞ చేయించారు. అలాగే డీబీఎఫ్ సిద్దిపేట జిల్లా నూతన కమిటీ ఎన్నిక డీబీఎఫ్ సిద్దిపేట జిల్లా 11వ మహాసభలో నూతన జిల్లా కమిటీని ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా బ్యాగరి వేణు, ఉపాధ్యక్షుడిగా పోతరాజు శంకర్, జిల్లా ప్రధాన కార్యదర్శిగా భీమ్ శేఖర్, కార్యదర్శిగా సతీష్ కుమార్ ఎన్నికయ్యారు.సభ్యులుగా ఏలూరు నరసయ్య, సింగాటం చంద్రం, తిగుల్ యాదగిరి, నరసమ్మ, చందరాజు, కిరణ్, రవి, శ్రీను, నరసింహులు ఎన్నిక కాగా, జిల్లా సలహాదారులుగా మామిడాల సర్పంచ్ పోచయ్య, జర్నలిస్ట్ పుట్టరాజులను ఎంపిక చేశారు.

# ప్రజారోగ్య సేవల్లో ఫార్మసీ ఆఫీసర్ల పాత్ర కీలకం

- ఫార్మసీ ఆఫీసర్ల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా
- జిల్లా వైద్య,ఆరోగ్య శాఖ అధికారి : డాక్టర్ ఏంజెలా
- ఫార్మసీ అధికారుల సమస్యల పరిష్కారంతో మెరుగైన వైద్య సేవలు
- టీజీపీఓఏ జిల్లా ప్రధానకార్యదర్శి : తోట రాజ్ కుమార్
- నూతన డీఎం అండ్ హెచ్ ఓకు టీజీపీఓఏ ఘన సన్మానం



సిరిసిల్ల /బోయినిపల్లి (ప్రశ్న న్యూస్) తెలంగాణ గవర్నమెంట్ ఫార్మసీ ఆఫీసర్స్ అసోసియేషన్ (టీజీపీఓఏ) రాజన్న సిరిసిల్ల జిల్లా కమిటీ ఆధ్వర్యంలో నూతన జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డా. ఏంజెలాను మంగళవారం ఘనంగా సన్మానించారు. జిల్లా ప్రధాన కార్యదర్శి తోట రాజ్‌కుమార్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సంఘ ప్రతినిధులు ఆమెకు శాలువా కప్పి, పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా ఫార్మసీ ఆఫీసర్లు ఎదుర్కొంటున్న ఆల్టర్నేటివ్ కోల్డ్ చైన్ హాండ్లర్ కేటాయింపు, ఈ–ఔషధి డేటా ఎంట్రీ సమస్యలు, సెలవుల సమయంలో ఫార్మసీ స్టోర్ ఇంచార్జి బాధ్యతల అప్పగింత, ఈ–విన్ నిర్వహణతో పాటు పెరుగుతున్న పని భారం వంటి అంశాలను సంఘ నాయకులు ఆమె దృష్టికి తీసుకెళ్లారు.వాటిపై స్పందించిన డా. ఏంజెలా ప్రభుత్వ నిబంధనల మేరకు ఫార్మసీ ఆఫీసర్ల సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడంలో ఫార్మసీ ఆఫీసర్ల పాత్ర కీలకమని ఆమె పేర్కొన్నారు.అనంతరం జిల్లా ప్రధాన కార్యదర్శి రాజ్‌కుమార్ మాట్లాడుతూ, ఫార్మసీ ఆఫీసర్ల సమస్యల పరిష్కారం ద్వారా ప్రభుత్వ వైద్య సేవల నాణ్యత మరింత మెరుగుపడుతుందని అన్నారు.ఈ కార్యక్రమంలో ఏవో డా. అనిత, డీఐవో డా. సంపత్ కుమార్, వర్కింగ్ ప్రెసిడెంట్ ఉమాదేవి, రజని, ఉపాధ్యక్షురాలు రమ్య, ఆర్గనైజింగ్ సెక్రటరీ శ్రీకాంత్, జాయింట్ సెక్రటరీ సిరి చందనతో పాటు పలువురు ఫార్మసీ ఆఫీసర్లు పాల్గొన్నారు.

# అయ్యప్ప నగర్ కాలనీ రోడ్ల మరమ్మతులు, సీసీ రోడ్ల నిర్మాణానికి వినతి

-గతంలో జరిగిన వివక్షను విడనాడి కాలనీ అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని మున్సిపల్ అధికారులకు విజ్ఞప్తి





గజ్వేల్ ( ప్రశ్న న్యూస్ ) గజ్వేల్--ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని అయ్యప్ప నగర్ కాలనీలో రోడ్ల మరమ్మతులు, సీసీ రోడ్ల నిర్మాణం చేపట్టాలని కోరుతూ కాలనీవాసులు స్థానిక మున్సిపల్ కమిషనర్, మున్సిపల్ చైర్మన్‌కు వినతిపత్రం సమర్పించారు.కాలనీలోని రాజీవ్ పార్క్ రోడ్డు నుంచి ఎన్టీఆర్ చౌరస్తా వరకు ఉన్న ప్రధాన రహదారిని అమృత్ సంస్థ పైపులైన్ పనుల కోసం డ్రిల్లింగ్ యంత్రాలతో తవ్వి, పనులు పూర్తయిన అనంతరం యథావిధిగా పునరుద్ధరించకుండా వదిలేయడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వినతిపత్రంలో పేర్కొన్నారు. ఈ రహదారిని వెంటనే మరమ్మతులు చేసి ప్రయాణానికి అనుకూలంగా మార్చాలని కోరారు.ఈ సందర్భంగా కాలనీ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు బండ్ల స్వామి, ప్రధాన కార్యదర్శి మోతె వీరారెడ్డి మాట్లాడుతూ, మున్సిపాలిటీ ఏర్పడినప్పటి నుంచి అయ్యప్ప నగర్ కాలనీపై నిర్లక్ష్యం కొనసాగుతోందని ఆరోపించారు. గతంలో పలుమార్లు రోడ్ల మరమ్మతులు, సీసీ రోడ్ల నిర్మాణం కోసం అధికారులు, ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేకపోయిందన్నారు.ప్రజలు నివసించని ఖాళీ ప్లాట్ల వద్ద సీసీ రోడ్లు నిర్మించగా, నిత్యం ప్రజలు వినియోగించే అయ్యప్ప నగర్ ప్రధాన రహదారులను పట్టించుకోలేదని విమర్శించారు. రాజీవ్ పార్క్, రాజిరెడ్డిపల్లి గ్రామం, మహంకాళి దేవాలయానికి వెళ్లే ప్రధాన మార్గమైన ఈ రహదారిని అభివృద్ధి చేయాలని కోరారు.ప్రస్తుత మున్సిపల్ పాలకవర్గం గత వివక్షను పక్కనబెట్టి అయ్యప్ప నగర్ కాలనీ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించాలని విజ్ఞప్తి చేశారు. తమ వినతిపై మున్సిపల్ కమిషనర్, మున్సిపల్ చైర్మన్ సానుకూలంగా స్పందించారని, త్వరలోనే సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు కాలనీవాసులు తెలిపారు.ఈ కార్యక్రమంలో కాలనీ అసోసియేషన్ కోశాధికారి అలివేలు నారాయణరెడ్డి, సభ్యులు వగ్గు మల్లేశం, ఎంకన్నగారి గోపాల్ రెడ్డి, గురప్పగారి శ్రీరాములు, రేకుల కృష్ణారెడ్డి, బుస్స పండరి, కొట్టాల యాదగిరి, రంగు శ్రీనివాస్, కోల సూర్యారావు, కాశిరెడ్డి బాల్‌రెడ్డి, నాగరాజు, గుజ్జేటి కిరణ్, మారుపల్లి సంజయ్, కాశిరెడ్డి సాయిచరణ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# సేవతోపాటు చివరి సంస్కారాలు నిర్వహించిన వృద్ధాశ్రమ నిర్వాహకులు

- అమ్మా అనాథ వృద్ధాశ్రమం - మానవత్వానికి నిదర్శనం




తంగళ్లపల్లి (ప్రశ్న న్యూస్) రాజన్న సిరిసిల్ల జిల్లా,వేములవాడలో అనారోగ్యంతో దయనీయ స్థితిలో ఉన్న గోగుల లక్ష్మీ (65) అనే అనాథ వృద్ధురాలిని సుమారు 18 నెలల క్రితం పోలీసులు సిరిసిల్ల ఏరియా ఆస్పత్రికి తరలించారు. అనంతరం జిల్లా సంక్షేమ శాఖ సూచన మేరకు తంగళ్లపల్లి మండలం, ఓబుళాపూర్‌లోని అమ్మా అనాథ వృద్ధాశ్రమంలో చేర్పించి సంరక్షించారు. మంగళవారం అనారోగ్యంతో ఆయన మృతిచెందడంతో, బంధువులు ఎవరూ లేకపోవడంతో తంగళ్లపల్లి పోలీసులకు, సంబంధిత అధికారులకు సమాచారం ఇచ్చి ఆశ్రమ నిర్వాహకులు గడ్డం తిరుమల – శ్రీనివాస్ ఆధ్వర్యంలో హిందూ సంప్రదాయాల ప్రకారం అంత్యక్రియలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆశ్రమ సిబ్బంది, గ్రామ పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

# చిన్నారుల సురక్షిత విద్యకు దాతల సహకారం అవసరం

-డిజిటల్ భోదనతో పెరిగిన విద్యార్థుల హాజరు

- పాములు, తేళ్లు, దోమల నివారణకు రక్షణ చర్యలు అనివార్యం

- బూరుగుపల్లి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు : సత్యనారాయణ విజ్ఞప్తి






బోయినిపల్లి (ప్రశ్న న్యూస్) రాజన్న సిరిసిల్ల జిల్లా, బోయినిపల్లి మండలం, బూరుగుపల్లి గ్రామ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థుల అభ్యాసాన్ని మెరుగుపర్చేందుకు గ్రామానికి చెందిన పూర్వ విద్యార్థి, దాత కొలుపుల ప్రవీణ్ అందించిన ఎల్ఈడి టీవీ, పాఠశాల సిబ్బంది ఏర్పాటు చేసిన వైఫై సౌకర్యంతో విద్యార్థుల్లో చదువుపై ఆసక్తి పెరిగి హాజరు శాతం గణనీయంగా మెరుగుపడిందని ప్రధానోపాధ్యాయుడు సత్యనారాయణ తెలిపారు.అయితే విద్యార్థులకు మరింత సురక్షితమైన, ఆరోగ్యకరమైన విద్యా వాతావరణం కల్పించేందుకు ఇంకా పలు మౌలిక సదుపాయాలు అవసరమని ఆయన పేర్కొన్నారు. పాఠశాల కిటికీలకు జాలి (మెష్) ఏర్పాటు చేసి పాములు, తేళ్లు, దోమలు వంటి క్రిమికీటకాలు తరగతి గదుల్లోకి రాకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. అలాగే ఇనుప కిటికీలకు రక్షణ చర్యలు చేపట్టడంతో పాటు, తలుపులు, కిటికీలు, ఫర్నిచర్‌కు చెదలు సోకకుండా యాంటీ టర్మైట్ పనులు నిర్వహించాల్సిన అవసరం ఉందన్నారు.చిన్నారులు సురక్షితమైన, పరిశుభ్రమైన వాతావరణంలో విద్యను అభ్యసించేలా గ్రామ దాతలు, ప్రవాసులు, సేవా సంస్థలు పాఠశాల అభివృద్ధికి చేయూతనివ్వాలని సత్యనారాయణ విజ్ఞప్తి చేశారు. ప్రతి ఒక్కరూ చిన్నారుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి సహకరిస్తే విద్యా ప్రమాణాలు మరింత మెరుగుపడతాయని ఆయన అన్నారు.

# వాస్తు మారిస్తే... విమర్శలు మాయమవుతాయా..?

- ఈశాన్యంలో కొత్త గదుల నిర్మాణంపై చర్చ
- పారదర్శక పాలనకే ప్రజల ప్రాధాన్యం





గజ్వేల్ ( ప్రశ్న న్యూస్ ) సిద్దిపేట జిల్లా గజ్వేల్ ప్రజలకు మెరుగైన సేవలు అందించాల్సిన గజ్వేల్--ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీలో ప్రస్తుతం అభివృద్ధి పనుల కంటే కార్యాలయ వాస్తు మార్పులపై చర్చ ఎక్కువగా జరుగుతోంది. మున్సిపల్ కార్యాలయానికి ఈశాన్య దిశలో పాలకవర్గం కోసం ప్రత్యేక గదుల నిర్మాణం చేపట్టడం స్థానికంగా చర్చనీయాంశంగా మారింది.మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు హయాంలో గజ్వేల్‌ను ఆధునిక పట్టణంగా తీర్చిదిద్దే లక్ష్యంతో నిర్మించిన మున్సిపల్ కార్యాలయంలో ఇప్పుడు వాస్తు పేరుతో మార్పులు చేపట్టడం రాజకీయ, సామాజిక వర్గాల్లో భిన్నాభిప్రాయాలకు దారితీస్తోంది.స్థానికుల అభిప్రాయం ప్రకారం, తొలి పాలకవర్గం పాత గ్రామపంచాయతీ కార్యాలయంలోనే ఐదేళ్ల పదవీకాలాన్ని పూర్తి చేయగా, రెండో పాలకవర్గం కూడా కొంతకాలం సజావుగా కొనసాగింది. అనంతరం జరిగిన రాజకీయ పరిణామాలు రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశమయ్యాయి. ప్రస్తుతం ఉన్న పాలకవర్గంపై కూడా కొన్ని ఆరోపణలు, విమర్శలు వినిపిస్తున్నాయని స్థానికులు పేర్కొంటున్నారు. అయితే, ఈ ఆరోపణలపై అధికారికంగా ఎలాంటి తుది నిర్ధారణ వెలువడలేదు.ఈ నేపథ్యంలో కార్యాలయానికి వాస్తు మార్పులు చేస్తూ ఈశాన్య భాగంలో కొత్త గదుల నిర్మాణం చేపట్టడం పలు ప్రశ్నలకు తావిస్తోంది. “వాస్తు మారితే పాలనలో మార్పు వస్తుందా? ప్రజల విశ్వాసం పెరుగుతుందా.? విమర్శలు తగ్గిపోతాయా.?” అని పలువురు మేధావులు, స్థానికులు ప్రశ్నిస్తున్నారు. ప్రజా సమస్యలకు వేగంగా స్పందించడం, పారదర్శక పాలన అందించడం, ప్రజలకు జవాబుదారీతనంతో వ్యవహరించడమే ప్రజాప్రతినిధుల ప్రధాన బాధ్యత అని వారు అభిప్రాయపడుతున్నారు. వాస్తు మార్పుల కంటే పాలనా విధానంలో సానుకూల మార్పులు తీసుకొస్తేనే మున్సిపాలిటీపై ప్రజల విశ్వాసం మరింత బలపడుతుందని స్థానికులు సూచిస్తున్నారు.

# ప్రతిపాదనలేనా,పనులు కార్యరూపం దాల్చేనా.?

కంటోన్మెంట్ (ప్రశ్న న్యూస్) డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ కూరగాయల మార్కెట్ లో 2025 జనవరి 4 కమిటీ బాధ్యతలు స్వీకరించారు.పాపం అభం శుభం తెలియని కమిటీ పెద్దలు ప్రభుత్వం పై నమ్మకంతో యార్డ్ లో పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపడతామని మంగమ్మ శపథాలు గతంలో చేశారు.పాలకమండలి ఏర్పాటు అయిన తర్వాత ఆరు నెలలకు మార్కెట్లో కమీషన్ ఏజెంట్లు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్య మంచినీళ్ళు.“6”మాసాల్లో తాగు నీరు సౌకర్యం ఏర్పాటు చేస్తామని “కమీషన్ ఏజెంట్ల”సమావేశంలో కమిటీ పెద్దలు వాగ్దానం చేయడమే కాకుండా అవసరమైతే మాట నిలబెట్టుకోకపోతే రాజీనామాలు చేస్తామని సభ ముఖంగా పేర్కొన్నారు. కాలక్రమేనా అగ్రికల్చర్ డైరెక్టర్ సూచనల మేరకు “చెత్త క్లీనింగ్”, సెక్యూరిటీ టెండర్లు పిలిచి,నూతన గుత్తేదారులకు బాధ్యతలు అప్పగించారు. గార్బేజ్ కాంట్రాక్టర్ కు ,సెక్యూరిటీ కాంట్రాక్ట్ కు నెలసరి చెక్కులు రాకపోవడంతో మధ్యలోనే కాంట్రాక్టర్ వదిలేసి వెళ్లిపోయాడు. మార్కెట్ లో స్వీపింగ్ లేక చెత్త చెదారంతోకేంద్రాల వద్ద పెద్ద పెద్ద గుట్టలు గుట్టలుగా పేరుకుపోయిన చిత్రాలు దర్శనం ఇవ్వడంతో మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ ధర్నా చేసి కాస ఊరట కలిగించారు.బయో గ్యాస్ కేంద్రానికి కూరగాయల వ్యర్థాలు తరలించకపోవడంతో గత ఐదు మాసాల నుంచి బోయిన్ పల్లి మార్కెట్ లో ఎక్కడ పడితే అక్కడ చెత్త చెదారం ద్వారా దుర్వాసన,దోమలు,ఈగలు తాండవం ఆడుతున్నాయని కమీషన్ ఏజెంట్లు,హమాలీలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇలా ఒకటి కాదు రెండు కాదు చాంతాడంత లిస్టులో సమస్యలు మార్కెట్ లో డ్యాన్స్ చేస్తున్నాయి. ఉదహరణకు మరుగు దొడ్లు విషయంలో ప్రజలు ప్రభుత్వాన్ని, మార్కెట్ అధికారుల పై దుమ్మెత్తి పోస్తున్నారు.మొత్తం మార్కెట్ యార్డులో కంపు కొడుతున్న కుళ్లిన కూరగాయల వ్యర్థాలు, అంతర్గత రోడ్లు ఎత్తుపల్లాలు,రంధ్రాలుతోమార్కెట్లో కి ఖరీదు దారులను స్వాగతం పలుకుతున్నాయి. అయినా పట్టించుకునే నాథుడే లేడని మార్కెట్ వర్గాలు చెబుతున్నారు.ఏదేమైనా ప్రస్తుతం మార్కెట్ పరిస్థితి చాలా దయనీయంగా తయారైంది.

**పాలకమండలిలో పలు అంశాలపై చర్చ:**



డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ కూరగాయల మార్కెట్ కమిటీ నిన్న మంగళవారం ఉదయం 11:31 నిమిషాలకు సమావేశం నిర్వహించారు. ఈమీటింగ్ లో కోటి ఎనిమిది లక్షల రూపాయల ప్రతిపాదనలు నివేదిక తయారు చేశారు.అందులోఅరవై లక్షల రూపాయలతో నూతన టాయిలెట్స్ నిర్మాణం.మార్కెట్లో రెండు మరుగు దొడ్లు ఉన్న విషయం అందరికి తెలిసిందే,దాంట్లో ఒక దాని పరిస్థితి బాగలేకపోవడంతో దాని మరమత్తులు కోసం సుమారు :27 లక్షల రూపాయలు ఖర్చు చేస్తున్నట్లు,అలాగే యార్డ్ లో అంతర్గత రోడ్లు గుంతలు గుంతలు గా ఉన్నాయని వాటి కోసం సుమారు 16 లక్షల 50 వేల రూపాయలు వెచ్చించాలని కమిటీ నిర్ణయం తీసుకున్నట్లు బోయిన్ పల్లి మార్కెట్ సెక్రటరీ ఈ.వేంకటేశం తెలిపారు.అలాగే మన కూరగాయల ప్రాసెస్సింగ్ కేంద్రాన్ని మరో ఆరు నెలలు పొడిగిస్తున్నట్లు,మరో విషయం ఏమిటంటే మార్కెట్లో కమీషన్ కి చెందిన ఒక దుకాణం,గ్రేన్ మార్చేంట్స్ కి చెందిన రెండు దుకాణాలు నిరుపయోగంగా ఉండడంతో వాటిని త్వరలో బహిరంగంగా ఆక్షన్ ఏర్పాటు చేస్తున్నట్లు సెక్రటరీ తెలిపారు.అయితేగ్రేన్ మార్చేంట్స్ కు చెందిన రెండు దుకాణాల వేలం పాటకు గట్టి పోటీ (సుమారు ఇరవై మంది) ఉన్నట్లు సమాచారం.కమీషన్ ఏజెంట్లకు చెందిన మరో షాపు వేలం పాటకు అర్హులు కేవలం “44”లైసెన్స్ దారులు మాత్రమే కావడం విశేషం.ఇందులో కూడా పోటీ ఆకాశాన్ని తాకేలా అందరూ సిద్ధంగా ఉన్నట్లు తెలుస్తోంది.ఈ కార్యక్రమంలో డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ కూరగాయల మార్కెట్ కమిటీ చైర్మన్ రాగిరి ఆనంద్ బాబు,వైస్ చైర్మన్ దేవేందర్, మార్కెట్ యార్డు ఇన్చార్జ్ మధులిక, సభ్యులు కృష్ణా రెడ్డి, డి.సి.ప్రభాకర్, సంతూ జూలియస్, అవినాష్ రెడ్డి, దుర్గా గౌడ్, మహ్మద్ పాషా,అస్లం బాయ్,ఎల్లోల రాజేందర్,రాము తదితరులు పాల్గొన్నారు.

# గజ్వేల్ అభివృద్ధిపై అన్ని రాజకీయ పార్టీలు దృష్టి సారించాలి

**సీనియర్ ఆర్టిస్టు, రాజకీయ పరిశీలకుడు బి.వి.రావు పంతులు పిలుపు**



గజ్వేల్ (ప్రశ్న న్యూస్) సిద్దిపేట జిల్లా గజ్వేల్ అసెంబ్లీ నియోజకవర్గ అభివృద్ధి కోసం రాజకీయాలకు అతీతంగా అన్ని రాజకీయ పార్టీలు, ప్రజాప్రతినిధులు, నాయకులు కలిసి పనిచేయాలని సీనియర్ ఆర్టిస్టు, రాజకీయ పరిశీలకుడు బెజుగామ వెంకటేశ్వరరావు (బి.వి.రావు పంతులు -- సింహం పంతులు) కోరారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 1974--75 కాలం నుంచి గజ్వేల్ రాజకీయాలను ప్రత్యక్షంగా గమనిస్తున్నానని, అనేక ఎన్నికల్లో ప్రచార ఆర్టిస్టుగా పనిచేసిన అనుభవం తనకు ఉందన్నారు. గజ్వేల్‌లో జరిగిన రాజకీయ పరిణామాలు, వివిధ పార్టీల విజయాలు--ఓటములు, నాయకత్వ మార్పులను దగ్గరగా పరిశీలించినట్లు తెలిపారు.గత ఐదు దశాబ్దాలుగా గజ్వేల్ నియోజకవర్గానికి ప్రాతినిధ్యం వహించిన మణికొండ భూపతిరావు, మాదాడి రంగారెడ్డి, కొడకండ్ల మణికొండ లక్ష్మీకాంతరావు, గజ్వేల్ సైదయ్య, కొడకండ్ల గంగుమల్ల, ఎలక్షన్ రెడ్డి, అల్లం సాయిలు, బెజ్జం సంజీవరావు, జెట్టి గీతారెడ్డి, గుండి విజయరామారావు, తూంకుంట నర్సారెడ్డి, కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు తదితరులు తమ హయాంలో గజ్వేల్ అభివృద్ధికి కృషి చేశారని పేర్కొన్నారు.ప్రత్యేకించి మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు (కేసీఆర్) హయాంలో గజ్వేల్‌లో రహదారులు, రింగ్ రోడ్డు, మల్లన్నసాగర్, కొండపోచమ్మ రిజర్వాయర్, ఆధునిక ఆసుపత్రులు, విద్యాసంస్థలు, రైతు వేదికలు, డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు, మార్కెట్లు, పార్కులు, మున్సిపల్ కార్యాలయం, గురుకుల పాఠశాలలు వంటి అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టబడినట్లు తెలిపారు.అయితే గజ్వేల్‌లో ఇంకా ఐటీ హబ్, ఎంబీబీఎస్ మెడికల్ కాలేజీ, పర్యాటక అభివృద్ధి, అదనపు రైల్వే సర్వీసులు, నాలుగు లైన్ల రహదారులు, పరిశ్రమల ఏర్పాటు, యువతకు ఉపాధి అవకాశాలు, అన్ని గ్రామాల సమగ్ర అభివృద్ధి వంటి అంశాలపై మరింత దృష్టి పెట్టాల్సిన అవసరం ఉందన్నారు.పార్టీల మధ్య భేదాభిప్రాయాలను పక్కనబెట్టి గజ్వేల్ అభివృద్ధినే ప్రధాన లక్ష్యంగా చేసుకోవాలని, ప్రజలకు చేసిన అభివృద్ధి పనులను వాస్తవాల ఆధారంగా వివరించాలని రాజకీయ నాయకులు, కార్యకర్తలకు సూచించారు.చివరగా ఆయన మాట్లాడుతూ, “పదవులు, డబ్బు కోసం కాకుండా ప్రజల శ్రేయస్సు కోసం రాజకీయాలు చేయాలి. పంచాయతీలను పక్కనబెట్టి ప్రగతి వైపు అందరం కలిసి నడవాలి. భావితరాల కోసం అభివృద్ధి బాటలు వేస్తూ గజ్వేల్‌ను దేశంలోనే ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దడం మనందరి లక్ష్యం కావాలి. ముందడుగే మన లక్ష్యం... కార్యసాధనే మన గమ్యం. యువతరం ముందుండి మరో నవతర గజ్వేల్‌ను నిర్మిద్దాం” అని పిలుపునిచ్చారు.

# 'బ్రేక్ ఫాస్ట్' మూవీ రివ్యూ!



రానవ్ – రోస్మిన్ ప్రధానమైన పాత్రలను పోషించిన తమిళ సినిమానే 'బ్రేక్ ఫాస్ట్'. గిరిజా వరదరాజ్ నిర్మించిన ఈ సినిమాకి, గాంధీకృష్ణ దర్శకత్వం వహించాడు. జీవీ ప్రకాశ్ కుమార్ సంగీతాన్ని సమకూర్చిన ఈ సినిమా, ఏప్రిల్ 24వ తేదీన థియేటర్లకు వచ్చింది. సంపత్ రాజ్ – అర్చన కీలకమైన పాత్రలను పోషించిన ఈ సినిమా, ఈ నెల 24వ తేదీ నుంచి 'అమెజాన్ ప్రైమ్'లో స్ట్రీమింగ్ అవుతోంది. తమిళంతో పాటు తెలుగు .. కన్నడ భాషల్లో ఈ సినిమా అందుబాటులో ఉంది. శంతను (రానవ్) ఇంజనీరింగ్ పూర్తి చేసి, మలేసియాలో కొంతకాలం పాటు జాబ్ చేస్తాడు. ఆ తరువాత కొన్ని కారణాల వలన అతను అక్కడి నుంచి వచ్చేయవలసి వస్తుంది. అయితే తాను మలేసియాలో ఉన్నట్టుగానే తల్లిదండ్రులను నమ్మిస్తూ, వాళ్ల అవసరాలను తీరుస్తుంటాడు. తండ్రి ట్రీట్మెంట్ కి తగిన డబ్బును పంపిస్తూ ఉంటాడు. తన సర్టిఫికెట్స్ కూడా సీజ్ చేయబడటంతో, డబ్బు కోసం తనకి తోచిన పనులను చేస్తూ వెళుతుంటాడు. అలాంటి అతను ఒక రోజున జాన్వీ (రోస్మిన్) కంటపడతాడు. ఆ తరువాత కూడా ఒకటి రెండు సార్లు ఆమెకి తారసపడతాడు. అతని కేరక్టర్ ఆమెకి చాలా ఇంట్రెస్టింగ్ గా అనిపిస్తుంది. శ్రీమంతుడైన రాజారామ్ (సంపత్ రాజ్)కి ఆమె కూతురు. తండ్రి నడుపుతున్న బిస్కట్ కంపెనీకి ఆమె జె ఎమ్ డి గా ఉంటుంది. అలాంటి ఆమె శంతను గురించి తెలుకుని అతనికి తమ సంస్థలో జాబ్ ఇస్తుంది. అప్పటి నుంచి వాళ్లిద్దరి మధ్య పరిచయం మొదలై అది కాస్తా ప్రేమగా మారుతుంది ..పెళ్లి వరకూ వెళుతుంది. రాజా రామ్ మొదటి భార్య కూతురే జాన్వీ. తన కూతురు శంతనును ప్రేమిస్తుందనే విషయం అతనికి తెలిసిపోతుంది. ఈ విషయంలో అతను కూతురును మందలిస్తాడు. తన అంతస్తుకి తగిన వాడిని పెళ్లి చేసుకోమని చెప్పి, ఒక సంబంధం తీసుకొస్తాడు. అప్పుడు జాన్వీ ఏం చేస్తుంది? ఎలాంటి నిర్ణయం తీసుకుంటుంది? శంతనుతో ఆమె జీవితం ఎలా కొనసాగుతుంది? అనేది మిగతా కథ. రిషభ్ – లక్ష్మీ అనే ఇద్దరు యువతీ యువకులు ప్రేమించుకుని పెళ్లి చేసుకుంటారు. పెళ్లైన మూడు నెలలకే విడిపోవాలని నిర్ణయించుకుంటారు. ఈ విషయంలో కౌన్సిలింగ్ కోసం సైకియాట్రిస్ట్ 'గంగాదేవి'( కస్తూరి)ని కలుస్తారు. తనముందే వాళ్లిద్దరూ పడుతున్న గొడవను చూసిన గంగాదేవి, గతంలో జరిగిన శంతను – జాన్వీ ప్రేమకథను చెప్పడం మొదలుపెట్టడంతోనే అసలు కథ మొదలవుతుంది. ఈ గంగాదేవికి .. ఆ శంతను కథకు లింక్ ఏమిటి? అనే కుతూహలాన్ని రేకెత్తిస్తూ దర్శకుడు ఈ కథను నడిపించాడు. శ్రీమంతురాలైన జాన్వీ, పేదింటికి చెందిన శంతనును ప్రేమించడం .. తండ్రిని ఎదిరించి పెళ్లి చేసుకోవడం .. తన సంస్థను అతని చేతులలో పెట్టడం .. ఫస్టాఫ్ గా కొనసాగుతుంది. ఇక శంతను తల్లిదండ్రులు ఆ ఇంటికి రావడం .. ఆ పల్లె మనుషుల అలవాట్లు ఆమెకి నచ్చకపోవడం .. వాళ్ల విషయంలో ఆమె కఠిన వైఖరి సెకండాఫ్ పై మరింత కుతూహలాన్ని పెంచుతూ వెళతాయి. భార్యాభర్తల మధ్య ఈగోలు ఈ కథను మరింత వేడెక్కిస్తూ ప్రీ క్లైమాక్స్ దిశగా నడిపిస్తాయి.

సాధారణంగా తండ్రి బాగా డబ్బు – పలుకుబడి ఉన్న వ్యక్తి అయినప్పుడు, కూతురు అతనికి ఇష్టం లేని పెళ్లి చేసుకోవాలనుకున్నప్పుడు .. ఆ తండ్రి ఏం చేస్తాడోననే ఒక టెన్షన్ ఆడియన్స్ కి ఉంటుంది. అందుకు తగినట్టుగానే ఆ తండ్రి రకరకాలుగా ఇబ్బంది పెట్టడం జరుగుతుంటుంది. కానీ అక్కడి నుంచి అందుకు భిన్నంగా ఈ కథ ముందుకు వెళుతుంది. తండ్రి పాత్ర పక్కకి వెళ్లిపోయి, భార్యాభర్తలు తలపడటం కొత్తగా అనిపిస్తుంది.కథలో ఎక్కువ భాగం హీరో – హీరోయిన్ చుట్టూ తిరుగుతుంది. ప్రేమికులుగా .. భార్యాభర్తలుగా వాళ్ల పాత్రలలో వేరియేషన్స్ ఉంటాయి. వాళ్లిద్దరూ అలా గొడవపడుతూ ఉంటే, చివరిలో కనువిప్పు కలగడం కామనే గదా అనుకుంటాము. కానీ అక్కడే ఎవరూ గెస్ చేయని ఒక ట్విస్ట్ పడుతుంది. ఆ ట్విస్ట్ అప్పటివరకూ చూసిన కథ బరువును పెంచుతుంది. ఈ కంటెంట్ ను యావరేజ్ ప్లేస్ లో నిలబెడుతుంది. ప్రధానమైన పాత్రలను పోషించిన వాళ్లంతా బాగా చేశారు. డబ్బు .. అహంభావం కూడిన పాత్రలో రోస్మిన్ నటన ఆకట్టుకుంటుంది. తన మాట మాత్రమే నెగ్గాలనే పంతం కలిగిన ఆ పాత్రలో ఆమె అభినయం మెప్పిస్తుంది. ఇక తల్లిదండ్రుల పట్ల బాధ్యతగా మసలుకునే పాత్రలో రానవ్ నటన మంచి మార్కులు కొట్టేస్తుంది. పన్నీర్ సెల్వమ్ ఫొటోగ్రఫీ ..జీవీ ప్రకాశ్ కుమార్ సంగీతం .. ఫరవాలేదు. భాస్కర్ ఎడిటింగ్ ఓకే.తల్లిదండ్రులను ప్రేమించలేనివారు మరెవరినీ ప్రేమించలేరు. బంధాలకు .. అనుబంధాలకు విలువనీయలేరు. ఈగో కారణంగా వైవాహిక జీవితాన్ని నాశనం చేసుకోవద్దు. సర్దుకుపోవడంలోనే సంతోషం ఉంటుంది అనే సందేశాన్ని ఇచ్చిన ఈ సినిమా, యావరేజ్ కేటగిరీలోకి వస్తుందని చెప్పొచ్చు.


# హీరోయిన్ హనీ రోజ్‌కు క్షమాపణ చెప్పిన వ్యాపారవేత్త



కేరళకు చెందిన ప్రముఖ వ్యాపారవేత్త బాబీ చెమ్మనూర్ హీరోయిన్ హనీ రోజ్‌కు బహిరంగంగా క్షమాపణలు చెప్పారు. ఒక జ్యువెలరీ షోరూమ్ ప్రారంభోత్సవ వేడుకలో హనీ రోజ్‌ను ఉద్దేశించి ఆయన చేసిన కొన్ని వ్యాఖ్యలు తీవ్ర వివాదానికి దారితీశాయి. తనపై లైంగిక భావనలతో కూడిన, అవమానకరమైన వ్యాఖ్యలు చేశారంటూ హనీ రోజ్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో చెమ్మనూర్‌పై క్రిమినల్ కేసు నమోదైంది.
ఈ నేపథ్యంలో, బాబీ చెమ్మనూర్ తన ఫేస్‌బుక్ ఖాతా ద్వారా స్పందిస్తూ, తన వ్యాఖ్యలు హనీ రోజ్‌ను, ఆమె కుటుంబాన్ని బాధపెట్టాయని గ్రహించానని... ఈ ఉదంతానికి పూర్తి బాధ్యత వహిస్తూ మనస్ఫూర్తిగా క్షమాపణలు కోరుతున్నానని ప్రకటించారు. ఆమెను బాధపెట్టాలనే ఉద్దేశం తనకు ఏమాత్రం లేదని, ఈ సమస్యను సానుకూలంగా పరిష్కరించుకోవడానికి తాను సిద్ధంగా ఉన్నానని పేర్కొన్నారు. అలాగే ఆమె తనపై పెట్టిన కేసును ఉపసంహరించుకుంటారని ఆశిస్తున్నట్లు తెలిపారు.మరోవైపు, ఈ వివాదంపై గతంలో మాట్లాడిన హనీ రోజ్... తన లుక్స్‌పై వచ్చే సరదా జోకులను, మీమ్స్‌ను తాను కూడా స్పోర్టివ్‌గా తీసుకుంటానని, కానీ ప్రతి దానికి ఒక హద్దు ఉంటుందని స్పష్టం చేశారు. అసభ్యకరమైన, గౌరవానికి భంగం కలిగించే వ్యాఖ్యలను ఏమాత్రం సహించేది లేదని ఆమె తేల్చి చెప్పారు. వ్యాపారవేత్త చెమ్మనూర్ చేసిన ఈ బహిరంగ క్షమాపణలపై హనీ రోజ్ ఇంకా స్పందించాల్సి ఉంది.

# 'రంభ ఊర్వశి మేనక'..

## మళ్లీ కామెడీ బాటపట్టిన అల్లరి నరేశ్




గత కొంతకాలంగా 'నాంది', 'ఉగ్రం' వంటి సీరియస్, ఇంటెన్స్ పాత్రలతో ప్రేక్షకులను మెప్పించిన ప్రముఖ నటుడు అల్లరి నరేశ్, మళ్లీ తన ట్రేడ్ మార్క్ కామెడీతో అలరించేందుకు సిద్ధమయ్యారు. అల్లరి నరేశ్ పుట్టినరోజు సందర్భంగా తన 65వ చిత్రానికి సంబంధించిన ఫస్ట్ లుక్ పోస్టర్‌ను చిత్రబృందం విడుదల చేసింది. ఈ సినిమాకు 'రంభ ఊర్వశి మేనక' అనే ఆసక్తికరమైన టైటిల్‌ను ఖరారు చేశారు. ఈ చిత్రాన్ని ఒక సోషియో ఫాంటసీ ఎంటర్‌టైనర్‌గా రూపొందిస్తున్నారు. టైటిల్‌తోనే సినిమాలో కామెడీ, ఫాంటసీ అంశాలు పుష్కలంగా ఉంటాయని స్పష్టమవుతోంది. ప్రఖ్యాత నిర్మాణ సంస్థ అన్నపూర్ణ స్టూడియోస్, హాస్య మూవీస్ పతాకాలపై ఈ సినిమాను సంయుక్తంగా నిర్మిస్తున్నారు. చంద్రమోహన్ చింతాడ ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారు. అల్లరి నరేశ్ కామెడీ చిత్రాలకు పెట్టింది పేరు. అయితే, నటుడిగా తనను తాను కొత్తగా ఆవిష్కరించుకునే క్రమంలో ఇటీవల సీరియస్ కథలను ఎంచుకున్నారు. ఇప్పుడు మళ్లీ తన కామెడీ జానర్‌లోకి వస్తుండటంతో అభిమానులు, సినీ ప్రేక్షకులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. విడుదలైన ఫస్ట్ లుక్ పోస్టర్ సినిమాపై అంచనాలను పెంచుతోంది. ఈ సినిమాకు చైతన్ భరద్వాజ్ సంగీతం అందిస్తున్నారు. అన్ని కార్యక్రమాలను పూర్తి చేసి, 2026 సెప్టెంబర్ 4న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో ఈ చిత్రాన్ని విడుదల చేయనున్నట్లు నిర్మాతలు అధికారికంగా ప్రకటించారు.

# ఓటీటీలోకి లీగల్ సస్పెన్స్ థ్రిల్లర్!



థ్రిల్లర్ జోనర్ కి సంబంధించిన కంటెంట్ కి ఓటీటీ ఫ్లాట్ ఫామ్స్ పై ఉన్న క్రేజ్ గురించి అందరికీ తెలిసిందే. ఆ థ్రిల్లర్ కి సస్పెన్స్ తోడైతే .. ఆ సస్పెన్స్ ఒక క్రైమ్ తో ముడిపడి ఉంటే .. ఇవన్నీ కలిసి కోర్టు చుట్టూ తిరుగుతూ ఉంటే రేకెత్తే ఆసక్తి గురించి ప్రత్యేకంగా చెప్పవలసిన పనిలేదు. అలాంటి ఒక లీగల్ థ్రిల్లర్ ఓటీటీ ప్రేక్షకుల ముందుకు రావడం కోసం ఆత్రుత పడుతోంది. ఆ థ్రిల్లర్ సినిమా పేరే 'ఇక్కా'. సన్నీడియోల్ .. అక్షయ్ ఖన్నా ప్రధానమైన ప్రధానమైన పోషించిన సినిమా ఇది. సిద్ధార్థ్ మల్హోత్రా రూపొందించిన ఈ సినిమా, కోర్టు రూమ్ డ్రామాగా నడుస్తుంది. ప్రముఖ లాయర్ అర్జున్ మెహ్రా పాత్రలో సన్నీ డియోల్ .. హత్యాయత్నం కేసులో నిందితుడైన శౌర్యమన్ పాత్రలో అక్షయ్ ఖన్నా కనిపించనున్నారు. ఇతర ముఖ్యమైన పాత్రలలో దియా మీర్జా .. తిలోత్తమ .. శిశిర్ శర్మ .. ఆకాంక్ష అలరించనున్నారు. జులై 10వ తేదీ నుంచి ఈ సినిమాను 'నెట్ ఫ్లిక్స్'లో స్ట్రీమింగ్ చేయనున్నారు. అందుకు సంబంధించిన ట్రైలర్ ను కూడా వదిలారు. నగరంలో అర్జున్ మెహ్రాకి లాయర్ గా మంచి పేరు ఉంటుంది. ఆయన ఒక కేసును టేకప్ చేశాడంటే, ఆ కేసు ఓడిపోవడమనేది జరగదనే నమ్మకం అందరిలో ఉంటుంది. అందువలన ఆయనకి ఎదురుగా నిలబడి వాదన చేయడానికి మిగతా లాయర్లు భయపడుతుంటారు. అలాంటి అర్జున్ ను శౌర్యమన్ ఆశ్రయిస్తాడు. తనని ఒక కేసు నుంచి కాపాడమని కోరతాడు. అతను చేసిందేమిటి? ఆ కేసు విషయంలో అర్జున్ కి ఎదురైనా సవాళ్లు ఏమిటి? అనేది మిగతా కథ. ఈ సినిమా ఓటీటీ ఆడియన్స్ ను ఏ స్థాయిలో మెప్పిస్తుందనేది చూడాలి మరి.

# అమెజాన్ ప్రైమ్‌లో సెల్వ రాఘవన్ మూవీ!



సెల్వ రాఘవన్ మంచి దర్శకుడు .. మంచి నటుడు కూడా. మొదటి నుంచి కూడా సెల్వ రాఘవన్ విభిన్నమైన కథలకు .. విలక్షణమైన పాత్రలకు ఎక్కువ ప్రాధాన్యతనిస్తూ వస్తున్నాడు. అందువలన ఆయన పోషించిన పాత్రలు చాలా కాలం పాటు గుర్తుండిపోతుంటాయి. ఆయన ఒక సినిమా చేశాడు అంటే, అందులో కొత్త పాయింట్ ఉండి ఉంటుందనే ఒక బలమైన నమ్మకం ఆడియన్స్ లో ఉంటుంది. అలా ఆయన ప్రధానమైన పాత్రను పోషించిన సినిమానే 'మనితం దైవమగళం'. తమిళనాడులోని ఒక గ్రామీణ ప్రాంతం నేపథ్యంలో సాగే ఈ సినిమా, ఏప్రిల్ 10వ తేదీన థియేటర్లకు వచ్చింది. విజయ్ సతీశ్ నిర్మించిన ఈ సినిమాకి, డెన్నిస్ మంజునాథ్ దర్శకత్వం వహించాడు. అలాంటి ఈ సినిమా ఇప్పుడు 'అమెజాన్ ప్రైమ్'లో అందుబాటులోకి వచ్చింది. ప్రస్తుతం తమిళంలో మాత్రమే స్ట్రీమింగ్ అవుతోంది. త్వరలో తెలుగు ఆడియోతోను ప్రేక్షకులను పలకరించనుంది. గ్రామీణ ప్రాంతం .. అక్కడ ప్రజల జీవన విధానం .. స్థానికంగా నడిచే వ్యాపారాలు .. రాజకీయాలు .. పగలు .. ప్రతీకారాలు వంటి అంశాలు ఈ కథలో కనిపిస్తాయి.

# 'దూరదర్శని' మూవీ రివ్యూ!




ప్రేమకథలకు యూత్ లో మంచి క్రేజ్ ఉంటుంది. ఇక విలేజ్ నేపథ్యంలోని ప్రేమకథలకు మరింత ఆదరణ లభిస్తూ ఉంటుంది. అలాంటి ఒక ప్రేమకథగా 'దూరదర్శని' కనిపిస్తుంది. సువిక్షిత్ – గీతికా రతన్ జతగా నటించిన సినిమా ఇది. పబ్లిసిటీ పరంగా పెద్ద హడావిడి చేయకుండానే థియేటర్లకు వచ్చింది. అందువలన థియేటర్లలో నిలబడలేకపోయింది. మే 15వ తేదీన థియేటర్లకు వచ్చిన ఈ సినిమా, జూన్ 26వ తేదీ నుంచి 'అమెజాన్ ప్రైమ్'లో స్ట్రీమింగ్ అవుతోంది. అది ఒక అందమైన పల్లెటూరు .. దాని పేరు 'మట్టుపర్రు'. అక్కడ హరి (సువిక్షిత్) తన తల్లిదండ్రులతో కలిసి నివసిస్తూ ఉంటాడు. ఇంటర్ చదివిన హరి, పై చదువులకు పట్నం వెళ్లాలనే ఆశను చంపుకుంటాడు. ఎందుకంటే ఉన్నకొద్ది పొలాన్ని అమ్మేయడం అతనికి ఇష్టం ఉండదు. అందువలన ఊళ్లోని స్నేహితులతో కలిసి తిరుగుతూ ఉంటాడు. హరి తండ్రి రాజయ్య ఉన్న కొద్దిపాటి పొలాన్ని సేద్యం చేసుకుంటూ, పరశురామ్ దగ్గర పనిచేస్తుంటాడు. పరశురామ్ శ్రీమంతుడు .. ఒక రకంగా చెప్పాలంటే ఆ ఊరు మోతుబరి. అతనంటే ఆ ఊళ్లో అందరికి భయమే. అందువల్లనే ఆయన చెల్లెలు వాణి (గీతికా రతన్) వైపు చూసే సాహసం ఎవరూ చేయరు. పట్నంలో చదువుకుంటున్న ఆమె, పరీక్షల తరువాత ఆ ఊరుకు వస్తుంది. అయితే తొలి చూపులోనే వాణిని చూసి హరి మనసు పారేసుకుంటాడు. 'పేకబాబు' ఇంట్లో 'చిత్రలహరి' చూడటానికి వచ్చిన హరి – వాణి ఇద్దరూ ప్రేమలో పడతారు. తన ఇంటికి 'చిత్రలహరి' చూడటానికి వస్తున్న వాణిని పేకబాబు కూడా ఇష్టపడతాడు. అయితే ఆమె హరితో సన్నిహిత్యంగా ఉండటాన్ని తట్టుకోలేకపోతుంటాడు. కులమతాలపైనే పరువు ప్రతిష్ఠలు ఆధారపడి ఉంటాయని బలంగా నమ్మే ఆ ఊళ్లో, తమ ప్రేమ గెలవలేదనే విషయం ఆ జంటకు అర్థమైపోతుంది. అప్పుడు వాళ్లు ఏం చేస్తారు? ఆ తరువాత చోటుచేసుకునే సన్నివేశాలు ఎలాంటివి? అనేది మిగతా కథ. ప్రేమకి కులమతాలు .. ఆర్థికపరమైన స్థితిగతులు ఎప్పటికీ అడ్డుగోడలేనని చెప్పాలి. గ్రామీణ ప్రాంతాలలో ఉన్న కట్టుబాట్ల కారణంగా, ఈ అంతరాలు మరింత బలంగా కనిపిస్తూ ఉంటాయి. విలేజ్ నేపథ్యంలో ఒక పేదింటి అబ్బాయి .. కలవారి అమ్మాయికి మధ్య నడిచే ప్రేమకథలతో గతంలో చాలానే సినిమాలు వచ్చాయి. అలాంటి కథతో చేసిన మరో ప్రయత్నంగా ఈ సినిమా నిలుస్తుంది. హీరోయిన్ అన్నయ్య ఒక మోతుబరి .. ఒక రకంగా విలన్ షేడ్స్ తో భయపెట్టే రకం. ఇక అదే ఊళ్లో మరో డబ్బున్న యువకుడు .. అతను కూడా విలన్ షేడ్స్ ను కలిగినవాడే. హీరోయిన్ పై మనసు పారేసుకున్న ఈ డబ్బున్న దొరబాబు, ఆల్రెడీ హీరోయిన్ మనసు దోచుకున్న హీరోపై ద్వేషంతో ఉంటాడు. ఈ నాలుగు పాత్రల చుట్టూనే ఈ కథ తిరుగుతూ ఉంటుంది. ఇక హీరోయిన్ ను హీరో కలుసుకునేలా చేయడంలోనే తమ జీవితం ధన్యమైందని భావించే మిత్ర బృందం ఇందులోనూ కనిపిస్తుంది. కాకపోతే ఆ టీమ్ చేసే కామెడీ కాసింతైనా పండలేదు. ప్రధానమైన నాలుగు పాత్రలను బలంగా తీర్చిదిద్దడానికి అవకాశం ఉంది. కానీ ఆ దిశగా అంత కసరత్తు జరగలేదనే విషయం అర్థమైపోతూనే ఉంటుంది. పాత్రలను సరిగ్గా డిజైన్ చేయకపోవడం వలన, సన్నివేశాలపై సరైన శ్రద్ధ పెట్టకపోవడం వలన .. ఆశించినస్థాయి అవుట్ పుట్ లేకుండా తేలిపోతుంటాయి. రొటీన్ గా అనిపిస్తూ నిరాశపరుస్తూ ఉంటాయి. 1980లలో బాగా డబ్బున్న ఇళ్లలోనే టీవీలు ఉండేవి. అందువలన చుట్టుపక్కల వాళ్లు వెళ్లి అక్కడ కూర్చునేవారు. అలా పేదింటివాడైన హీరో వెళ్లి వేరే ఇంట్లో టీవీ చూశాడంటే అర్థం ఉంది. కానీ మోతుబరి అయిన పరశురామ్ ఇంట్లో టీవీ లేకపోవడం .. అతని చెల్లెలు కూడా వేరే ఇంటికి వెళ్లి టీవీ చూడటం చిత్రంగా అనిపిస్తుంది. కొత్తగా పెళ్లయిన భద్రం పాత్ర ద్వారా కామెడీని పండించడానికి చేసిన ప్రయత్నం .. కులమతాల అంతరాల కారణంగా శారద బలైపోవడం వంటి ఎమోషనల్ సీన్స్ కూడా పేలవంగా అనిపిస్తాయి.ప్రేమికులు ఒక నిర్ణయం తీసుకునేప్పుడు తమని కన్న వాళ్లను గురించి ఒకసారి ఆలోచన చేయండి అనే సందేశం ఇవ్వడానికి చేసిన ప్రయత్నం బాగుంది. కానీ ఆ సందేశం చుట్టూ ఒక ఆసక్తికరమైన కథను అల్లుకోలేకపోయారు. మురళీ మోహన్ రెడ్డి ఫోటోగ్రఫీ .. ఆనంద్ సంగీతం ఫరవాలేదు. అక్కడక్కడా పాటల్లో సాహిత్యం బాగుందనిపిస్తుంది. ' ఇంద్రధనస్సు కట్టినావే కంటి గడపకి .. వరదలేవో తెచ్చినావే గుండె పడవకి' వంటి లైన్స్ మనసుకు పట్టుకుంటాయి. కథాకథనాలు బలహీనమైనవే అయినా, విలేజ్ నేపథ్యంలో దృశ్యాలు మనసుకు హాయిగా అనిపిస్తాయి. పంటపొలాలు .. కొబ్బరి తోటలు .. ఇటుక బట్టీలు .. కాలి బాటలు .. గోదారి ఒడ్డు .. ఈ కథకు అందమైన ఆభరణంలా అనిపిస్తాయని చెప్పాలి. విలేజ్ నేపథ్యంలో లొకేషన్స్ కోసం ఈ సినిమా చూడొచ్చు.

## మేడ్చల్ ప్రభుత్వ పాలిటెక్నిక్‌లో స్పాట్ అడ్మిషన్లు ప్రారంభం

# విద్యార్థులకు సువర్ణావకాశం




మేడ్చల్ (ప్రశ్న న్యూస్ ) ఉన్నత సాంకేతిక విద్యను అభ్యసించాలనుకునే విద్యార్థులకు మేడ్చల్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల శుభవార్త తెలిపింది. కళాశాలలో మిగిలిన డిప్లొమా సీట్ల భర్తీ కోసం స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ జి. అరుంధతి తెలిపారు.జూలై 1 నుండి జూలై 3వ తేదీ సాయంత్రం 4:00 గంటల వరకు అర్హత కలిగిన అభ్యర్థులు కళాశాలకు వచ్చి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

అనంతరం జూలై 4వ తేదీ ఉదయం 9:30 గంటలకు ఒరిజినల్ ట్రాన్స్ఫర్ సర్టిఫికేట్ (టీసీ)తో పాటు అవసరమైన విద్యా ధ్రువపత్రాలతో హాజరై అడ్మిషన్ ప్రక్రియను పూర్తి చేయాలని తెలిపారు.ఈ అవకాశాన్ని వినియోగించుకుని ప్రభుత్వ పాలిటెక్నిక్‌లో నాణ్యమైన సాంకేతిక విద్యను అభ్యసించాలని విద్యార్థులు, తల్లిదండ్రులకు ప్రిన్సిపాల్ విజ్ఞప్తి చేశారు.

**మరిన్ని వివరాల కోసం సంప్రదించవలసిన ఫోన్ నంబర్లు:**
8096951516 ,9347615836, 9490070704

# సుదీర్ఘ సేవలకు ముగింపు..

## హిందీ పండిత్ తీగల సత్యనారాయణకు ఘన వీడ్కోలు



వేములవాడ (ప్రశ్న న్యూస్) రాజన్న సిరిసిల్ల జిల్లా, వేములవాడ మున్సిపల్ పరిధిలోని శాత్రాజ్‌పల్లి లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో హిందీ పండిట్ గా సుదీర్ఘంగా సేవలందించిన తీగల సత్యనారాయణ ఉద్యోగ విరమణ సందర్భంగా మంగళవారం ఘన వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ ఆయన క్రమశిక్షణ, అంకితభావంతో పనిచేసి ఎందరో విద్యార్థుల భవిష్యత్తుకు మార్గదర్శకుడిగా నిలిచారని కొనియాడారు. అనంతరం శాలువాతో సత్కరించి, పుష్పగుచ్ఛం, జ్ఞాపిక అందజేసి ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్, కౌన్సిలర్లు ఏనుగు జ్యోతి, ఎలా శ్రీనివాస్, మైలారం శ్రీనివాస్, బాల్యమిత్రులు ఎల్లాల ఆనంద రెడ్డి, తాహేర్ పాషా, మోటూరీ మల్లేశం, దుర్గం పరశురాం, కొలిపాక శ్రీనివాస్, లాయక్ పాషా, సహచర ఉపాధ్యాయులు, విద్యార్థులు, పూర్వ విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొని శుభాకాంక్షలు తెలిపారు.

# ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్‌కు భద్రత పెంచాలని నల్ల బ్యాడ్జీలతో నిరసన

**- తెలంగాణ చౌక్‌లో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ కాంట్రాక్ట్ అసోసియేషన్ ఆందోళన**



కరీంనగర్ (ప్రశ్న న్యూస్)ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్‌కు భద్రత పెంచాలని డిమాండ్ చేస్తూ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ కాంట్రాక్ట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం కరీంనగర్ తెలంగాణ చౌక్‌లో నల్ల బ్యాడ్జీలు ధరించి, ప్లకార్డులతో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఉమ్మడి కరీంనగర్ జిల్లా ఇన్‌చార్జి కొంకటి శేఖర్ మాట్లాడుతూ, రాజకీయ కక్ష సాధింపులో భాగంగానే ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ భద్రతను తగ్గించే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆరోపించారు.దేశ సేవలో 26 సంవత్సరాలు పనిచేసిన అనంతరం గురుకులాల కార్యదర్శిగా పేద విద్యార్థులను ఉన్నత స్థాయికి తీసుకెళ్లిన వ్యక్తి ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ అని కొనియాడారు. అలాంటి నాయకుడికి తగిన భద్రత కల్పించాలని, ప్రభుత్వం వెంటనే ఈ నిర్ణయాన్ని పునఃపరిశీలించాలని డిమాండ్ చేశారు.ఈ నిరసన కార్యక్రమంలో కరీంనగర్ జిల్లా ఇన్‌చార్జి మేకల రవీందర్, దుస్స కుమారస్వామి, పెద్దపల్లి జిల్లా ఇన్‌చార్జి మొలుమ్మూరి చంద్రశేఖర్, జగిత్యాల జిల్లా ఇన్‌చార్జి మైస శ్రీధర్, అడ్వకేట్ బొంకూరి మోహన్, నిరంజన్, మహిళా నాయకురాలు నలువాల జమున, వంశీ, అక్షయ్, అసంపల్లి రాకేష్, కల్లేపల్లి తిరుపతి, మహమ్మద్ షమీ, రిషి తదితరులు పాల్గొన్నారు.

## గ్రామ అభివృద్ధికి విద్యుత్ శాఖ సహకారం అభినందనీయం

**- జాగిర్యాల్ సర్పంచ్ : గడల ప్రసాద్**



భీంగల్ (ప్రశ్న న్యూస్) నిజామాబాద్ జిల్లా,జగిర్యాల్ గ్రామంలో విద్యుత్ అంతరాయాలు, లైన్ సమస్యలు తలెత్తకుండా ఉండేందుకు పాత విద్యుత్ స్తంభాల స్థానంలో 16 కొత్త విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేశారు. గ్రామంలో ఎక్కడైతే పాత పోల్స్ కారణంగా విద్యుత్ సమస్యలు ఎదురవుతున్నాయో అక్కడ వాటిని మార్చాలని సర్పంచ్ గడల ప్రసాద్ విద్యుత్ శాఖ ఏఈ, డీఈలకు విజ్ఞప్తి చేయగా, అధికారులు వెంటనే స్పందించి 16 పోల్స్‌ను మంజూరు చేశారు.విద్యుత్ శాఖ అధికారులు, లైన్‌మన్ సహకారంతో గ్రామంలోని సమస్యాత్మక ప్రాంతాల్లో కొత్త విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేశారు. గ్రామ అభివృద్ధికి సహకరించిన విద్యుత్ శాఖ ఏడీఈ, ఏఈ, లైన్‌మన్‌లకు సర్పంచ్ గడల ప్రసాద్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ పనులతో గ్రామంలో విద్యుత్ సరఫరా మరింత మెరుగుపడుతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

# వైద్యశాఖ లో పనిచేయడం గొప్ప వరం

## డాక్టర్ ఏ. రాజేషం, రాష్ట్ర క్షయ విభాగం జాయింట్ డైరెక్టర్

అమీర్ పేట్ (ప్రశ్నన్యూస్) వైద్యశాఖలో పని చేయడం ఒక గొప్ప వరమని రాష్ట్ర క్షయ విభాగం జాయింట్ డైరెక్టర్ డాక్టర్ ఏ. రాజేశం అన్నారు. రాష్ట్ర క్షయ శిక్షణ కేంద్రంలో మంగళవారం నాడు నిర్వహించిన ఒక ప్రత్యేక కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతు ఉద్యోగులు తమ విధి నిర్వహణలో సేవాభావంతో పని చేయాలని సూచించారు. నేడు పదవి విరమణ చేస్తున్న మహబుబ్ అలీని అభినందిస్తు ఉద్యోగ బాధ్యతల నిర్వాహణలో అయన చూపిన నిబద్ధత, అంకితభావాన్ని తోటి ఉద్యోగులు స్ఫూర్తిగా తీసుకోవాలని సూచించారు. ఇటీవల రాష్ట్ర క్షయ శిక్షణ కేంద్రం డైరెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన డాక్టర్. రాజేశ్వరీ మాట్లాడుతు పదవి విరమణ చేస్తున్న మహబుబ్ అలీని అభినందిస్తు, విధినిర్వహణలో ఆయన చూపిన అంకుటితదీక్షను కొనియాడారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఉద్యోగులు, విధి నిర్వహణలో మహబుబ్ అలీ చూపిన అంకితభావాన్ని ప్రశంసించారు. అనంతరం డాక్టర్ ఏ. రాజేషం, జాయింట్ డైరెక్టర్ (టిబి), రాష్ట్ర క్షయ శిక్షణ కేంద్రం డైరెక్టర్ డాక్టర్ రాజేశ్వరీ, చేతుల మీదుగా శాలువా, పూల మాలలతో ఘనంగా సన్మానించారు. ఇక ఇటీవల జరిగిన ఉద్యోగుల సాధారణ బదిలీల్లో రాష్ట్ర క్షయ శిక్షణ కేంద్రం నుండి బదిలీపై వెళ్లిన వారి సేవలను గుర్తించి శాలువాతో ఘనంగా సన్మానించి వీడ్కోలు పలికారు. అలాగే రాష్ట్ర క్షయ శిక్షణ కేంద్రానికి బదిలీపై వచ్చిన వారికి డైరెక్టర్ డాక్టర్ రాజేశ్వరీ పుష్పగుచ్ఛం అందజేసి ఆత్మీయ స్వాగతం పలికారు. ఈ









కార్యక్రమంలో వైద్యాధికారులు డాక్టర్ నవీన్ కుమార్, డాక్టర్ దీప్తి, రామలక్ష్మి, శ్రీనివాస్, ప్రవీణ్ కుమార్, రవికుమార్ సంతోజు, లక్ష్మినారాయణ, ఫారుక్, ఉమ, పద్మ, నాగరాజు, సుధాకర్ శ్రవంతి, ఎస్తేర్ రాణి, జుబేధా బేగం, నసీర్, యాసిన్, ఖాదర్, ఆలీం, విశ్రాంత ఉద్యోగులు. శాంత్‌కుమార్, మజీద్, సలామ్,అల్లావుద్దీన్, ఆజం తో పాటు అధిక సంఖ్యలో సిబ్బంది పాల్గొన్నారు.

# విధి నిర్వహణలోఉద్యోగులు సేవాభావంతో పనిచేయాలి

## నాచారం ఈఎస్ఐ ఆస్పత్రిలో బదిలీ పై వెళ్ళిన వారికి ఘనంగా వీడ్కోలు - కొత్తగా వచ్చిన వారికి ఆత్మీయ స్వాగతం

నాచారం ( ప్రశ్న న్యూస్) ఉద్యోగులు తమ విధి నిర్వహణలో సేవాభావంతో పనిచేస్తు ఉన్నత స్థాయికి ఎదిగాలని తెలంగాణ మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షులు కామ్రేడ్ యం ఎస్ మూర్తి పిలుపునిచ్చారు. ఈఎస్ఐ నాచారం ఆసుపత్రిలో తెలంగాణ మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలోనిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో ఇటీవల జరిగిన ఉద్యోగుల సాధారణ బదిల్లో ఈఎస్ఐ ఆసుపత్రి నుండి ఇతర ఆసుపత్రులకు వెళ్లిన ఉద్యోగులకు ఘనంగా వీడ్కోలు పలుకుతు ఇతర ఆస్పత్రుల నుండి బదిలీపై నాచారం ఈఎస్ఐ ఆసుపత్రి వచ్చిన ఉద్యోగులకు ఆత్మీయ స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న యం ఎస్ మూర్తి మాట్లాడుతు ఉద్యోగుల ఐక్యతే సంఘానికి గొప్ప బలమని, ఉద్యోగుల హక్కులు, సంక్షేమం పరిరక్షణకు సంఘం ఎల్లవేళలా కృషి చేస్తు అండగా నిలుస్తుందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఈఎస్ఐ నాచారం ఆసుపత్రిలో సుమారు 20 నుండి 25 సంవత్సరాల పాటు సేవలందించిన 36 మంది ఉద్యోగుల విశిష్ట






సేవలను గుర్తిస్తు శాలువా మెమోంటోలతో ఘనంగా సన్మానించి మెమోంటోల వీడ్కోలు పలికారు. అలాగే బదిలీపై వచ్చిన 16 మంది ఉద్యోగులకు శాలువాలు కప్పి ఆత్మీయ స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో ఎస్. ప్రేమలత, బి. ప్రేమలత, జి. విక్టోరియా, వి. వేణు కుమార్, భగ్య, చంద్రకళ, రాణి, రఘు, సంతోష్, సత్యనారాయణ, కుమార్, శ్రీలత, అంజని, సుజాత, వినీలతో పాటు సంఘం నాయకులు, సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నగా ఎంతో ఆప్యాయత, స్నేహభావం, ఉద్యోగుల ఐక్యతకు ప్రతీకగా ఈకార్యక్రమం విజయవంతంగా ముగిసింది.

# వార్డు సభ్యుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలి

**- అందే బీరన్న, అతికం రాజశేఖర్ గౌడ్**



గ్రేటర్ హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) తెలంగాణ రాష్ట్రంలోని వార్డు సభ్యుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని వార్డు సభ్యుల సంక్షేమ సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు అందే బీరన్న, రాష్ట్ర అధ్యక్షుడు అతికం రాజశేఖర్ గౌడ్ డిమాండ్ చేశారు. హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి ముఖ్య నాయకుల సమావేశం అనంతరం విలేకరులతో వారు మాట్లాడారు.వార్డు సభ్యులకు నెలకు రూ.3,000 గౌరవ వేతనం, రూ.25 లక్షల ఆరోగ్య బీమా, విధుల్లో ఉండగా మరణించిన వార్డు సభ్యుల కుటుంబాలకు రూ.20 లక్షల నష్టపరిహారం అందించాలని ప్రభుత్వాన్ని కోరారు. గ్రామాల అభివృద్ధిలో వార్డు సభ్యుల సేవలను గుర్తించి వారికి తగిన గుర్తింపు, సంక్షేమం కల్పించాలని విజ్ఞప్తి చేశారు.ఈ సమావేశంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు చిలుముల నవీన్ కుమార్, రాష్ట్ర కార్యదర్శి సందగిరి వెంకటేష్, ధూపం ఆంజనేయులు, రాష్ట్ర అధికార ప్రతినిధి నాగుల సాంబయ్య గౌడ్, కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు మూల కరుణాకర్ గౌడ్, రాష్ట్ర నాయకులు గంగధర గంగజమున వెంకటరమణ, కామెర తిరుమల తదితరులు పాల్గొన్నారు.

# మృతుని కుటుంబానికి టీఆర్ఎస్ నాయకుల పరామర్శ - ప్రగాఢ సంతాపం

**- గల్ఫ్ బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలి**

**- తెలంగాణ రక్షణ సేన జిల్లా ఇంచార్జి : మజీద్**



ఎల్లారెడ్డిపేట (ప్రశ్న న్యూస్)రాజన్న సిరిసిల్ల జిల్లా, ఎల్లారెడ్డిపేట మండలం, నారాయణపూర్ గ్రామానికి చెందిన గల్ఫ్ కార్మికుడు బత్తుల నర్సయ్య (42) మస్కట్‌లో విధి నిర్వహణలో ఉండగా జూన్ 6న మృతి చెందిన విషయం తెలిసిందే. 23 రోజుల అనంతరం మృతదేహం స్వగ్రామానికి చేరుకోగా, కుటుంబ సభ్యులు అంత్యక్రియలు నిర్వహించారు.మంగళవారం టీఆర్ఎస్ నాయకులు, తెలంగాణ రక్షణ సేన జిల్లా ఇంచార్జి మజీద్ ఆధ్వర్యంలో మృతుడి కుటుంబాన్ని పరామర్శించి ప్రగాఢ సంతాప సానుభూతి తెలిపారు. ఈ సందర్భంగా మజీద్ మాట్లాడుతూ, నిరుపేద కుటుంబానికి చెందిన నర్సయ్య ఎన్నో సంవత్సరాలుగా గల్ఫ్‌లో పనిచేస్తూ కుటుంబాన్ని పోషించేవాడని తెలిపారు. ఇటీవల అప్పులు చేసి కుమారుడి వివాహం జరిపించడంతో పాటు సొంత ఇల్లు నిర్మించుకున్నాడని, సుమారు రూ.12 లక్షల అప్పుల భారంతో తీవ్ర మానసిక ఒత్తిడికి గురై గుండెపోటుతో మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారని అన్నారు.మృతుడి కుటుంబానికి రాష్ట్ర ప్రభుత్వం ఆర్థిక సహాయం అందించి అన్ని విధాలుగా ఆదుకోవాలని ఆయన కోరారు.మృతుడు నర్సయ్యకు భార్య రేణుక, కుమారుడు రాకేష్ ఉన్నారు.ఈ పరామర్శ కార్యక్రమంలో తెలంగాణ రక్షణ సేన మండల నాయకులు కదిరి భాస్కర్ గౌడ్, మార్వాడి దేవరాజు, సయ్యద్ జావిద్, వంతెడుపుల బాబు, బైరి రాజేష్, బోదాసు ఎల్లయ్య, సిద్దు తదితరులు పాల్గొని కుటుంబ సభ్యులకు మనోధైర్యం కల్పించారు.

## బొప్పాపూర్ పాఠశాల అభివృద్ధికి

# సీఎం దృష్టికి తీసుకెళ్తా

**- చొప్పదండి ఎమ్మెల్యే : డాక్టర్ మేడిపల్లి సత్యం**

**- పూర్వ విద్యార్థిగా స్కూల్ అభివృద్ధికి అండగా ఎమ్మెల్యే సత్యం**

**- పాఠశాల అభివృద్ధికి రూ. 1లక్ష విరాళం అందజేత**



ఎల్లారెడ్డిపేట (ప్రశ్న న్యూస్) విద్యా రంగం అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ తెలిపారు. ఎల్లారెడ్డిపేట మండలం, రాచర్ల బొప్పాపూర్ పీఎంశ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నూతన తరగతి గదులను కలెక్టర్‌తో కలిసి చొప్పదండి




ఎమ్మెల్యే,కాంగ్రెస్ పార్టీ కరీంనగర్ జిల్లాధ్యక్షులు డాక్టర్ మేడిపల్లి సత్యం మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా జాతీయ స్థాయి క్రీడల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులను ప్రశంసా పత్రాలతో సత్కరించగా, ఉద్యోగ విరమణ పొందుతున్న జిల్లా విద్యాధికారి జగన్ మోహన్ రెడ్డి, ఉపాధ్యాయుడిని ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య, మెరుగైన వసతులు కల్పిస్తున్నామని, విద్యార్థులు లక్ష్యంతో ముందుకు సాగాలని సూచించారు. అనంతరం ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం మాట్లాడుతూ పాఠశాల అభివృద్ధికి పూర్తి సహకారం అందిస్తామని, రూ.1 లక్ష విరాళాన్ని ప్రకటించారు. అలాగే పాఠశాల అభివృద్ధి అంశాన్ని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాధికారి జగన్ మోహన్ రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ సబేరా బేగం, స్థానిక అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## జిహెచ్ఎంసి ఎన్నికలలో గెలవలంటే

# బీఆర్ఎస్ పార్టీ ప్రక్షాళన తప్పనిసరి.?

### పాత ముఖాలకు వీడ్కోలు పలకాల్సిందే.?

- కొత్త నాయకత్వానికి అవకాశం ఇస్తేనే ప్రజల్లో నమ్మకం పెరుగుతుందా.?
- గత అసెంబ్లీ ఎన్నికలలో పాత అభ్యర్థులను ప్రకటించి చేసిన తప్పులు ఇప్పుడు చేయొద్దు
- గ్రేటర్ హైదరాబాద్ వాసులు కొత్త నాయకత్వం కోరుతున్నారని గ్రహించాలి
- కేటీఆర్ కు సవాల్ గా మారిన మూడు కార్పొరేషన్లలో గులాబీ జెండా ఎగరవేత
- గ్రేటర్ హైదరాబాద్ ఎన్నికల్లో గులాబీ జెండా ఎగిరితే.. నెక్స్ట్ సీఎం కేటీఆర్

**(ఆర్ కె - ప్రశ్న న్యూస్ బ్యూరో)**

రాబోయే గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ ఎన్నికలు తెలంగాణ రాజకీయాల్లో అత్యంత కీలకంగా మారనున్నాయి. అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీని ఎదుర్కొని తిరిగి గ్రేటర్‌లో ఆధిపత్యాన్ని సాధించాలంటే బీఆర్ఎస్ పార్టీ తన రాజకీయ వ్యూహాలను పూర్తిగా మార్చుకోవాల్సిన అవసరం ఉందని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. గతంలో కార్పొరేటర్లుగా పనిచేసిన చాలామంది నాయకులపై ప్రజల్లో తీవ్ర అసంతృప్తి ఉందనే అభిప్రాయాలు వినిపిస్తున్నాయి. అభివృద్ధి పనుల్లో నిర్లక్ష్యం, ప్రజలకు అందుబాటులో లేకపోవడం, రెండుసార్లు గెలిచిన వాళ్లు మరి ప్రజల సమస్యలను పట్టించుకున్న పాపాన పోలేదన్న విమర్శలు ఉన్నాయి. దానితో స్థానిక సమస్యల పరిష్కారంలో పూర్తిగా విఫలమయ్యారనే విమర్శలు అనేక డివిజన్లలో ఉన్న మాజీ కార్పొరేటర్ల పై వ్యక్తమవుతున్నాయి. అలాంటి పరిస్థితుల్లో అదే కార్పొరేటర్లకు మరోసారి అవకాశం ఇస్తే ఎన్నికల్లో ప్రతికూల ప్రభావం పడే అవకాశం ఉందని రాజకీయ వర్గాలు చర్చిస్తున్నాయి.

### కొత్త ముఖాలే విజయానికి ఆయుధమా.?

గత అసెంబ్లీ ఎన్నికలలో ప్రజలలో వ్యతిరేకత ఉన్న ఎమ్మెల్యేలకు టికెట్లు కేటాయించి బీఆర్ఎస్ పార్టీ చేసిన ఘోర తప్పిదాలను తిరిగి మున్సిపల్ ఎన్నికలలో చేస్తే పరాజయం తప్పదనిపార్టీపై నమ్మకం ఉన్న యువ నాయకులు, ప్రజల్లో సేవాభావంతో పనిచేసిన కొత్త ముఖాలకు టికెట్లు కేటాయిస్తే ప్రజల్లో సానుకూల సంకేతాలు వెళ్లే అవకాశం ఉందని విశ్లేషకులు భావిస్తున్నారు. కేవలం సీనియారిటీ లేదా వర్గ రాజకీయాల ఆధారంగా కాకుండా గెలిచే సామర్థ్యం, ప్రజాదరణ, సేవా దృక్పథాన్ని కలిగిన నాయకులను గుర్తించి ప్రమాణంగా తీసుకుంటే బీఆర్ఎస్ పార్టీకి ప్రయోజనం చేకూరుతుందని సూచిస్తున్నారు.

### అధికార పార్టీ వ్యూహాలను ఎదుర్కోవాలంటే..

అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీకి ప్రభుత్వ యంత్రాంగం, రాజకీయంగా సహకరించే వర్గాల మద్దతు సహజంగానే లభిస్తుందన్న విషయం అందరికీ తెలిసిందే. అలాంటి పరిస్థితుల్లో బీఆర్ఎస్ సంప్రదాయ ఎన్నికల విధానానికి బదులుగా ప్రజా సమస్యల ఆధారంగా కొత్త వ్యూహాలను రూపొందించాల్సిన అవసరం చాలా ఉందని అభిప్రాయపడుతున్నారు. ప్రతి డివిజన్‌కు ప్రత్యేక కార్యాచరణ, బలమైన స్థానిక నాయకత్వం, నిరంతర ప్రజా సంప్రదింపులతో ముందుకు వెళ్లే వారిని ముందుగా గుర్తించి వారికి మరింత సేవా కార్యక్రమాల్లో పాల్గొనడంతో పాటు గెలుపుని దృష్టిలో పెట్టుకొని వెళ్లాలని పార్టీ సూచించాలి. ఇలా చేస్తే అధికారంలో ఉన్న వాళ్ళ పోటీని కట్టుకొని బీఆర్ఎస్ అభ్యర్థులు మరింత బలపడే అవకాశం ఉందని కేటీఆర్ గ్రహించాలి.

### కేటీఆర్ వ్యూహాలపై పార్టీ ఆశలు..

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఎన్నికల వ్యూహాల్లో మార్పులు తీసుకువస్తే పార్టీకి కొత్త ఊపు వచ్చే అవకాశం ఉందని పార్టీ శ్రేణులు భావిస్తున్నాయి. అభ్యర్థుల ఎంపికలో పారదర్శకత, ప్రజాభిప్రాయానికి ప్రాధాన్యం, పనితీరు ఆధారంగా టికెట్ల కేటాయింపు వంటి నిర్ణయాలు తీసుకుంటే గ్రేటర్‌లో పార్టీ పునరుజ్జీవనానికి దోహదపడవచ్చని అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. అయితే పార్టీ అభ్యర్థులను అవలీలగా గెలిపించే సత్తా కేటీఆర్ కు ఉన్న పక్కన ఉండే కొంతమంది నాయకులు కేటీఆర్ ను తప్పుదోవ పట్టించే అవకాశాలు ఉన్నాయి. వాటిని అధిగమించి ముందుకు వెళితేనే సక్సెస్ వరించడం ఖాయం.

### మూడు కార్పొరేషన్లపై గెలుపు గురి పెట్టాలి

గ్రేటర్ పరిధిలోని మూడు కార్పొరేషన్లను కైవసం చేసుకోవడం బీఆర్ఎస్‌కు రాజకీయంగా కీలక విజయంగా నిలుస్తుందని రాజకీయ వర్గాలు విశ్లేషిస్తున్నాయి. అలాంటి ఫలితం వస్తే పార్టీ శ్రేణుల్లో కొత్త ఉత్సాహం నెలకొనడమే కాకుండా, భవిష్యత్ అసెంబ్లీ ఎన్నికలకు బలమైన పునాది ఏర్పడే అవకాశముందని వారు అంచనా వేస్తున్నారు.అయితే ఎన్నికల ఫలితాలు చివరకు




ప్రజల తీర్పుపైనే ఆధారపడి ఉంటాయి. అందువల్ల ప్రజలలో వ్యతిరేకత ఉన్న మాజీ కార్పొరేటర్లను పక్కనపెట్టి, నూతన అభ్యర్థుల ఎంపిక, ప్రజల విశ్వాసాన్ని తిరిగి పొందడం, స్థానిక సమస్యలపై స్పష్టమైన కార్యాచరణతో ముందుకు సాగడం వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కు కీలక పరీక్షగా మారనుంది. అయితే కేటీఆర్ ప్రస్తుతం అవలంబిస్తున్న వ్యూహాలకు మరింత పదును పెట్టి ప్రస్తుతం మారిన రాజకీయ పరిస్థితులకు అనుగుణంగా యువ నాయకులను ఎన్నుకొని గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఉన్న మూడు కార్పొరేషన్లలో గులాబీ జెండా ఎగరాలని ఆశిద్దాం.

## సర్కిల్ నెంబర్ మారినా..

# బోర్డు మాత్రం పాతదే

### అడుగడుగునా అధికారుల నిర్లక్ష్యమే

- మలక్‌పేట్ జిహెచ్ఎంసి అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనమా.?
- బోర్డు మార్చడానికి నిధులు లేవా.? లేక బాధ్యతే లేదా.?




**మలక్ పేట (ప్రశ్న న్యూస్)** ప్రజలకు సరైన సమాచారం అందించడం ప్రభుత్వ కార్యాలయాల అధికారుల కనీస బాధ్యత. అయితే చార్మినార్ జోన్ పరిధిలోని మలక్‌పేట్ జిహెచ్ఎంసి కార్యాలయం వద్ద మాత్రం అధికారుల బాధ్యతారాహిత్యం బహిర్గతమవుతోంది. ప్రస్తుతం పరిపాలనా పునర్వ్యవస్థీకరణలో భాగంగా మలక్‌పేట్ సర్కిల్ నంబర్-27గా మారినప్పటికీ, కార్యాలయం ముందు ఇప్పటికీ "సర్కిల్ 6 మలక్ పేట" అని ఉన్న పాత బోర్డే దర్శనమిస్తోంది. సర్కిల్ నంబర్ మారిన తర్వాత అధికారులు వెంటనే బోర్డులు, రికార్డులు, ఇతర సమాచారాన్ని నవీకరించాల్సిన బాధ్యత ఉన్నప్పటికీ, నెలలు గడుస్తున్నా ఇప్పటికీ పాత బోర్డును అలాగే ఉంచడం అధికారుల బాధ్యతారాహిత్యానికి నిదర్శనంగా కనిపిస్తోందని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. బోర్డు మార్చడానికి ప్రభుత్వానికి నిధులు లేవా.? లేక సర్కిల్ అధికారులకు బాధ్యత లేదా.? అనే ప్రశ్నలు ప్రజల నుంచి జోరుగా వినిపిస్తున్నాయి.ప్రభుత్వ ఉద్యోగులు ప్రజల పన్నుల డబ్బుతో లక్షల రూపాయల జీతాలు తీసుకుంటూ, ప్రజలకు సరైన సేవలు, సమాచారం అందించే కనీస బాధ్యతను కూడా విస్మరించడం తీవ్ర విమర్శలకు తావిస్తోంది. మున్సిపల్ అధికారులు అంటేనే నిర్లక్ష్యానికి, బాధ్యతారాహిత్యానికి పెట్టింది పేరుగా మారింది వ్యవస్థ అన్న ఆరోపణలు తీవ్రంగా ఉన్నాయి. కార్యాలయానికి వచ్చే ప్రజలు, ముఖ్యంగా ఇతర ప్రాంతాల నుంచి వచ్చే వారు పాత సర్కిల్ నంబర్ చూసి గందరగోళానికి గురయ్యే పరిస్థితి నెలకొంది. ప్రభుత్వ కార్యాలయాల వద్ద ప్రదర్శించే సమాచారం బోర్డులు ఎప్పటికప్పుడు తాజా వివరాలతో ఏర్పాటు చేయాల్సిన అవసరం అధికారులకు ఉన్నప్పటికీ, ఈ ప్రాథమిక అంశాన్ని కూడా మున్సిపల్ అధికారులు పట్టించుకోకపోవడం ప్రజల పట్ల నిర్లక్ష్య వైఖరిని స్పష్టంగా అర్థమవుతుందని ప్రజలు మండిపడుతున్నారు. సాధారణ ప్రజలు ప్రభుత్వ నిబంధనలు పాటించకపోతే వెంటనే జరిమానాలు, చట్టపరమైన చర్యలు తీసుకునే అధికారులు, తమ కార్యాలయం ముందు తప్పు సమాచారంతో ఉన్న బోర్డును మాత్రం నెలల తరబడి అలాగే ఉంచడం ఎంతవరకు సమంజసమని ప్రజలు ప్రశ్నిస్తున్నారు.సర్కిల్ నంబర్ మారిన వెంటనే కొత్త బోర్డు ఏర్పాటు చేయాల్సిన బాధ్యత సర్కిల్ అధికారులు, పరిపాలనా విభాగం ఉన్నతాధికారులపై ఉంటుంది. అయినప్పటికీ ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం పరిపాలనా వైఫల్యంగా మారిందన్న విమర్శలు ఉన్నాయి. ఈ నిర్లక్ష్యానికి బాధ్యులైన అధికారులపై ఉన్నతాధికారులు వివరణ కోరడంతో పాటు బాధ్యతను నిర్ధారించి చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. అలాగే పాత బోర్డును వెంటనే తొలగించి సర్కిల్-27 పేరుతో కొత్త బోర్డును ఏర్పాటు చేయాలని, భవిష్యత్తులో ఇలాంటి నిర్లక్ష్యానికి తావు లేకుండా జిహెచ్ఎంసి పరిధిలోని అన్ని కార్యాలయాల్లో బోర్డులు, సమాచారాన్ని సమీక్షించి అవసరమైన మార్పులు కమిషనర్ చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు. ప్రజలకు సేవ చేయాల్సిన ప్రభుత్వ కార్యాలయాలు ముందుగా తమ సమాచారాన్ని సరిచేసుకోవాల్సిన బాధ్యతను గుర్తించి, ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టే విధంగా వ్యవహరించాలని స్థానికులు అభిప్రాయపడుతున్నారు. మరి దీనిపై జోనల్ కమిషనర్లు జిహెచ్ఎంసి కమిషనర్ ఎలా స్పందిస్తారో లేచి చూడాలి.

## రాజాసింగ్‌కు నాంపల్లి ప్రత్యేక కోర్టులో భారీ ఊరట


- కేసును పూర్తిగా కొట్టివేసిన ప్రజాప్రతినిధుల ప్రత్యేక కోర్టు




హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్‌కు నాంపల్లి ప్రజాప్రతినిధుల ప్రత్యేక కోర్టు నుంచి భారీ ఊరట లభించింది. ఆయనపై నమోదైన కేసును కోర్టు పూర్తిగా కొట్టివేస్తూ, రాజాసింగ్‌ను నిర్దోషిగా ప్రకటిస్తూ కోర్టు తుది తీర్పునిచ్చింది. ఇరుపక్షాల వాదనలు విన్న తర్వాత ఆయనపై మోపిన ఆరోపణలకు సరైన సాక్ష్యాధారాలు లేవని కోర్టు స్పష్టం చేసింది. కేసు వివరాల్లోకి వెళితే 2022 ఆగస్టులో హైదరాబాద్‌లో స్టాండప్ కమెడియన్ మునావర్ ఫారూఖీ షో నిర్వహించడాన్ని రాజాసింగ్ తీవ్రంగా వ్యతిరేకించారు. ఈ క్రమంలో ఆయన యూట్యూబ్‌లో విడుదల చేసిన ఒక వీడియో దేశవ్యాప్తంగా తీవ్ర దుమారం రేపింది. రాజాసింగ్ మత విద్వేషాలను రెచ్చగొట్టేలా మాట్లాడారంటూ నగరంలోని పలు పోలీస్ స్టేషన్లలో ఫిర్యాదులు వెల్లువెత్తాయి. దీనిపై స్పందించిన మంగళ్‌హాట్ పోలీసులు ఆయనపై 153ఏ, 295ఏ, 505(2) తదితర సెక్షన్ల కింద కేసులు నమోదు చేశారు.2022 ఆగస్టు 23న పోలీసులు రాజాసింగ్‌ను అరెస్ట్ చేసినప్పటికీ, అరెస్ట్ ప్రక్రియలో సరైన నిబంధనలు (41ఏ సీఆర్‌పీసీ నోటీసు వంటివి) పాటించలేదంటూ స్థానిక కోర్టు రిమాండ్‌ను తిరస్కరించి, ఆయనను వెంటనే విడుదల చేసింది. అయితే, ఆ తర్వాత నగరంలో చోటుచేసుకున్న నిరసనలు, శాంతిభద్రతల సమస్యలను కారణాంగా చూపిస్తూ హైదరాబాద్ పోలీస్ కమిషనర్ ఆదేశాల మేరకు పోలీసులు ఆయనపై పీడీ యాక్ట్ ప్రయోగించారు. దీంతో రాజాసింగ్ దాదాపు 77 రోజుల పాటు జైలులో గడపాల్సి వచ్చింది.

## 40 డిగ్రీల వేడికే కరిగిపోతున్న యూరప్ రోడ్లు

- మన రోడ్లు ఎలా తట్టుకుంటున్నాయి?



న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్) యూరప్‌లోని పలు దేశాల్లో ఇటీవల నమోదవుతున్న 40 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతలకే తారు రోడ్లు కరిగిపోతున్న దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. ఇది చూసిన చాలామందికి, 45 డిగ్రీల వేడిని సైతం తట్టుకునే మన రోడ్లతో పోల్చి, యూరప్ రోడ్ల నాణ్యతపై సందేహాలు వస్తున్నాయి. అయితే, ఇది నిర్మాణ లోపం కాదు, స్థానిక వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా అనుసరించే శాస్త్రీయ ఇంజినీరింగ్ విధానమే దీనికి కారణం. యూరప్ దేశాల్లో శీతాకాలంలో ఉష్ణోగ్రతలు సున్నా డిగ్రీల కంటే తక్కువకు పడిపోతాయి. ఆ సమయంలో రోడ్లు గడ్డకట్టి పగుళ్లు రాకుండా ఉండేందుకు, అక్కడ మృదువుగా ఉండే 'సాఫ్ట్ బిటుమిన్' (తారులో ఒక రకం)ను ఉపయోగిస్తారు. ఇది చలిని బాగా తట్టుకుంటుంది, కానీ దీనికి వేడిని తట్టుకునే సామర్థ్యం తక్కువ. అందుకే, బయటి ఉష్ణోగ్రత 40 డిగ్రీలు దాటినప్పుడు, సూర్యరశ్మికి నేరుగా వేడెక్కే రోడ్డు ఉపరితలం ఉష్ణోగ్రత 50-60 డిగ్రీలకు చేరి, తారు మెత్తబడి కరిగిపోతుంది.ఇందుకు భిన్నంగా, భారతదేశంలో ఏళ్ల తరబడి తీవ్రమైన వేసవి ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. ఇక్కడి పరిస్థితులకు అనుగుణంగా, అధిక ఉష్ణోగ్రతను తట్టుకునే 'హార్డ్ బిటుమిన్' (గట్టి తారు)ను రోడ్ల నిర్మాణంలో వాడతారు. వీజీ-30, వీజీ-40 వంటి గ్రేడ్ల తారును ఉపయోగించడం వల్ల, 45 డిగ్రీల వేడిలో కూడా మన రోడ్లు స్థిరంగా ఉంటాయి. మన రోడ్లు వర్షాలకు, నిర్వహణ లోపం వల్ల పాడవుతాయే తప్ప, సాధారణంగా ఎండలకు కరిగిపోవు. క్లుప్తంగా చెప్పాలంటే, యూరప్ రోడ్లు చలిని, భారత రోడ్లు ఎండను తట్టుకునేలా నిర్మించబడ్డాయి. ఇది నాణ్యతకు సంబంధించిన విషయం కాదు, కేవలం ఆయా ప్రాంతాల వాతావరణానికి అనుగుణంగా తీసుకున్న ఇంజినీరింగ్ నిర్ణయం మాత్రమే. అయితే, వాతావరణ మార్పుల కారణంగా యూరప్‌లో పెరుగుతున్న తీవ్రమైన వేడి, వారి మౌలిక సదుపాయాలకు కొత్త సవాళ్లను విసురుతోందని స్పష్టమవుతోంది.

## తెలంగాణ పారిశ్రామిక చరిత్రలో 2025 జూన్ 30వ తేదీ ఒక చీకటి రోజు: హరీశ్ రావు



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) తెలంగాణ పారిశ్రామిక చరిత్రలో 2025 జూన్ 30వ తేదీ ఒక చీకటి రోజు అని మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత హరీశ్ రావు ఆవేదన వ్యక్తం చేశారు. సంగారెడ్డి జిల్లా పాశమైలారం సిగాచి పరిశ్రమలో కూలి కోసం వలస వచ్చిన 54 మంది పేద కార్మికులు సజీవదహనమైన ఘోర ఘటనకు ఏడాది పూర్తయిన సందర్భంగా ఆయన స్పందిస్తూ ఈ వ్యాఖ్యలు చేశారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వ నియంత్రణ, పర్యవేక్షణ వైఫల్యం, సిగాచి యాజమాన్య నిర్లక్ష్యం కారణంగా అమాయకులు ప్రాణాలు కోల్పోయారని విమర్శించారు. ఘటన జరిగిన రోజున హైదరాబాద్ జూబ్లీహిల్స్ ప్యాలెస్‌లో ఉన్నా 20 కి.మీ దూరంలోని ఘటన స్థలానికి సీఎం రేవంత్ రాకపోవడం, బాధిత కుటుంబాల కన్నీళ్లు తుడవకపోవడం హృదయవిదారకమన్నారు. విమర్శలు రావడంతో మరుసటి రోజు వచ్చారని విమర్శించారు. రేవంత్ రెడ్డి మృతదేహాల సాక్షిగా ప్రతి కుటుంబానికి రూ.1 కోటి ఇస్తానని ప్రకటించినా, ప్రభుత్వం తరపున కేవలం రూ.1 లక్ష మాత్రమే ఇచ్చింది. కార్మికుల పీఎఫ్, ఈఎస్ఐ, లైఫ్ ఇన్సూరెన్స్, వైద్య ఖర్చులను కూడా పరిహారంలో చేర్చి మోసం చేశారని ఆరోపించారు. డెత్ సర్టిఫికెట్ల కోసం నెలల తరబడి ఆఫీసుల చుట్టూ తిప్పడం, ఉద్యోగాలు ఇవ్వకపోవడం, క్షతగాత్రులకు సహాయం చేయకపోవడం దుర్మార్గమన్నారు. ఈ ఘటన సామూహిక హత్య అని, 818 నూకి అనుమతి తీసుకుని 1777 నూ నడపడం, సేఫ్టీ గార్డ్స్, ఫైర్ చీూజ, డస్ట్ కంట్రోల్ వ్యవస్థ లేకపోవడం వంటి నిర్లక్ష్యాలు విచారణలో తేలాయన్నారు. ప్రభుత్వం యాజమాన్యంపై చర్యలు తీసుకోకపోవడం, ఎండీని అరెస్టు చేసి వెంటనే బెయిల్‌పై విడుదల చేయడం లోపాయికారీ ఒప్పందాన్ని సూచిస్తుందని విమర్శించారు. సిగాచి డైరెక్టర్ల ఆస్తులను అటాచ్ చేసి కోటి రూపాయల పరిహారం తక్షణం చెల్లించాలని డిమాండ్ చేశారు. "మాట తప్పడం మీకు అలవాటే కానీ, ప్రాణాలు కోల్పోయిన పేద కార్మికుల కుటుంబాలను మోసం చేయవద్దు" అని హరీశ్ రావు వ్యాఖ్యానించారు.

Printed, Published & Owned by "Gouti Bala Sai Tilak" and Published at H.no : 12-13-1282, Flat No : 407, Mehtab Arcade, Tarnaka Main Road, Opp.Ganesh Temple, Secunderabad - 500017, Telangana State. Printed at "Gowrish Offset Printers". H.No : 3-4-353, Barkatpura, Hyderabad-500027. Telangana State. Editor : "Vempati Vijay Kumar". "RNI No: TELTEL/2021/80267". Email : prajaprashna@gmail.com. Cell No : 9494055588